తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 25.05.2025 | సంపుటి : 11 సంచిక : 306 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







# రాష్ట్రాలతో కలిసి పనిచేస్తాం

## ఐక్యతతో పనిచేస్తే అసాధ్యమనేదే లేదు: ప్రధాని మోదీ

- కేంద్ర,రాష్ట్రాలు టీమిండియాలాగా కలిసి పనిచేయాలి
- మన అభివృద్ధి వేగాన్ని మరింత పెంచాలి
- ప్రతి భారతీయుడి లక్ష్యం వికసిత్ భారత్
- నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాలాగా కలిసి పనిచేస్తే.. ఏ లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలో మోడీ అధ్యక్షతన శనివారం నీతి అయోగ్ 10వ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'మనం అభివృద్ధి వేగాన్ని పెంచాలి. కేంద్రం, అన్ని రాష్ట్రాలు కలిసి వచ్చి టీం ఇండియాలాగా కలిసి పనిచేస్తే ఏ లక్ష్యం అసాధ్యం కాదు అని చెప్పినట్లు- నీతి అయోగ్ ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడించింది. వికసిత్ భారత్ 2047 థీమ్‌తో ఈ కౌన్సిల్ సమావేశం జరిగినట్లు మోడీ వెల్లడిం చారు. ప్రతి భారతీయుడి లక్ష్యం వికసిత్ భారత్, ప్రతి రాష్ట్రం వికసిత్ అయినప్పుడు.. భారత్ కూడా వికసిత్ అవుతుంది. ఇది 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష అని మోడీ అన్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ నితిఅయోగ్ సమావేశానికి రాష్ట్రాలముఖ్యమంత్రులు, గవర్నర్లు హాజరవ్వాలి. కానీ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గతంలో లాగానే ఈ కౌన్సిల్‌కి హాజరవ్వ లేదు. ఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు నీతి ఆయోగ్ కి సంబంధించి కీలక సమావేశం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో 2047 వరకు అభివృద్ధి చెందిన భారతదేశ ప్రణాళికలపై చర్చించారు. ఈ సమావేశానికి ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యారు. ప్రధాని మోడీ వారితో టీ- తాగుతూ చర్చిస్తున్న ఫొటోలు మిగతా 2లో..

# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

- హైదరాబాద్ మెట్రోకు త్వరగా అనుమతులు ఇవ్వండి
- హైదరాబాద్ సమీపంలో డ్రై పోర్టు ఏర్పాటు చేస్తాం
- దీనికి అనుసంధానంగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, రైల్వేలైన్ ఏర్పాటు చేయండి
- ప్రధానితో ప్రత్యేకభేటిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని నరేంద్రమోదీతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. హైదరాబాద్ మెట్రోకు త్వరగా అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. మెట్రోకు మిగతా 2లో..

**ఫ్లాష్.. ఫ్లాష్..**

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు, సింగరేణి సకల జనుల సమ్మె కన్వీనర్

# కామ్రేడ్ ఎండి మునీర్ ఇకలేరు..



- గచ్చిబౌలి ఓమేగా ఆసుపత్రిలో కన్నుమూత
- శనివారం అర్ధరాత్రి 12.20 నిమిషాల ప్రాంతంలో వైద్యుల ప్రకటన
- శోకసంద్రంలో సింగరేణి ప్రాంతం

*తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు, సకల జనుల సమ్మె సింగరేణి కన్వీనర్, సీనియర్ పాత్రికేయుడు కామ్రేడ్ ఎండి మునీర్ (60) శనివారం అర్ధరాత్రి(ఆదివారం 12.20 నిమిషాలు) తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గచ్చిబౌలిలోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. చివరివరకు పోరాడారు. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రత్యేక వైద్యుల బృందం, సింగరేణి సంస్థ ఖర్చు భరిస్తూ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌తో మునీర్ కన్నుమూసినట్టు వైద్యులు ప్రకటించారు.*

**హైదరాబాద్, మే 24 (జనంసాక్షి)**

మంచిర్యాల జిల్లాలో పుట్టిన మునీర్‌కు నలుగురు సంతానం. ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు, భార్య ఉన్నారు. సింగరేణిలో ఉద్యోగిగా చేరిన ఆయనను జర్నలిస్టుగా పనిచేసేందుకు అప్పటి సింగరేణి యాజమాన్యం అభ్యంతరం చెప్పడంతో వెనకాముందు ఆలోచించకుండా తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అప్పటినుంచి చివరి వరకు పూర్తికాలం జర్నలిస్టుగా కొనసాగడానికి నిర్ణయించుకున్నారు. సుదీర్ఘకాలం ఆంధ్రజ్యోతి, కొంతకాలం నమస్తే తెలంగాణ, గత పదేళ్లుగా జనంసాక్షి పత్రికకు సేవలందించారు. సింగరేణి, ఉత్తర తెలంగాణలో జరిగిన అనేక ఉద్యమాలకు మునీర్ వెన్నుదన్నుగా నిలిచారు. తన కలంతో అణగారిన, సింగరేణి ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించేవారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సందర్భంలో 70వేల మంది సింగరేణి కార్మికులు పాల్గొన్న సకల జనుల సమ్మెకు మునీర్ వారిని సమాయత్తం చేశారు. ముందుండి సమ్మెను నడిపించారు. సింగరేణి సకల జనుల సమ్మె కన్వీనర్‌గా వ్యవహరించారు. అలాగే సింగరేణిలో విప్లవ సంఘాలతో కలిసి చేసిన పోరాటాలకు ప్రభుత్వాలు ఆయనపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించాయి. ఈ క్రమంలో కొంతకాలం మునీర్ జైలు జీవితం గడిపారు. ఈ నేపథ్యంలో ఆయన లేరనే వార్తతో సింగరేణి ప్రాంతం శోక సంద్రంలో మునిగిపోయింది. ఆయన తీర్చిదిద్దిన ఎంతోమంది పాత్రికేయులు సైతం కన్నీరు మున్నీరవుతున్నారు.

**జనంసాక్షి కాలమిస్టుగా ప్రత్యేక ముద్ర..**

మునీర్ తన ఊపిరి కోల్పోయే నాలుగైదు రోజుల ముందువరకూ అనునిత్యం ప్రజా సమస్యలపై, జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై, సింగరేణి కార్మికుల ఇబ్బందులపై జనంసాక్షి కాలమిస్టుగా, ప్రత్యేక ప్రతినిధిగా పనిచేశారు. దేశంలో ఏ మారుమూలన ప్రజలకు అన్యాయాలు జరిగినా తన కలంతో ప్రభుత్వాల తీరును నిలదీశారు. సింగరేణి ప్రాంతంలో దిక్కుమొక్కు లేని జనం మునీర్ మృతితో ఓ పెద్ద దిక్కును కోల్పోయిందని పలువురిలో ఆవేదన వ్యక్తమవుతోంది. మునీర్ కు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సింగరేణి సిఎండి బలరాం, మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృషి చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీసారు. కుటుంబ సభ్యులను ఎప్పటికప్పుడు ఓదార్చారు.



# కోవర్టులు అన్ని పార్టీల్లోనూ ఉంటారు

- మా పార్టీలోనూ ఉంటే ఉండొచ్చు
- సమయమొచ్చినప్పుడు వారే బయటపడతారు
- ఐనా ఇది సర్వసాధారణం
- బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది
- పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదు
- అంతర్గత విషయాలు అంతర్గతంగానే మాట్లాడటం మంచిది
- కవిత లేఖపై స్పందించిన కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**పార్టీ అధినేతకు సూచనలు చేయాలనుకుంటే లేఖలు రాయవచ్చునని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత లేఖపై కెటిఆర్ స్పందించారు. అంతర్గతంగా మాట్లాడే అంశాలు బయట మాట్లాడటం సరికాదని, పార్టీలో అందరం కార్యకర్తలమే..ఇది మిగతా 2లో..

# బనకచర్లకు అనుమతితో తెలంగాణకు తీవ్రనష్టం

గోదావరి జలాలను ఎత్తుకుపోతుంటే చూస్తారా?

ఇంత జరుగుతున్నా బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం విడ్డూరం

దీనిపై వెంటనే కేంద్రాన్ని, ఏపీని నిలదీయాలి

మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్



2లో

గుజరాత్‌లో పాక్ గూఢచారి,

# ఐఎస్ఐ ఏజెంట్ సహదేవ్ అరెస్టు

వైమానిక, బీఎస్ఎఫ్‌కు చెందిన కీలక సమాచారాన్ని చేరవేసినట్లు తీవ్ర ఆరోపణలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలతో గుజరాత్‌లో ఒక వ్యక్తి అరెస్టయ్యాడు. కచ్ సరిహద్దులో అతడిని అరెస్ట్ చేసినట్లు గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ప్రకటించింది. అతడి పేరు సహదేవ్ సింగ్ గోహిల్ అని, అతడు కచ్, దయాపుర్‌లో ఆరోగ్యకార్యకర్తగా పనిచేస్తున్నాడని వెల్లడించింది. భారత వైమానిక దళం బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ చెందిన కీలక సమాచారాన్ని

# పాక్ ఉగ్రదాడుల్లో భారత్‌లో వేలమంది చనిపోయారు

మూడు యుద్ధాలకు దాయాది దేశం కారణమైంది..

ఐరాసలో ధ్వజమెత్తిన ఇండియా

2లో

# కమిషన్లకు కక్కుర్తిపడే కాళేశ్వరం నిర్మాణం

## కాంగ్రెస్‌కు పేరొస్తుందనే తుమ్మిడిహట్టిని పక్కన పెట్టారు

- కాళేశ్వరం పేరుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు
- దీనితో తెలంగాణాకు శాశ్వతంగా నష్టం వాటిల్లింది
- బాంబులేసారని చెప్పడం హాస్యాస్పదం..అప్పుడు అధికారంలో ఉన్నది వారే.. మరి చర్యలు ఎందుకో తీసుకోలేదు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):

కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్ట్ లో భాగంగ తుమ్మడి హట్టి వద్ద నిర్మాణాలు చేపట్టి ఉంటే రాష్ట్రంలో నేడు ఈ పరిస్థితి ఉత్పన్న మయ్యే అవకాశం ఉండేది కాదని రాష్ట్ర నీటిపా రుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం కాంగ్రెస్ కు పేరు వస్తుందన్న దుర్బుద్ధితోటే అధికారంలో ఉన్న బి.ఆర్.ఎస్ పాలకులు తుమ్మడి హట్టిని పక్కన పెట్టి మెడిగడ్డ కు మార్చారని ఆయన ఆరో ఆదివారం హుజుర్నగర్, కోదాడ నియోజక వర్గాలలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి



కార్యక్రమాల పురోగతి పై సమీక్షా సమావేశాలు నిర్వహించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 38 వేల కోట్ల అంచానతో డిజైన్ చేయబడిన తుమ్మ డిహట్టిని పూర్తి చేస్తే కమిషన్లు రావన్న కక్కుర్తి తోటే మరో మూడు బ్యారేజ్‌ల మిగతా 2లో..




## వామపక్ష భావజాలన్ని అంతం చేయడం

# అసాధ్యం

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్

**గోదావరిఖని(జనంసాక్షి):**భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపధ్యంలో పార్టీని మరింత బలమైన రాజకీయ శక్తిగా ముందుకు తీసుకెళ్తామని, వామపక్ష భావజాలన్నీ అంతం చేయడం ఎవరి తరం కాదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా గోదావరి ఖని భాస్కర్ రావు భవన్ కు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మావోయిస్ట్ మిగతా 2లో..

# ఝార్ఖండ్‌లో ఎదురుకాల్పులు

ఇద్దరు మావోయిస్టులు మృతి

మృతుల్లో అగ్రనాయకుడు పప్పు లోహ్రా

**రాంచీ(జనంసాక్షి):**

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. శనివారం లతేహార్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఒక సీనియర్ మావోయిస్టు నాయకుడు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లతేహార్‌లో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో జేజేఎంపీ అగ్రనాయకుడు పప్పు లోహ్రా మరణించాడు. అతడిపై ఇప్పటికే రూ.10లక్షల రివార్డు ఉంది. పప్పు సహాయకుడు మిగతా 2లో..



# పోలవరం డెడ్‌స్టోరేజీ నుంచి ఎత్తిపోతలు సరికాదు

- దీనివల్ల గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది
- అభ్యంతరం తెలిపిన తెలంగాణ
- గోదావరి బోర్డుకు,పోలవరం అథారిటీకి లేఖ

**హైదరాబాద్(జనంసాక్షి):**పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రతిపాదనలపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ గోదావరి బోర్డుతోపాటు, పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాశారు. ఎత్తిపోతల పనులు ఆపినట్లు ఏప్రిల్ 8న జరిగిన పీపీఏలో పోలవరం చీఫ్ ఇంజినీర్ తెలిపినా.. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఏపీ సిద్ధమైందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జల సంఘం అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని, దీనివల్ల గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వాటిల్లుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం సబబు కాదని అన్నారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకూ నీటి లభ్యత లేదంటూ ఏపీ ప్రభుత్వం మిగతా 2లో..


# కేరళను తాకిన నైరుతి

**తిరువనంతపురం(జనంసాక్షి):**

నైరుతి రుతుపవనాలు శనివారం కేర ళను తాకా యి. దాదాపు ఎనిమిది రోజులు ముందుగానే కేరళలోకి రుతుప వనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. చివరిసారిగా 2009, 2001 సంవత్సరాల్లో ఇంత త్వరగా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించా యి. అప్పుడు మే 23న రాష్ట్రాన్ని రు తుపవనాలు తాకాయి. ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఇంత తొందరగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ముం దుగానే రుతుపవనాలు వస్తాయి ఐ ఎండి ఇప్పటికే తెలిపింది. ఈ క్రమంలో శనివరాం ఉదయం నైరుతి మిగతా 2లో..

# హైదరాబాద్‌లో భారీ వర్షం

- రానున్న ఐదురోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వానలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో రానున్న ఐదురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. రాబోయే రెండుమూడు రోజుల్లో తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఏపీ వరకు విస్తరించేందుకు పరిస్థి తులు అనుకూలంగానే ఉన్నాయని తెలిపింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశా లున్నాయని మిగతా 2లో..

## కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

రుతుపవనాలు కేరళను తాకాయని కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రెండు రోజుల్లో రుతుపవనాలు విస్తరిస్తాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించనున్నాయి. 2009లో మే 23న రుతుపవనాలు ప్రవేశించాయి. మళ్లీ ఇన్నాళ్లకు త్వరగా రుతుపవనాలు వచ్చాయి. సాధారణ తేదీ కంటే 8 రోజులు ముందే రుతుపవనాలు వచ్చినట్లు- ఐఎండీ పేర్కొంది. వాస్తవంగా రోహిణి కార్తె సమయంలో ఎండలు మండిపోతుంటాయి. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తలేదు. ఇక రోహిణి కార్తె మే 25 ఆదివారం రానుంది. ఇది జూన్ 8 వరకు ఉంటుంది. రాహిణి కార్తె సమయంలో ఎండలు భగభగ మండిపోతాయి. తీవ్ర ఉష్ణోగ్రతతో బండరాళ్లు కూడా పగిలిపోతాయంటారు. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు కనిపించకపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిసారిగా 1918 మే 11న రుతుపవనాలు ప్రవేశించిన రికార్డ్ ఉంది. అలాగే రుతుపవనాలు ఆలస్యంగా వచ్చిన రికార్డు ఉంది. 1972లో జూన్ 18న రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. గత 25 సంవత్సరాల్లో అత్యంత ఆలస్యంగా రుతుపవనాలు 2016లో వచ్చాయి. జూన్ 9న రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. ఇదిలా ఉంటే రుతుపవనాల రాకతో మే 29 వరకు కేరళ, తీరప్రాంత కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. తమిళనాడు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో కూడా రాబోయే ఐదు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు మరియు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

చెప్పింది. ఇక తెలంగాణలో రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశాలున్నాయని తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదివారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని పేర్కొంది. 26న నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో వానలు పడుతాయని చెప్పింది. 27న కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురుస్తాయని చెప్పింది. 28న ఆదిలాబాద్, కుమ్రంభీ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

## గుజరాత్‌లో పాక్ గూఢాచారి, ఐఎస్ఐ ఏజెంట్ సహదేవ్ అరెస్టు

షేర్ చేసినట్లు అతడి తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. 2023లో సహదేవ్‌కు వాట్సప్‌లో అదితి భరద్వాజ్ పేరుతో ఒక యువతి పరిచయమైంది. ఐఏఎఫ్, బీఎస్ఎఫ్‌కు చెందిన నూతన నిర్మాణాల ఫొటోలను ఆమెకు పంపినట్లు తమకు సమాచారం అందిందని ఏటీఎస్ అధికారి సిద్దార్థ్ మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటి దృశ్యాలను షేర్ చేసినట్లు చెప్పారు. మే ఒకటిన అతడిని ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు ఈ విషయాన్ని గుర్తించారని తెలిపారు. సహదేవ్ నుంచి సమాచారాన్ని సేకరించిన ఫోన్ నంబర్లు పాక్‌లో ఆపరేట్ అవుతున్నాయని ఫోరెన్సిక్ పరీక్షలో వెల్లడైందని చెప్పారు. అలాగే ఒక గుర్తుతెలియని వ్యక్తి నిందితుడికి రూ.40వేలు కూడా ఇచ్చారన్నారు. పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్ పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. రెండు వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 10 మందికిపైగా అరెస్టయిన సంగతి తెలిసిందే. వారిలో ఈ సహదేవ్ కూడా ఉన్నాడని ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులు పాక్ నిఘావర్గాలకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందన్నారు. వారి ఆర్థిక లావాదేవీలను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ కూడా చేస్తున్నట్లు చెప్పారు.

## భారత్‌లోకి చొరబాటుకు యత్నం..

### పాక్ జాతీయుడిని కాల్చివేసిన బీఎస్ఎఫ్


శ్రీనగర్(జనంసాక్షి):

భారత్‌లోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తిని సరిహద్దు భద్రతా దళాలు కాల్చివేశాయి. శుక్రవారం అర్ధరాత్రి గుజరాత్‌లోని బనస్కాంత్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా బలగాలు ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సరిహద్దును దాటి కంచె వైపునకు వస్తున్న ఓ పాకిస్థాన్ వ్యక్తిని గుర్తించాం. వెంటనే అప్రమత్తమై అతడిని నిలువరించేందుకు ప్రయత్నించాం. కానీ, అతడు ముందుకు రావడంతో కాల్పులు జరిపాం. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఇక పహల్గాం ఉగ్రదాడి అనంతరం సరిహద్దుల్లో భద్రతను బలగాలు కట్టుదిట్టం చేసిన సంగతి తెలిసిందే.పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను మన బలగాలు నేలమట్టం చేశాయి. దీన్ని సహించలేని పాక్ సైన్యం మనపై ఎదురుదాడికి ప్రయత్నించింది. వీటిని మన బలగాలు తిప్పికొట్టి పాక్‌ను చావుదెబ్బ తీశాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది.

## నా భర్తకు అమరవీరుడి హోదా ఇవ్వాలి

**లక్నో(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడి లో హనీమూన్ కోసం కశ్మీర్‌కు వెళ్లిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యాపారి శుభమ్ ద్వివేది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన కుటుంబం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో తమను కలుస్తానన్నారని పేర్కొన్నారు. మే 30న కాన్పూర్ ఎంపీ రమేష్ అవస్థి కార్యాలయంలో ప్రధాని తమను కలవనున్నారని శుభమ్ ద్వివేది తండ్రి తెలిపారు. పహల్గాం ఘటనలో ఉగ్రదాడిలో మొదటి తూటా తన భర్త ప్రాణాన్నే బలితీసుకుందని..అందుకు అయనకు అమరవీరుడి హోదాను ఇవ్వాలని శుభమ్ ద్వివేది భార్య ఇషానాయ్ ద్వివేది కొద్ది రోజుల క్రితం ప్రభుత్వాన్ని కోరారు.ఆ విషయాన్ని అమె గుర్తు చేస్తూ..తాము హిందువులం కాబట్టే ఉగ్రవాదులు తన భర్తను కాల్చి చంపారని అన్నారు. అతడి త్యాగాన్ని గుర్తిస్తూ..కేంద్ర ప్రభుత్వం తన భర్తకు అమరవీరుడి హోదాను ఇవ్వాలని ప్రధానిని స్వయంగా కోరుతామని తెలిపారు. ..ఈ గౌరవంతో అతడి మరణానికి తగిన న్యాయం జరగడమే కాక.. దేశం అందించే అత్యున్నత నివాళి అవుతుందని అన్నారు. ఇందుకు ప్రధాని మోదీ అంగీకరిస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌కు చెందిన శుభమ్ ద్వివేదికి.. ఇషానాయ్ ద్వివేది ఫిబ్రవరి 12న వివాహమైంది. వృత్తిరీత్యా బిజీగా ఉండే ద్వివేది.. తన భార్యతో కశ్మీర్‌కు విహార యాత్ర కోసం వెళ్లారు.

# రాష్ట్రాలతో కలిసి పనిచేస్తాం



కనిపించింది.జార్ఖండ్ ముఖ్య మంత్రి హేమంత్ సోరెన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతోనూ ప్రధాని మోదీ ముచ్చటించారు. ప్రతిపక్ష ముఖ్యమంత్రులను ప్రధాని మోదీ ఆప్యాయంగా పలకరించారు. మరో ఫోటోలో ప్రధాని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులను కలిసిన దృశ్యం కనిపించింది. చంద్రబాబు నాయుడు ఎన్డీఏ కూటమిలో భాగం. కానీ.. ప్రధాని మోదీ, ఎంకే స్టాలిన్‌కి మధ్య ఇటీ-వలి భాషా వివాదంపై వాడీవేడి రాజకీయం రాజుకున్న విషయం తెలిసిందే. భాషా వివాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కఠిన వైఖరి తీసుకున్నారు. చంద్రబాబు నాయుడు ఈ అంశంపై మిశ్రమ వైఖరిని కనబర్చినట్లు-అనిపించింది. అయితే, నీతి ఆయోగ్ సమావేశం తర్వాత భారత్ మండపంలో ఇద్దరు నాయకులు ప్రధాని మోడీతో చాలా ఆప్యాయంగా కనిపించారు. ముచ్చట్లు- పెడుతూ.. నవ్వులు పూయించారు. మరో ఫోటోలో కాంగ్రెస్ పాలిత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రధాని మోడీని కలిసిన దృశ్యాలు ఉన్నాయి. ఈ చిత్రంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా కనిపిస్తున్నారు. ప్రధాని మోడీ సీఎం రేవంత్ రెడ్డిని చాలా ఆప్యాయంగా పలకరించారు.ప్రధాని మోడీ సీఎం రేవంత్ రెడ్డిని చాలా ఆప్యాయంగా పలకరించారు ఈ సమావేశంలో, ప్రధాని మోడీ రాష్ట్రాలకు ఓ విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి వేగాన్ని పెంచాలని, కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తే ఏ లక్ష్యమూ అసాధ్యం కాదని ప్రధాని అన్నారు. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.

## రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

త్వరగా అనుమతి ఇచ్చేలా పట్టణాభివృద్ధిశాఖను ఆదేశించాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగానికి, దక్షిణ భాగానికి ఒకేసారి ఆర్థిక, మంత్రివర్గ అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం భూసేకరణకు 50శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా గ్రీన్‌ఫీల్డ్ రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సమీపంలో డ్రై పోర్టు ఏర్పాటు చేస్తామని, ఈ డ్రైపోర్టును మచిలీపట్నం పోర్టుకు అనుసంధానానికి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరారు.

## కోవర్టులు అన్ని పార్టీల్లోనూ ఉంటారు

అందరికీ వర్తిస్తుందని చెప్పారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, కోవరు ్టలు సమయం వచ్చినప్పుడు వారే బయటపడతారని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారని, తమ పార్టీలోనూ సిఎం రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చునని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు పెట్టాం.. అసెంబ్లీలో ఓడిపోయాం.. ఎలా ముందుకు పోవాలని 17 రోజుల పాటు- వేల మంది కార్యకర్తలతో చర్చించాం. ఆ ప్రాసెస్‌లో చాలా మంది డైరెక్ట్‌గా మైక్‌లో మాట్లాడిన వారు ఉన్నారు. కొంత మంది చిట్టీల మీద రాసిచ్చిన వారు ఉన్నారు. కొంత మంది కేసీఆర్‌కు ఉత్తరం అందించండి అని ఉత్తరాలు ఇచ్చిన వారు ఉన్నారు. మా పార్టీలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది. మా పార్టీ అధ్యక్షుడికి ఏవైనా సూచనలు చేయాలను కుంటే ఉత్తరాలు రాయొచ్చు. మా పార్టీలో డెమోక్రసీ ఉంది కాబట్టి.. సూచనలు సలహాలు చేస్తూ అధ్యక్షుడికి లిఖిత పూర్వకంగా, ఓరల్‌గా ఇవ్వొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీలో ఏ హోదాలో ఉన్నా.. అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటది. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంది.. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు.. వారిని కూడా కలిసే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని విషయాలు అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటు-ంది.. ఇది అందరికీ వర్తిస్తుంది. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు.. అందులో రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు అని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ అని,దెయ్యం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. హైకమాండ్ కు డబ్బులిస్తూ రేవంత్ పదవి కాపాడుకుంటున్నారని, ఇడి ఛార్జ్‌షీట్‌లో పేరున్న రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. నాడు ఓటుకు నోటు స్కామ్.. ఇది సీటుకు రూటు- స్కామ్ అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. నైతికత ఉంటే ముఖ్యమంత్రి స్వచ్ఛందం గా తప్పుకోవాలని, ఆయన తప్పుకోకుంటే అధిష్టానం తొలగించాలని సూచించారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదని, మూటల మనిషి అని



చురకలంటించారు. రేవంత్ దిల్లీ వెళ్లి చీకట్లో బిజెపి నేతల కాళ్లు పట్టుకుంటున్నారని, అమిత్ షాను రాత్రి కలిసిన రేవంత్ బయటికొచ్చిగట్టిగా మాట్లాడా రని మండిపడ్డారు. నిందలు, దందాలు, చందాలు ఇదే రేవంత్ పని అని విమర్శలు గుప్పించారు. బిఆర్‌ఎస్ పై నిందలు, కాంట్రాక్టర్లతో దందాలు, దిల్లీకి చందాలు అని కెటిఆర్ దుయ్యబట్టారు. బిజెపి ఎంపిల భూదందాలకు సిఎం వత్తాసు పలుకుతున్నారని, బిజెపి నేతలు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. అందుకే నేషనల్ హెరాల్డ్ కేసుపై నేతలు మాట్లాడట్లేదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే అన్ని అంశాలపై కేంద్రం చర్య తీసుకోవాలని కెటిఆర్ కోరారు. కేంద్రం స్పందన కోసం నెలరోజులు ఎదురు చూస్తామని, నెల తర్వాత పార్టీలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తాం అని కెటిఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్.. దయ్యం రేవంత్ రెడ్డి.. ఈ దయ్యాన్ని, శనిని ఎలా వదిలించాలనేది మా టార్గెట్‌అన్నారు.

## దేశంలో మళ్లీ కరోనా కలకలం

ఎల్ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం వెల్లడించింది. ఎన్‌బీ.1.8.1 రకం కేసు ఏప్రిల్‌లో బయటపడగా.. ఎల్ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులు మేలో గుర్తించినట్లు తెలిపింది. అవి తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి. దిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులను గుర్తిస్తున్నారు. మూడేళ్లలో తొలిసారి దిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాంతో అన్ని ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు.దిల్లీలో కేసులతో అక్కడి భాజపా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్స్, వ్యాక్సిన్ల లభ్యత సరిచూసుకోవాలని సూచించింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను పొందుపర్చాలని ఆదేశించింది. వైరస్ వేరియంట్లలో కలిగే మార్పులు ప్రస్తుత వ్యాప్తికి సంబంధం ఉందని, దీంతోపాటు ఇమ్యూనిటీ తగ్గడం కూడా మరో కారణంగా పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' మాత్రమేనని, ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇదివరకే స్పష్టం చేసింది.

## పాక్ ఉగ్రదాడుల్లో భారత్‌లో వేలమంది చనిపోయారు

- మూడు యుద్దాలకు దాయాది దేశం కారణమైంది
- ఐరాసలో ఇండియా

**న్యూయార్క్(జనంసాక్షి):** సింధు జలాల ఒప్పందంపై ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ చేసిన తప్పుడు ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. భారత్‌పై వేలాది ఉగ్రదాడులు చేయడంతో పాటు మూడు యుద్ధాలకు పాకిస్థాన్ కారణమైందని వెల్లడించింది. సింధూ జలాల ఒప్పందం స్ఫూర్తిని పాక్ ఉల్లంఘించిందని దుయ్యబట్టింది. గత నాలుగు దశాబ్దాల్లో.. ఉగ్రదాడుల్లో భారత్‌లో 20వేల మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. సీమాంతర ఉగ్రవాదాన్ని పాక్ ఆపే వరకు సింధు జలాల ఒప్పందం నిలివేత కొనసాగుతుందని భారత్ స్పష్టం చేసింది

## పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతలు సరికాదు

అభ్యంతరం చెబుతోందని, మరోవైపు ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్ స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం సబబు కాదని అనిల్‌కుమార్ లేఖలో పేర్కొన్నారు. డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సీడబ్ల్యూసీ అనుమతులకు విరుద్ధమని తెలంగాణ వాదిస్తోంది. సీడబ్ల్యూసీ వెంటనే జోక్యం చేసుకొని ఏపీని అడ్డుకోవాలని అనిల్‌కుమార్ కోరారు. పోలవరం నుంచి ఎత్తిపోతల చేపట్టకుండా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు కూడా ఇది విరుద్ధంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టుపై ఏపీ ముందుకు వెళ్లకుండా నిలువరించాలని కోరారు.

## ఝార్ఖండ్‌లో ఎదురుకాల్పులు..

ప్రభాత్ గుంజు కూడా హతమయ్యాడు. అతడిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. ఈ కాల్పుల్లో మరో మావోయిస్టుకి గాయాల య్యాయి. అతడిని అరెస్టు చేసి.. ఒక రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నాం. ఇటీవల ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ కూడా ప్రాణాలు కోల్పోయారు.

## వామపక్ష భావజాలన్ని అంతం చేయడం అసాధ్యం

నేతలను ఎన్కౌంటర్ పేరుతో చంపుతూ పైచాచిక ఆనందాన్ని పొందుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ఆరోపించారు. మావోయిస్ట్ పార్టీ ప్రభుత్వం తో శాంతి చర్చలు జరుపుతామని ఆయుధాలను పక్కన పెట్టి కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత నక్సలైట్ల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టడం హేయమైన చర్య అని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.ఉగ్రవాదాన్ని అంతం చేయడం లో విఫలమైన కేంద్ర ప్రభుత్వం ప్రజల దృష్టి మరల్చడానికే ఆపరేషన్ కగార్ ను చేపట్టిందని తెలిపారు.అలాగే సిపిఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్ లో చండీఘర్ లో , తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆగస్టు లో మేడ్చల్ జిల్లాలో జరుగన్నాయని ఆలోపు శాఖ,పట్టణ, మండల జిల్లా మహాసభలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకరన్న, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాంద్ర సదానందం లు మాట్లాడారు. ఈ సమావేశం లో జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ గోసిక మోహన్, జిల్లా పూర్వ కార్యదర్శి కామ్రేడ్ గౌతం గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కె.కనకరాజ్ , తాళ్ళ పెల్లి మల్లయ్య, కొడం స్వామి, తదితరులు పాల్గొన్నారు.అనంతరం పాత్రికేయ మిత్రులతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, సిపిఐ మరియు ప్రజాసంఘాల నాయకులు తాళ్ళ పెల్లి లక్ష్మణ్, మర్కా పూరి సూర్య, రేణుకుంట్ల ప్రీతం, తాళ్ళ పెల్లి సురేందర్, మాతంగి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కమిషన్లకు కక్కుర్తిపడే కాళేశ్వరం నిర్మాణం

నిర్మాణాలకు పూనుకొని రాష్ట్రాన్ని అప్పుల పాలు జేశారని ఆయన మండిపడ్డారుముందుగా వేసుకున్న అంచనాలను మూడింతలకు పెంచి అంటే 38 వేల కోట్ల నుండి ఒక్కసారిగా లక్షా 20 వేల కోట్లకు పెంచి కాళేశ్వరం పేరుతో నిర్మించిన ప్రాజెక్ట్ వారి ప్రభుత్వ హయాంలోనే కూలిపోవడాన్ని మించి మరో ఉదాహరణ అక్కర లేదని ఆయన ఎద్దేవా చేశారు.అదే 38 వేల కోట్లతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించ తల పెట్టిన తుమ్మడిహట్టిని పూర్తి చేసి ఉంటే మిగిలిన 62 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న పాలమూరు-రంగారెడ్డి,భీమా,నెట్టెం పాడు,కల్వకుర్తి, ఎస్.ఎల్.బి.సి,డిండి,ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన సీతారామా,దేవాదుల, గౌరెల్లి ప్రాజెక్టులు పూర్తి అయి యావత్ తెలంగాణా రాష్ట్రం సస్యశ్యామలంగా ఫరిడవిల్లి ఉండదన్నారు. బి.ఆర్.ఎస్ పాలకులు కాళేశ్వరం పేరుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని ఆయన దుయ్యబట్టారు. వారు చేసిన అప్పులు భవిష్యత్ లో మూడు తరాలకు భారంగా పరిణమించనుందన్నారు.అహంకారం, అసమర్థత,అవగాహనా రాహిత్యంతో నీటిపారుదల రంగాన్ని భ్రష్టు పట్టించిన ఘనత ముమ్మాటికి బి.ఆర్.ఎస్ పాలకులకు దక్కుతుందన్నారు. దీనితో తెలంగాణా రాష్ట్రానికి శాశ్వత నష్టదాయకాంగ పరిణమించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు ఎన్.డి.ఎస్.ఎ నివేదిక వెలుగు చూడంగానే భుజాలు దులుపుకుంటున్న బి.ఆర్.ఎస్ నేతలు అప్పుడు బాంబులు పద్దాయోమోనని బొంకుతుండడం హాస్యాస్పదంగా వుందన్నారు.వారు చెప్పిన రీతిలో బాంబులు పడింది నిజమే అయినప్పుడు అప్పుడు అధికారంలో ఉన్నది వారేగా చర్యలు ఎందుకు తీసుకోలేక పోయారో అన్నది ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అధికారం కోల్పోయి 16 నెలలు గడిచాక బాంబులు పేలాయన్నది ఇప్పుడు బి.ఆర్ ఎస్ నేతలకు గుర్తుకు వచ్చిందా అని ఆయన ఎద్దేవాచేశారు.వాస్తవానికి ఆ మూడు బ్యారేజ్ ల నిర్మాణాలు లోప భూఇష్టంగా మారాయని ఏజెన్సీలు, ఇంజినీర్లు,నిర్మాణదారులు అరచి గీ పెట్టుకున్నాకమిషన్ లకు కక్కుర్తి పడిన బి.ఆర్.ఎస్ పాలకులు పేడ చెవిన పెట్టిన ఫలితమే కాళేశ్వరం ఉదంతమన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన రాజీవ్ సాగర్ ప్రాజెక్టును సీతారామ ప్రాజెక్టుగా,డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ చేవెళ్ల-ప్రాణహిత సుజల స్రవంతి పేరు మార్చి కాళేశ్వరం ప్రాజెక్టుగా నామకరణం చేసి పాత పేర్లను తొలగించడంలో అర్థం ఏమిటని ఆయన నిలదీశారు.ఇందిర,రాజీవ్,డాక్టర్ బి.ఆర్ అంబెద్కర్ ల పేర్లు అంటే బి ఆర్ ఎస్ పాలకులకు ఎందుకంత అసుయో అన్నది భోద పడడం లేదని ఆయన వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ఉదంతం పై జస్టిస్ ఘోష్ కమిటీ నిష్పక్షపాతంగా ,పార దర్శకంగా విచారణ జరుపుతోందన్నారు.తుది నివేదికను అనుసరించి చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.ప్రజలు ఇచ్చిన తీర్పు ననుసరించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.ముందెన్నడూ లేని రీతిలో సన్నాలకు బోనస్ అందించిన చరిత కాంగ్రెస్ ప్రభుత్వంతోటే మొదలు కావడం చారిత్రత్మక ఘట్టంగా నిలిచి పోతుందన్నారు.ఆకాశమార్గాన విహరిస్తూ ఇంజినీరింగ్ నిపుణులు చెప్పేది పక్కన పెట్టి అహంకార పూరితంగా నాటి పాలకులు ఇచ్చిన ఆదేశాలు అమలు పరిచినందుకే కాళేశ్వరం కుప్ప కూలి పోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా విమర్శించారు.

## గాజాలో పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారు

### 19వేల మంది చిన్నారులను అన్యాయంగా చంపేశారు.. ఇజ్రాయెల్ పార్లమెంటులో ఆ దేశ ఎంపీ ఆరోపణ

**టెల్‌అవీవ్(జనంసాక్షి):** ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలతో గాజాలోని సామాన్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. దీనిపై తాజాగా ఇజ్రాయెల్ ఎంపీ ఐమన్ ఒడె అక్కడి పార్లమెంటులో గళమెత్తారు.గాజాపై టెల్‌అవీవ్ చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈక్రమంలోనే అక్కడి అధికారులు ఐమన్‌ను పోడియం నుంచి పక్కకు లాక్కెళ్లారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'దాదాపు ఏడాదిన్నరగా మీరు 19వేల మంది చిన్నారుల ప్రాణాలు తీశారు. 53వేల మంది నివాసితులను చంపేశారు. అన్ని విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను నాశనం చేశారు. అయినప్పటికీ.. రాజకీయపరంగా విజయం సాధించామనే భావనకు రాలేకపోతున్న పిచ్చివాళ్లు మీరు' అని ఒడె ఆరోపణలు చేశారు. ఆయన మాటలతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఐమన్ వ్యాఖ్యలను పార్లమెంటులోని కొందరు సభ్యులు వ్యతిరేకించారు. ఈక్రమంలో ఆయన ప్రసంగిస్తుండగానే అక్కడి అధికారులు పోడియం నుంచి పక్కకు లాక్కెళ్లారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇక, ఇటీవల గాజాపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం చేసింది. దీంతో టెల్‌అవీవ్ చర్యలపై అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలోనే ఐడీఎఫ్ విశ్రాంత చీఫ్ యాయిర్ గొలాన్ కూడా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై ఇటీవల మండిపడ్డారు. చిన్నారులను చంపడం హాబీగా మారిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతోన్న పోరులో 53 వేల మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. గత 24 గంటల్లో 60 మంది పౌరులు మరణించారని తెలిపింది. గాజా ప్రాంతంలో మానవతా సాయాన్ని పరిమితంగా అందించేందుకు ఇజ్రాయెల్ అనుమతిచ్చింది. అయితే, ఇది అక్కడి ప్రజలకు ఏమాత్రం సరిపోదనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు.. గాజా మొత్తాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటామని నెతన్యాహు ప్రకటించారు.

## పూంఛ్ బాధిత కుటుంబాలకు రాహుల్ పరామర్శ

శ్రీనగర్(జనంసాక్షి):

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పూంఛ్ ప్రాంతంలో పర్యటించారు. ఇటీవల భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఘర్షణ నేపథ్యంలో దాయాది చర్యలకు జమ్మూకశ్మీర్ సరిహద్దు గ్రామాలు దెబ్బతిన్నాయి. పాక్ దాడుల కారణంగా పూంఛ్ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా ప్రభావితమయ్యారు. 25 మంది ప్రాణాలు కోల్పో యారు. అనేక గృహాలు దెబ్బతిన్నాయి. ఈక్రమంలోనే బాధిత కుటుంబాలను కలుసుకునేందుకు రాహుల్ శనివారం అక్కడ పర్యటించారు. పూంఛ్‌లోని బాధితులను కలిసి వారి నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. ఈ పర్యటన సందర్భంగా ఆ ప్రాంతంలోని ఒక పాఠశాలకు రాహుల్ వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. తన పర్యటనకు సంబంధించిన వీడియోను రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## ఆపరేషన్ సిందూర్‌లో 200 మందికి పైగా మృతి..

### అందులో ఉగ్రవాదులే అత్యధికం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఉగ్రవాదుల ఏరివేత కోసం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్‌లో కొత్త వివరాలు బయటికొచ్చాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా న్యూదిల్లీ జరిపిన ఈ దాడుల్లో పాక్‌లో 200 మందికి పైగా మృతి చెందినట్లు సమాచారం. వీరిలో అత్యధికులు ఉగ్రవాదులు కాగా.. మిలిటరీ సిబ్బంది కూడా ఉన్నారు. ఈమేరకు రక్షణశాఖ వర్గాలు వెల్లడించినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. మే 7వ తేదీన పాక్, పీఓకేలోని తొమ్మిది ఉగ్రశిబిరాలపై భారత్ మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో 170 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ఉగ్రముఠా ప్రధాన కేంద్రం తీవ్రంగా ధ్వంసమవ్వగా.. ఇక్కడే ఎక్కువ మంది ఉగ్రవాదులు హతమైనట్లు పేర్కొన్నాయి. భారత్ దాడులకు ప్రతిగా సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీంతో పాక్ ఆట కట్టించేందుకు శత్రుదేశం సైనిక స్థావరాలపై భారత్ బ్రహ్మోస్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో పాక్ కీలక సైనిక స్థావరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇందులో 42 మంది మిలిటరీ సిబ్బంది మరణించినట్లు రక్షణశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఇక, భారత్ వైపు ఏడుగురు జవాన్లు అమరులైనట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. "అన్ని లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంలో ఛేదించాం. మన సైనిక సామర్థ్యాలకు ఈ ఆపరేషన్ నిదర్శనం. అత్యంత ముప్పుతో కూడిన ఈ ఆపరేషన్‌లో పలువురు మహిళా పైలట్లు ప్రత్యక్షంగా కీలక పాత్ర పోషించారు. యుద్ధ విధుల్లో మహిళల పాత్ర పెరుగుతుందని చెప్పేందుకు ఇదే సరైన ఉదాహరణ" అని రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.అయితే, ఆపరేషన్ సిందూర్ ఇంకా ఆగిపోలేదని, ప్రస్తుతానికి తాత్కాలికంగా నిలిపివేశామని సదరు వర్గాలు తెలిపాయి. "మన ఆపరేషన్‌తో పాక్‌కు భారీ అవమానం జరిగింది. కచ్చితంగా ఆ దేశం నుంచి ప్రతిస్పందన ఉంటుందని అంచనా వేయొచ్చు.

# ప్రతి జిల్లాలో ఫోరెన్సిక్ యూనిట్ ఏర్పాటు చేస్తాం

- ఇకపై ఫోరెన్సిక్ కేంద్రాల్లో ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఆటోమేటెడ్ సిస్టమ్ సేవల అమలు
- రూ. 2254.43 కోట్ల వ్యయంతో జాతీయ న్యాయ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం
- చండీఘర్‌లోని ఆలిండియా సీఎఫ్ఎస్ఎల్, ఎస్ఎఫ్ఎల్ డైరెక్టర్ల సమావేశం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి



**చండీఘర్ (జనంసాక్షి) :** ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి జిల్లాలోనూ తప్పనిసరిగా ఫోరెన్సిక్ యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. దీంతోపాటు అధునాతన పరికరాలతో ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీలను విస్తరిస్తామని చెప్పారు. 'నూతన నేర చట్టాల నేపథ్యంలో 'ఫోరెన్సిక్ సైన్స్ సేవల బలోపేతం' అంశంపై చండీఘర్ లోని ఫోరెన్సిక్ సెంట్రల్ సైన్స్ లాబోరేటరీ కార్యాలయంలో గత రెండ్రోజులుగా ఆలిండియా సీఎఫ్ఎస్ఎల్, ఎస్ఎఫ్ఎల్ డైరెక్టర్ల సమావేశం కొనసాగింది. అందులో భాగంగా ఈరోజు సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫోరెన్సిక్ సైన్స్ చీఫ్ సైంటిస్ట్ ఎస్ కే జైన్, సుఖ్మిందర్ కౌర్, ఎ.కె.శర్మ, ఐపీఎస్ కన్వర్ దీప్ కౌర్ తదితరులు హాజరైన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఈ కొత్త చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలంటే నేర దర్యాప్తులో సైంటిఫిక్ ఎవిడెన్స్ ను ఫోరెన్సిక్ అధికారులు సేకరించడాన్ని తప్పనిసరిగా చేశాయని, ఈ మార్పుతో ఇప్పటి వరకు సహాయకంగా ఉన్న ఫోరెన్సిక్ శాస్త్రం ఇక నుండి న్యాయ ప్రక్రియలో సెంటర్ పాయింట్ (కేంద్ర బిందువు) కాబోతోందని అన్నారు. చాలా రాష్ట్రాల్లో ఇప్పటికీ సరైన ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాలు లేవు. శిక్షణ పొందిన ఫోరెన్సిక్ సైంటిస్టుల కొరత తీవ్రంగా ఉంది. రిపోర్టులు రడీ చేయడంలో చాలా ఆలస్యమైతుందన్నారు. పెండింగ్ కేసులవల్ల న్యాయ ప్రక్రియను బలహీనపరుస్తున్నాయని, అత్యాధునిక పరికరాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం చాలా లాబోరేటరీల్లో లేదని, ప్రతి సవాలూ మనకు ఒక అవకాశమే. మరింత దృఢంగా పనిచేసేందుకు, ధైర్యంగా ముందడుగు వేసి సంస్కరణలు తీసుకురావడానికి ఇది మంచి అవకాశమని, అందులో భాగంగా ఫోరెన్సిక్ సేవలను సంస్థాగతంగా విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రతి రాష్ట్రంలో ఆధునిక పరికరాలతో కూడిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లను స్థాపించటం, నేరస్థుల వద్దే ఆధారాలను సేకరించేందుకు మొబైల్ యూనిట్లను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 2025 నాటికి ప్రతి జిల్లాలో ఒక ప్రభావవంతమైన ఫోరెన్సిక్ యూనిట్ ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక, శిక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఫోరెన్సిక్ పరిశోధన ఆధారంగా శాస్త్రీయంగా, సమయపాలనతో నడిచే సమర్థవంతమైన క్రిమినల్ న్యాయ వ్యవస్థను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ఈ పథకం న్యాయ ప్రక్రియను మరింత సమర్థవంతంగా మార్చడానికి నాణ్యమైన, శిక్షణ పొందిన ఫోరెన్సిక్ నిపుణుల అవసరముందని తెలిపారు. కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి రావడంతో, 7 సంవత్సరాల లేదా అంతకంటే ఎక్కువ శిక్ష ఉన్న నేరాల కోసం ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి అయిందని, ఫోరెన్సిక్ ప్రయోగశాలలపై పని భారము గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, దేశవ్యాప్తంగా ఉన్న ఫోరెన్సిక్ ప్రయోగశాలల్లో శిక్షణ పొందిన నిపుణుల కొరత కూడా పెద్ద సమస్యగా ఉందని, ఈ పెరుగుతున్న డిమాండ్‌ను అధిగమించేందుకు జాతీయ స్థాయి ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల్లో భారీగా పెట్టుబడులు పెట్టి విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్ఎఫ్ఎస్‌యూ అనుబంధ క్యాంపసులు, కొత్త సీఎఫ్ ఎస్ఎల్‌ల ద్వారా శిక్షణ పొందిన ఫోరెన్సిక్ మానవ వనరుల కొరతను తగ్గిస్తాయి. ప్రయోగశాలలపై కేసుల ఒత్తిడిని, పెండింగ్‌ను తగ్గిస్తాయని తెలిపారు.

## చిత్తవుతున్న ధాన్యం రైతులు

- దిక్కులేక దళారులను ఆశ్రయిస్తున్న రైతన్న

**ఆదిలాబాద్, మే24 (జనంసాక్షి) :** ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నా వారిని పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. కొనుగోలులో అవకతవకలు జరుగకుండా ఉండాలనే ఆలోచనతో రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా తేమశాతం పేరుతో తరుగు తీస్తున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగాకొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## కుటుంబ సమస్యలతో తప్పకున్న మిల్లా మాగీ

- మిస్ వరల్డ్ సంస్థ ఛైర్‌పర్సన్ జూలియా మోర్లే వివరణ





**హైదరాబాద్, మే24 (జనంసాక్షి) :** ఇండియాలో హైదరాబాద్ వేదికగా జరుగుతున్న 72వ మిస్ వరల్డ్ పోటీల నుండి మిస్ ఇంగ్లాండ్ 2025 - మిల్లా మాగీ వైదొలగిన విషయాలపై మిస్ వరల్డ్ సంస్థ స్పందించింది. ఇటీవల బ్రిటిష్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాలపై మిస్ వరల్డ్ సంస్థ ఛైర్‌పర్సన్, జూలియా మోర్లే శనివారం స్పందించారు. ఆ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, మిస్ ఇంగ్లాండ్ మాగీ ఆరోపణలను ఖండించారు. ఈ నెల ప్రారంభంలో, మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ తన తల్లి, కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి సంబంధించి అత్యవసర పరిస్థితి కారణంగా ఈ పోటీల నుంచి విరమించుకోవాలని సంస్థను కోరినట్లు ఆమె తెలిపారు. మిల్లా పరిస్థితిని అర్థం చేసుకొని జూలియా మోర్లే వెంటనే స్పందించి, ఆమె కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యతగా పరిగణించారు. తక్షణమే ఆమెను ఇంగ్లాండ్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు- చేసినట్లు ఆమె పేర్కొన్నారు. మిస్ మిల్లా మిస్ వరల్డ్ పోటీల నుండి వైదొలిగిన తర్వాత, మిస్ ఇంగ్లాండ్ 1వ రన్నరప్ అయిన మిస్ షార్లెట్ గ్రాంట్ ఆమె ఇంగ్లాండ్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ముందు కొచ్చారని జూలియా మోర్లే ఆ ప్రకటనలో తెలిపారు. మిస్ షార్లెట్ బుధవారం ఇండియా కు చేరుకున్నారని, మిస్ వరల్డ్ సోదరభావంతో ఆమెను పోటీ- లలో పాల్గొనటకు అనుమతించడం జరిగిందని ఈ పోటీలలో ఆమె పాల్గొంటున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. ఇటీవల బ్రిటిష్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాలపై, కొన్ని మీడియా సంస్థలు మిల్లా మాగీ పోటీలలో ఎదుర్కొన్న అనుభవాలపై తప్పుడు, అపవాద కరమైన కథనాలను ప్రచురించినట్లు- సంస్థకు తెలియడంతో ఆ ఆరోపణలను ఖండిస్తూ, ఆ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని జూలియా మోర్లే ఆ ప్రకటనలో తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ సమయంలో మిస్ మిల్లా మాగీ స్వయంగా వ్యక్తపరిచిన భావాలు, ఎడిట్ చేయని వీడియో క్లిప్ లను మిస్ వరల్డ్ సంస్థ విడుదల చేసింది. అందులో ఆమె ఆనందాన్ని, కృతజ్ఞతను, ఈ అనుభవాన్ని మెచ్చుకుంటూ మాట్లాడిన దృశ్యాలు కూడా ఉన్నాయి. తాజాగా ప్రచురితమైన తప్పుడు కథనాలు నిరాధారమైనవని, ఆ ఆరోపణలను ఖండిస్తూ జూలియా మోర్లే ఆ ప్రకటనలో వివరించారు.

## ఆదివాసులపై జరుగుతున్న మానవ హననాన్ని నిలిపివేయాలి

- కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కొన్ని రోజులుగా ఆదివాసి ప్రాంతాల్లో జరుగుతున్న ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తూ, కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్ట్ లతో శాంతి చర్చలు జరపాలని ఓయు ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజి ముందు జరిగిన ప్రెస్ మీట్ లో అన్ని విద్యార్థి సంఘాలు ఆదివాసుల హననాన్ని తీవ్రంగా పరిగణించాయి. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా కార్పొరేట్ల, మైనింగ్ మాఫియాల ప్రయోజనాల కోసం చేస్తుంది అని తెలియజేశారు. ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న దేశ సంపదను కొంత మందికి అందించడానికే ఆదివాసులను, ఆదివాసులకు రక్షణగా ఉన్న మావోయిస్ట్ లను నిర్మూలన చేస్తుందన్నారు. గత కొన్ని నెలలుగా మావోయిస్టులు శాంతి చర్చల ప్రతిపాదన పెడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం వెనక అనేక కుట్ర కోణాలున్నాయన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం, రాజ్యాంగబద్ధంగా ప్రవర్తించాల్సిన కేంద్ర ప్రభుత్వం దానిని విస్మరించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కొన్ని దశాబ్దాలుగా పీడిత ప్రజల కోసం, దళితుల కోసం, ఆదివాసుల కోసం మాట్లాడుతున్న మావోయిస్టులను నిర్మూలన చేయాలనుకోవడం ప్రభుత్వాల అణచివేత ధోరణిని బహిర్గత పరుస్తున్నాయని చెప్పారు. ఎన్నో ఉన్నత చదువులు చదివి, వ్యక్తిగత జీవితాన్ని వదిలేసుకొని, ప్రజల కోసం జీవిస్తున్న మావోయిస్టులు కూడా భారతదేశ పౌరులేనని మరిచిపోవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఒక రాజకీయ పార్టీ కేంద్ర కార్యదర్శిని అనారోగ్య పరిస్థితులలో పట్టుకుని ఎన్కౌంటర్ పేరు మీద హత్య చేయడం అత్యంత హేయమైన చర్య అని తెలియజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమ కారిణి విజయలక్ష్మిని హత్య చేయడం పట్ల తెలంగాణ రాజకీయ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ హత్యలన్నిటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సుప్రీం కోర్టు ఈ మారణ కాండను సుమోటోగా స్వీకరించాలని దేశ అత్యున్నత న్యాయవ్యవస్థకు విన్నవించారు. ఈ ప్రెస్ మీట్ లో రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆజాద్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జార్జ్ రెడ్డి ఎస్.నాగేశ్వర్ రావు, లా స్టూడెంట్స్ జేఏసీ కన్వీనర్ శ్రీకాంత్, టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుదరి హరిషగౌడ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ ఓయూ ప్రెసిడెంట్ లెనిన్, ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షుడు అజయ్, ఆదివాసీ విద్యార్థి సంగం రాష్ట్ర అధ్యక్షుడు సాగబోయిన పాపారావు, పీడీఎస్‌యూ (విజృంభణ)రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, ఎస్‌టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్,ఏఎంఎస్ఏ రాష్ట్ర నాయకులు సైదులు, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జంగయ్య, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్, గిరిజన శక్తి ఓయూ అధ్యక్షుడు హనుమంతు నాయక్, పీఎస్ఏ రాజశేకేర్, విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరిగిన ధాన్యం దిగుబడులు

- మద్దతు ధరలకు కొనుగోళ్లు

**భద్రాద్రి కొత్తగూడెం, మే24 (జనంసాక్షి) :** గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం దిగుబడి కూడా ఎక్కువగా పెరిగిందని అధికారులు అంటున్నారు. దీనికి తోడు ధాన్యం మద్దతు ధర కూడా పెరిగినందున రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయాలు జరిపే అవకాశాలు ఉన్నాయి. దళారుల ప్రమేయం లేకుండా రైతులకు అన్ని సౌర్యాలు కల్పించారు. ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో సొమ్ములను జమ చేశారు. రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతుధర ఇచ్చిన కొను గోలు చేస్తోంది. అంచనాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జీసీసీ,ఐకేపీ, కోపరేటివ్ సొసైటీల ద్వారా ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అందుబాటులోకి గన్నీ బ్యాగ్‌లను కూడా ఉంచారు. రైతులు విక్రయానికి తీసుకు వచ్చిన ధాన్యానికి వెంటనే పేమెంట్లు చేసేవిధంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అన్నారు. రెండు లక్షల 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణ యించారు. ఇంకా కొన్ని ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టుల కింద వరి కోతలు జరగనందున చాలా ధాన్యం పొలాల్లోనే ఉండిపోయింది.

## షష్టిపూర్తి మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల



**హైదరాబాద్ (జనం సాక్షి) :** ఆద్య కన్వెన్షన్ పెద్ద అంబర్ పేట లో శ్రీ వేంకటరమణ గోల్డ్ అండ్ డైమండ్ అధినేత పాలబట్ల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకే సారి 150 మందికి కలిపి జరిపిన షష్టిపూర్తి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలబట్ల వెంకటమణి, పాండు రంగం గారు వారి కుమారులు ఇలాంటి గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, లోకేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## వంశీ రెండ్రోజుల కస్టడీ పూర్తి

- అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రికి తరలింపు
- వంశీ ఆరోగ్యంపై మాజీమంత్రి పేర్ని నాని ఆరా


**విజయవాడ, మే24 (జనంసాక్షి) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రెండు రోజుల కస్టడీ పూర్తి అయ్యింది.. రెండు రోజుల పాటు నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో వంశీని కంకిపాడు పోలీసులు ప్రశ్నించారు.. నకిలీ పట్టాల వ్యవహా రంపై వంశీ నుంచి వివరాలు సేకరించారు.. అయితే, రాత్రి కంకిపాడు పోలీస్ స్టేషన్‌లోనే ఉన్న వల్లభనేని వంశీ అస్వస్థతకు గురికావడం.. ఆస్పత్రికి తరలించడం.. ఆ తర్వాత మళ్లీ పీఎస్‌కు తీసుకొచ్చి ప్రశ్నించడం జరగగా.. మరోసారి అస్వస్థతకు గురయ్యారు. ఇక, రెండు రోజుల కస్టడీ కూడా పూర్తి కావడంతో.. కంకిపాడు పోలీస్ స్టేషన్ నుంచి వంశీని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు కంకిపాడు పోలీసులు.. వల్లభనేని వంశీకి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు ముగిసిన తర్వాత తిరిగి విజయవాడ సబ్ జైలుకు తరలించనున్నారు. అయితే గత రాత్రి కంకిపాడు పీఎస్‌లో వల్లభనేని వంశీ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కంకిపాడు ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. విషయం తెలుసుకున్న వంశీ సతీమణి పంకజశ్రీ కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ మంత్రి పేర్ని నాని సైతం ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో వంశీకి చికిత్స అందించారు.. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో కంకిపాడు పోలీస్ కస్టడీ లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నాడు. వంశీ ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. మెరుగైన వైద్యం కోసం వంశీని ఎయిమ్స్ కి తరలించాలని పేర్ని నాని ఆసహనం వ్యక్తం చేశారు. కాగా, కంకిపాడు ఆస్పత్రి నుంచి పీఎస్‌కు తరలించారు. రెండు రోజుల కస్టడీ ముగియడంతో.. విజయవాడ ఆస్పత్రికి తరలించారు.

## యాదాద్రిలో భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట, మే24 (జనంసాక్షి) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం కావడంతో భారీగా తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు నిండిపోయాయి. కొండ కింద ఆధ్యాత్మిక వాడలోని రహదారులు, పార్కింగ్ ప్రాంతం, వ్రత మండపం, పుష్కరిణి ప్రాంగణం, మండపాలు కిక్కిరిశాయి. రద్దీ అధికంగా ఉండటంతో కొండపైకి వాహనాలను వెసులుబాటును బట్టి అనుమతిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధర్మ దర్శనానికి 3గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2గంటల సమయం పట్టింది. వివిధ ఆర్జిత పూజల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కింద ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా పోలీసులు ట్రాఫజక్ క్రమబద్ధీకరణ చేశారు.

## ప్లాట్ ఓనర్ల అనుమతితోనే లేఔట్ రివైజింగ్

- లే ఔట్‌ల అంశంపై చర్చించిన హైడ్రా సదస్సు



**హైదరాబాద్, మే 24 (జనంసాక్షి) :** లే ఔట్ ఏదైనా అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని లే ఔట్‌లపై హైడ్రా శనివారం నిర్వహించిన సదస్సు అభిప్రాయ పడింది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారి నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో హైడ్రా, జీహెచ్ ఎంసీ, హెచ్ ఎండీఏ, డీటీసీపీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలకు చెందిన పలువురు నిపుణులు హాజరయ్యారు. 10 శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయితే ఆ లేఔట్లను గుర్తించాల్సినవసరం ఉందన్నారు. అందులో మార్పులు చేయాల్సి ఉంటే.. అప్పటికే ప్లాట్ల కొన్నవారి అనుమతితో రివైజ్ చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే 10 శాతం పార్కులు, ప్రజావసరాలకు కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ, డీటీసీపీ, హెచ్ ఎండీఏ ఇలా ఏ స్థాయిలో లే ఔట్ అనుమతులు పొందినా.. అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలపై ప్రభుత్వానికి హక్కులుంటాయనన్నారు. అన్ ఆథరైజ్డ్, అన్ అప్రూవల్ , అప్రూవల్ లే ఔట్లు ఏంటి..? వాటికి సంబంధించిన జీవోలను పరిశీలించారు. ఎకరం స్థలంతో మొదలై.. ఎంత విస్తీర్ణంలో అయినా లే ఔట్లు వేసుకోవచ్చునని పేర్కొన్నారు.

### రెవెన్యూ రికార్డుల్లో మార్చాల్సినవసరం ఉంది..

దశాబ్దాల క్రితం గ్రామపంచాయతీలు అనుమతి ఇచ్చిన లే ఔట్ల విషయం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాల్సినవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది. సదరు భూమి లే ఔట్‌గా మారిందనే విషయం రెవెన్యూ రికార్డులలో నమోదు కాకపోవడంతోనే.. తర్వాత తరం వారు పాసు పుస్తకాలు తెచ్చుకుని ఆయా స్థలాలమీదకు వెళ్లి.. వ్యవసాయ భూమి పేరిట ఆక్రమణలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి పొందిన పాత లే ఔట్ల విషయంలో కొన్ని ప్లాట్లు రెగ్యులరైజ్ అయితే ఆ లే ఔట్‌ను గుర్తించినట్టేనన్నారు. తర్వాత ఆ భూమిని వ్యవసాయ భూమిగా మార్చడం జరగదని.., ఒక వేళ రద్దు చేస్తే అందులో ప్లాట్లు కొన్న వారి అనుమతితో మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. ప్రిలిమనరీ అప్రూవల్‌తో అమ్మకాలు జరపవచ్చునని పేర్కొన్నారు. అయితే లే ఔట్ స్వరూపం మారరాదని చెప్పారు.

### అన్ ఆథరైజ్డ్ నిర్మాణాలను తొలగించవచ్చు..

తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన వాటిపైన చర్యలు తీసుకోవచ్చునని సదస్సు అభిప్రాయ పడింది. ఇందుకు సంబంధించి సుప్రింకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులపై సదస్సు కూలంకుషంగా చర్చించింది. చెరువు పరిధిలో నిర్మించిన కట్టడాల విషయంలో కూడా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేకుండా తొలగించ వచ్చునని పేర్కొంది. రహదారులు, పార్కులలో నిర్మాణాలు చేపట్టినా ఇది వర్తిస్తుందని సూచించింది. అలాగే రెగ్యులరైజ్‌చేసిన ఇంటి స్థలాలు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే వాటిని రద్దు చేసే అధికారం కూడా ఉందని పేర్కొంది. పాత, కొత్త లేఔట్‌లున్న సమయంలో.. పాత లే ఔట్లో రిజిస్ట్రేషన్లు జరిగితే వాటిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఫైనల్ లే ఔట్ వస్తే అందులో ఎలాంటి మార్పులు చేయరాదని సుప్రింకోర్టు గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ సందర్భంగా ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపులో ఎదురైన అంశాలను కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ వివరించారు. హైడ్రా చర్యలతో ఇంటి స్థల పరిరక్షణపై భరోస వస్తోందని పలువురు పేర్కొన్నారు. సుస్థిరమైన స్థిరాస్తి వ్యాపారం వృద్ధి జరుగుతుందన్నారు.

## వర్షాలకు కొట్టుకు పోయిన తాత్కాలిక వంతెన

- వంతనపై వెళుతున్న ఆటో బోల్తా



**కొమురం భీం, మే24 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ధాన్యం తడిసి రైతులు బాధపడుతున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నయా. తాజాగా కొమురం భీమ్ ఆసిఫాబాబ్ జిల్లాలో వరద కారణంగా తాత్కాలికంగా నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. దీంతో వంతెన నుంచి వెళ్తున్న ఆటో ప్రవాహంలో కొట్టుకుపోయింది. అందులో ముగ్గురు ప్రయాణికులు కొంతదూరం కొట్టుకుపోయి.. అతి కష్టం మీద బయటకు వచ్చి ప్రాణాలు రక్షించుకున్నారు. అనంతరం కొట్టుకుపోయిన ఆటోను జెసిబి సాయంతో వెలికితీశారు. తరాలు గడిచినా.. గుండి బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం లేదని.. ఇప్పటికైనా నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### కరీముల్లా కవిత్వం

## తీరికేది..?

మొక్కలా మొలిచి
మనకింత బువ్వందించిన పంట
గిడ్డంగుల్లో శవయాత్ర జరుపుకున్నా
పైరగాలి ఉరేసుకున్నా
సరళీకరణ వెల్లువలో
వానపాముల్లా కొట్టుకుపోయామే
చేపపిల్లలా ఏటికి ఎదురీదిందేది?

సంస్కృతుల్ని జమ్మి చెట్టుపై పెట్టి
మనం బృహన్నలమయ్యాక
మనది కానిదాన్ని
మననం చేసుకున్నాం
మనదైనదాన్ని
ఖననం చేసుకున్నాం
ఛానెళ్లకు పంచేంద్రియాల్ని
అప్పజెప్పడమంటే
కోకోనట్ కోకోకోలాలై
పరిణమించడం
సీతాకోక చిలుక గొంగళిలా
రూపాంతరం చెందడం
జవాబు దొరకని పత్రాల్లా
మనం చినిగిపోవటం

జాగోరెహూల్ని వినలేక
నిశ్శబ్దం గూళ్లల్లో
నిద్ర నటించే మనకు
తప్పిపోయిన మన ఆత్మల్ని
ఆరా తీసే తీరికేది?

జనంసాక్షి

## స్వాతి కిరణాలు

అరిగే కొద్ది
గంధం
పరిమళిస్తుంది

కరిగే కొద్ది
క్రొవ్వొత్తి
వెలుగునిస్తుంది

కాలేకొద్ది
స్వర్ణం
మెరుపునిస్తుంది

చదివేకొద్ది
మస్తిష్కం
పదునునెక్కుతుంది

రాసేకొద్ది
కవనం
పరిణితినిస్తుంది

జనంసాక్షి

కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

# నేటికి 58 ఏళ్లు.. ఎర్రని నెత్తురు పరవళ్లు

**పార్లమెంటులో రాజ్యాంగ గ్రంథం చేబూని ఒకరు, అదే పార్లమెంటు మెట్లకు మొక్కి ఇంకొకరు మనకు కనిపిస్తారు. మన దేశంలో అగ్ర నేతలైన వారిద్దరు ఎవరో మదిలో ఈపాటికి మెదిలే ఉంటుంది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరికీ సమానంగా ఓటు విలువ నిర్దేశించారు. ఆ మేరకు దేశంలో అత్యంత సంపన్నుడి ఓటు విలువ, అతి పెద్ద నేత ఓటు విలువ, అట్టడుగు ఆదివాసీలు, బీదసాదల ఓటు విలువ సమానం. మరి మనుషుల మధ్య అదే సమానత్వ విలువ 75 ఏళ్ళుగా రానేలేదు ఎందుకు?**

భారత రాజ్యాంగం అమలైన మరుక్షణమే అంతర్గత సాయుధ తిరుగుబాటు పొడసూపలేదు. మరీ అంత తొందర పడలేదు. ఓపిక పట్టీ పట్టీ ఏకంగా 17 ఏళ్ల తర్వాత బెంగాల్ లోని నక్సల్బరీ అనే గ్రామంలో 1967 మే 25న రైతుల తిరుగుబాటు మావోయిస్టుల నక్సలిజానికి మూలం. సరిగ్గా నేటికి 58 ఏళ్ల ముంగిట "టార్గెట్" కోరల్లో నక్సలిజం విలవిలలాడుతోంది. రెండు దిక్కులా నెత్తురు ఏరులై ప్రవహిస్తోంది. ఈ వ్యాసానికి అక్షర రూపం ఇచ్చిన రోజున కూడా ఎన్ కౌంటర్ల వార్తలు కనిపిస్తున్నాయి, వినిపిస్తున్నాయి.

190 ఏళ్ల బ్రిటీష్ రాజ్ పోతూ పోతూ పాకిస్థాన్ కుంపటిని అంటగట్టింది. అంతటి క్రూరాల పాక్ తోనే కారణం ఏదైనా కాల్పుల విరమణకు సుముఖత చూపిన మోదీ సర్కారు మన దేశంలోని మావోయిస్టుల ప్రపోజల్ ను మాత్రం పరిశీలించడం లేదు. అదే కొన్ని రాష్ట్రాల ఉద్యమకారులతో మాత్రం చర్చలు జరిపిన కేంద్రం మావోల విజ్ఞప్తిని ఆలకించకపోవడంలో కార్పొరేట్ మహిమ ఏమైనా ఉందా? పరస్పర తీవ్ర చర్యల్లో పోలీసు(జవాను) ప్రాణ త్యాగమైనా, నక్సలైటు నేలకొరిగినా అంతిమంగా పోయింది భారతమాత బిడ్డలుగానే చూస్తాను అని దేశ తొమ్మిదో ప్రధానమంత్రి (1989 డిసెంబర్-1990 నవంబర్)గా విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ఒక దశలో వ్యాఖ్యానించినట్టు జ్ఞాపకం. ఇపుడా సున్నితత్వం ఉన్నదా? పో(ఓ)రుగల్లులో 40-45 ఏళ్ల క్రితం ఏ ఏబీవీపీతో ఘర్షణల వల్ల కేసు నమోదైందో, అదే ఏబీవీపీకి గొడుగైన బీజేపీ లీడ్ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆపరేషన్ కగార్ ఉధృతిలో మావోయిస్టు దళపతి నంబాళ్ళ కేశవరావు అలియాస్ బసవరాజ్-బీఆర్ ఊపిరి విడిచారు. కొండపల్లి సీతారామయ్య సారథ్యంలో 1980లో ఆవిర్భవించిన పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) దండకారణ్యంలోని ఎంసీసీ గ్రూపులతో విలీనమై మావోయిస్టు పార్టీగా 2004లో రూపాంతరం చెందింది. మన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిడ్డ ముప్పాల లక్ష్మణరావు ఊరఫ్ గణపతి తర్వాత ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట వాస్తవ్యులు, ఉపాధ్యాయుడు వాసుదేవరావు-భారతమ్మ కుమారుడు కేశవరావు. సిక్కోలు ఉద్యమ సూరీడే అయినా..బీటెక్, ఎంటెక్ విద్యార్థిగా మన పోరుగల్లు నీళ్ళు తాగారు. భారత ప్రధానిగా మన పీవీనో, హెచ్.డి. దేవెగౌడ వంటి వారో దక్షిణాది నేతలు నేడు రూలింగ్ లో లేరు. దేశ్ కీ నేత మన కేసీఆర్ ఇప్పుడు సెంట్రల్ లో ఓ వెలుగు వెలిగినా మావోయిస్టు శిఖరం కుప్పకూలేంత అనర్థం ఉత్పన్నం అయ్యేది కాదేమో. ఎటొచ్చీ ఉత్తరాది నాయకత్వమే ఏలుతోంది దేశాన్ని కాబట్టి, జాతీయ నక్సల్బరీలో మావోయిస్టు తెలుగు నాయకత్వం పక్షాన ఢిల్లీలో తగిన గొంతు, గళం లోటు తెలుస్తుంది. కేశవరావు స్థానంలోకి బెంగాల్ రాజన్ కాకుంటే మళ్ళీ తెలుగువారు, మన తెలంగాణ వారైన అదే గణపతి లేదా మల్లోజుల వేణుగోపాల్ వచ్చే అవకాశం ఉందట. మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, అస్సాం, మణిపూర్ ఉద్యమకారులతో శాంతి చర్చలకు పూనుకున్న కేంద్ర సర్కారు స్వయంగా మావోలు ప్రతిపాదించినప్పటికీ ఇగ్నోర్ చేస్తోందనే అపవాదు నెలకొంది. ఇదే టైంలో మన సౌత్ వారు, తెలుగు లీడర్ల ప్రభావం, ప్రాభవం వెలితి కనిపిస్తుంది. చంద్రబాబునాయుడు కేంద్రంలో మళ్ళీ చక్రం తిప్పుతున్నా..తానే నాటి పీడబ్ల్యూజీ టార్గెట్ గా అందునా ఇదే కేశవరావు సూత్రధారంటూ 2003 అక్టోబర్ తొలి రోజున 17 క్లైమోర్ మైన్స్ పేల్చివేతలో మృత్యుంజయు లయ్యారు. అందువల్ల ఏ విధంగానూ ఆయన మావోలను సమర్థించరు.

**ఇలా అయితే అయిపోతుందా?**

పాలకులకైనా, నక్సలైట్లకైనా కావాల్సినది అట్టడుగు ప్రజల ప్రయోజనాలే అయినప్పుడు.. అదే కామన్ పాయింట్ గా ఉన్నప్పుడు ఎందుకీ అంతులేని అశాంతి, దుఃఖం, అగాధం? బెంగాల్ గడ్డపై 1967లో మొదలైన సాయుధ రైతాంగ తిరుగుబాటే సరైన మార్గంగా గుర్తించిన వారినే నక్సలైట్లుగా చూస్తారు. ఆ విధంగా తెలుగు నేల సహా దేశవ్యాప్తంగా నక్సలైట్ల ఉనికికి 58 సంవత్సరాలు. సుమారు ఈ ఆరు దశాబ్దాలుగా పోలీసులు, నక్సలైట్లు, పౌరులు, ప్రముఖులు ఎందరో ఈ పోరులో అర్థాంతరంగా చనిపోతూనే ఉన్నారు. నక్సలైట్లు లేని దేశంగా కాలా"వధి" విధించారు. హోం మంత్రి అమిత్ షా పర్యవేక్షణలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్డీయే ప్రభుత్వం 2026 మార్చి 31 టైమ్ లైన్ కంకణం కట్టుకున్నది. అంటే అప్పటికల్లా ఇలా ఎన్ కౌంటర్లు, లొంగుబాటులు వంటివి ఏదో విధంగా సమాప్తం కావాలి. నిజంగానే అలా జరుగుతుందా? మొత్తంగా నక్సలిజం అంతరించి పోతుందా? గణనీయంగా మాత్రం పడిపోతున్నది. 2010లో దేశంలోని 96 జిల్లాల్లో గట్టి ప్రభావం కలిగిన మావోయిస్టు పార్టీ 2023కు వచ్చేసరికి 46 జిల్లాలకు కుంచించుకుంది. 2024లో తలపెట్టిన ఆపరేషన్ కగార్ తో కేవలం 6 జిల్లాలకు పరిమితమైంది. కగార్ అనే (అంతిమదశ) పేరుకు తగ్గట్టే కగార్ నామకరణం తర్వాత 540 మంది మావోలు మృతి చెందారని కథనం. భారత విప్లవోద్యమ చరిత్రలో నక్సల్బరీకి బహుశా ఇదే అత్యంత క్షీణ దశ. అయినప్పటికీ కంప్లీట్ గా కనుమరుగు గురించి కాలమే చెప్పాలి.



**కార్పొరేట్ శక్తుల దీర్ఘకాలిక సంపదల కోసం ఖనిజ తదితర సహజ వనరుల స్థావరాలైన కొండలు, కోనలు, అడవులను చెరబట్టే మాయలు, మర్మాలు ఆపరేషన్ కగార్‌లో దాగి ఉన్నాయనే వాదనలను కేవలం అపోహలేనని నిరూపించాల్సిన ధర్మం పాలకులదే. ఈ మే 25 నక్సల్బరీన సాయుధ పోరాటపు ఆవిర్భావ దినం.**

**మైండ్ సెట్ మారదా?**

అంతర్గత తీవ్రవాదం, నక్సలిజం రూపుమాపేందుకు కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సాధనా సంపత్తిని వినియోగిస్తున్నాయి. బహిర్గతం చేయలేనంత ప్రజాధనం వెచ్చిస్తున్నాయి. ఆ డబ్బును చివరాఖరున అణగారిన, బీద, గిరిజన, ఆదివాసీ తదితర వర్గాల అభ్యున్నతికి ఖర్చు పెడితే బాగుండేది. నక్సలైట్లే లక్ష్యమైన ప్రతికూలతలు ముసిరిన దరిమిలా ఇప్పుడు పదే పదే చర్చల ఊసెత్తింది మావోయిస్టు పార్టీ. పీపుల్స్ వార్ మావోగా అవతరించిన తొలి ఏడాది 2004 నుంచి 2005ల్లో నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి చర్చలు జరిపింది. అనంతర పరిణామాలు కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణలో నేడు ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. రాష్ట్రంలో ఎలాంటి ప్రాణహాని, నష్టం తలపెట్టనంత వరకూ నక్సలైట్ల విషయంలో కటువుగా పోమనే సారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ కగార్ ను ఆపాలని, చర్చలకు సమ్మతించాలని అదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి మద్దతుగా నిలిచిన మావోయిస్టులకు ఈ కష్ట సమయంలో కేసీఆర్ స్పందన సాంత్వన కలిగించొచ్చు. వామపక్ష తీవ్రవాదం అంశంలో రాజకీయ పార్టీల తీరు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా ఉంటుండడం జగద్విదితం. కాంగ్రెస్ పెత్తనంలోని యూపీఏ హయాంలో 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్ ఉనికిలోకి వచ్చింది. సగటున సాలీనా 80 మంది మావోయిస్టుల మరణాన్ని లెక్కించింది. కొండ కోనలు, అడవుల్లో జీవించే అమాయక ప్రజల పక్షాన నిలబడిన మావోయిస్టులు వారికి ఎనలేని సేవలు చేశారనడంలో, వాళ్ళతో పాటు మైదాన ప్రాంతాల ప్రజల్లో చైతన్యం వెల్లివిరిసేందుకు కారకులు అయ్యారని పేర్కొనడంలో సందేహం లేదు. భూ సంస్కరణలు, పీడిత ప్రజల హక్కుల కోసం త్యాగాలు చేసిన చరిత్ర వారిది. అయితే కాలానుగుణమైన మార్పుల మేరకు వారి మైండ్ సెట్ మారిందా అన్నది ప్రశ్న. 30-40 ఏళ్ల కింద ఉన్న సమస్యలు, నేటి సమస్యలు వేరు. అప్పటికి, ఇప్పటికి జనం జీవన శైలి, ఆలోచనా సరళి మారింది. ఇపుడు తుపాకులు చేతబట్టి, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవలసిన అవసరం లేదు. చట్ట పరిధిలో, చట్టం ప్రకారమే ప్రజల పక్షాన, వారికి కావాల్సిన అంశాలను అనుసరించి మెప్పు పొందవచ్చు. దేశంలోని 16 రాష్ట్రాల్లో మావోయిస్టుల ఉనికిని గతంలో నిలబెట్టిన ఇదే కేశవరావు శారీరక, మానసిక దృఢత్వం, ఉన్నత విద్యతో సొంతమైన తెలివితేటల పటిమా సామర్థ్యాలు, త్యాగాలు గడిచిన 40 ఏళ్లలో చట్టబద్ధంగా సమాజానికి అందిస్తే మరోలా ఉండేది. ఎందరో పోలీసులు, జవాన్లను మట్టుబెట్టిన అవే వ్యూహాలు, చేతలతో శత్రు దేశాల ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అంతమొందించడంలో కలిసి వస్తే ఇంకా మంచిగుండేది. తాను సహా తనలాంటి మెరికలు ఏ సివిల్ సర్వీసెస్ లోనో, ప్రజా నాయకులుగానో పంథా ఎంచుకుంటే టాప్ పొజిషన్ లో వారిని సమాజం చూసేది. అత్యంత కటువైన అణిచివేత బలి తీసుకునేది కాదు. ఎంతటి శిక్షణతో ఒక పోలీసు అవుతారో, ఎంతటి కఠోర పరిస్థితులను పంటి బిగువున నక్సలైటు భరిస్తారో ఎవరిది వారికి తెలుసు. వీరిలో ఎవరి శ్రమ అయినా చట్టం ప్రకారం ప్రజలకు ఒనగూరాలి. అపుడు ఫలితాలను మెరుగ్గా చూస్తాం. నక్సలైట్ల ఉనికి లేని చోట అభివృద్ధి బాగా జరిగిందనే వారు ఉదాహరణలతో చెబుతుంటే కాదనలేం. అదే సమయంలో కార్పొరేట్ శక్తుల దీర్ఘకాలిక సంపదల కోసం ఖనిజ తదితర సహజ వనరుల స్థావరాలైన కొండలు, కోనలు, గుట్టలు, అడవులను చెరబట్టే మాయలు, మర్మాలు ఆపరేషన్ కగార్‌లో దాగి ఉన్నాయనే వాదనలను కేవలం అపోహలేనని నిరూపించాల్సిన ధర్మం పాలకులదే. ఈ మే 25 నక్సల్బరీన సాయుధ పోరాటపు ఆవిర్భావ దినం. ఈ సందర్భంగానైనా ఎటువైపూ ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా దేశ ప్రజల మేలు కోసం పాటుపడడమే అసలైన పంథాగా పాలకులు, కామ్రేడ్లు (నక్సలైట్లు-అన్నలు-అక్కలు) పరస్పరం చట్టానికి లోబడి నిర్దిష్టమైన పూనిక వహించాలని ఆశిద్దాం.



ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు
హైదరాబాద్, 9440850384

## మావోయిస్టుల సామూహిక హత్యలను ఖండిద్దాం

మధ్య భారతంలోని ఛత్తీస్ గడ్ రాష్ట్రంలో సహజ వనరులను కొల్లగొట్టడానికి అడ్డుపడుతున్న ఆదివాసులను వారికి అండగా నిలుస్తున్న మావోయిస్టులను నిర్మూలించడానికి బహిరంగ ముహూర్తాలు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు మోదీ-అమిత్ షాలు కామ్రేడ్ నంబాల కేశవరావు హత్యపై హర్షా ద్వానాలు వ్యక్తం చేయడం ఎంతో శోచనీయం. బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో 200 సంవత్సరాల క్రితం పోరాటం ప్రారంభించిన ఆదివాసులకు అండగా నిలబడ్డ అల్లూరి సీతా రామరాజు లాంటి వాళ్ళను సైతం తెల్లదొరలు దేశద్రోహులుగా /రాజా ద్రోహులుగా చిత్రించారు. ఆదివాసుల స్వతంత్ర పరిపాలనా వ్యవస్థను కుప్పకూల్చిన బ్రిటిష్ వలస పాలకుల నుండి విముక్తి పొందామంటున్నారు మన పాలకులు. మన రాజ్యాంగం 5,6 వ షెడ్యూల్ల ద్వారా ఆదివాసి ప్రాంతాలకు, నివాసాలకు, జన సమూహాలకు పలు రక్షణలు కల్పించింది. పలు చట్టాలతో పాటు, ప్రత్యేక అధికారాలనిచ్చింది.

జనంసాక్షి

2024 జనవరిలో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన ఆపరేషన్ కగార్ ద్వార లక్షలాది ఎకరాల్లో సాయుధ బలగాల శిబిరాలు ఏర్పడి అడవులలో స్వతంత్ర జీవనం సాగించే ఆదివాసులను బలవంతంగా క్యాంపులకు తరలిస్తున్నారు. వినని గ్రామాలపై దాడులు, బెదిరింపులు,చివరకు బాంబుల దాడులు చేస్తూ జన జీవితాన్ని అల్లకల్లోల పరుస్తున్నారని వార్తలొస్తున్నాయి. వందలాది మంది ఆదివాసులు, మావోయిస్టులు మరణిస్తున్నారు. ఈ విధ్వంసకాండ ప్రపంచానికి తెలియకుండా మీడియా పైన అనేక ఆంక్షలు ప్రకటిస్తున్నారు. దీనికి పరాకాష్టగానే సి.పి.ఐ (మావోయిస్టు) ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు ఆయనతో పాటు మరో 27 మందిని ఎన్ కౌంటర్ పేర పట్టుకొని మట్టు పెట్టారని అనేక వార్తలు వెలువడుతున్నాయి. అందుకే ఆపరేషన్ కగార్ ప్రారంభించిన 2024 జనవరి నుండి అన్ని సంఘటనలపై, హత్యలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలని కోరుతున్నాం.ఈ హత్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ అందో ళనబాట పట్టాలని ప్రజలకు పిలుపునిస్తున్నాం.

దేశ సంపదను కాపాడ్డానికి, దేశ-విదేశీ కార్పోరేట్ల ఖజానాకు సహజ సిద్ధమైన అడవి,ఖనిజ సంపద చేరకుండా అడ్డుకోవడానికి మరో మార్గం లేకుండా ఆయుధం పట్టిన వాళ్లే, కాల్పుల విరమణ ప్రకటించి,శాంతి చర్చలకు సిద్ధపడినప్పుడు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు స్వస్తి పలికి, చర్చలకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇప్పటికే 2025 జనవరిలో ఛత్తీస్ ఘడ్ ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి అయిన విజయ సాహు నక్సలైట్లతో శాంతి చర్చలకు పిలుపునిచ్చాడు. దానికి సంసిద్ధత వ్యక్తం చేస్తూ మావోయిస్టులు స్పందించినా ప్రభుత్వాలు హింసా ద్వంసాలకే ప్రాధాన్యత నిస్తున్నాయి. పహాల్గంలో అమాయక పర్యాటకులను హత్య చేసిన టెర్రరిస్ట్ మూకలకు వత్తాసు పలుకుతున్నారని పాకిస్తాన్ కు యుద్ధంతో బుద్ధి చెప్పామన్న భారత ప్రభుత్వమే చివరకు పాక్ తో అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటించింది.ఆపరేషన్ సింధూర్ ను నిలిపివేసి తర్వాత ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పింది.మరి అదే విధంగా మన దేశ పౌరుల పట్ల స్పందించకపోవడం విచారకరం.నాగా-మిజో లాంటి సాయుధ మిలిటెంట్లతో చర్చలు జరిపిన కేంద్రం మావోయిస్టులతో చర్చలకు స్పందించకపోవడం, మావోయిస్టులను నిర్మూలిస్తామని సాక్షాత్తు దేశ హోం మంత్రి నిండు పార్లమెంటులో ప్రకటించడం రాజ్యాంగ పాలన అవుతుందా? సుప్రీంకోర్టు స్పష్టం చేయాల్సి ఉంది.చిన్న చిన్న విషయాలను సుమోటోగా స్వీకరించే సుప్రీంకోర్టు దేశంలోనే ప్రధాన పార్టీలు,ప్రజా సంఘాలు,హక్కుల సంఘాలు,ప్రజాస్వామిక వాదులు,మేధావులు ముక్త కంఠంతో శాంతి చర్చలు జరగాలని కోరుతున్నా మౌనం పాటించడం బాధాకరం. పైగా శాంతి చర్చలు కోరుతున్న వారిని వెంటాడి,వేటాడి చంపడాన్ని ఖండించాల్సిందే.అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో 2004 అక్టోబర్ లో జరిగిన శాంతి చర్చల తర్వాత విప్లవ పక్షాలు సీరియస్ గా నష్టపోయిన విషయం జగమెరిగిన సత్యం.అయినా ప్రభుత్వం చర్చలకు ముందుకు రావడం లేదంటే మావోయిస్టుల పేరుమీద అటవీ చట్టాలన్నింటినీ అతిక్రమించే ఉద్దేశాలున్నాయని ఎవరైనా సులభంగా గ్రహించవచ్చును. సాయుధ బలగాల పహారాలో కార్పొరేట్లు ఖనిజ సంపదను యదేచ్ఛగా కొల్లగొడతారని మనం ఊహించవచ్చును.



అసమాన ఆర్థిక-సామాజిక వ్యవస్థలో అసంతృప్తులు, నిరసనలు,ప్రతిఘటనలు సహజ సిద్ధంగా ఉత్పన్నమవుతాయి. ప్రతిఘటన రూపం తీసుకున్న సమస్యలను పరిష్కరించాలా? లేక సమస్యలను లేవనెత్తుతున్న వారిని వేటాడి చంపడం ద్వారా రాజ్యమే హింసా-ద్వంసాలతో పరిపాలన చేయాలా? అనే అంశాలు మన ముందున్నాయి. హింస-ప్రతి హింస-రాజ్య హింసల పరంపరలో రాజ్యాంగ హక్కులు కాలరాయబడుతున్నప్పుడు సుప్రీంకోర్టు స్పందించకుంటే, దేశ ప్రజల ముందున్న ప్రత్యామ్నయమేమిటి?ప్రజలెప్పుడు మౌన ప్రేక్షకులు కాజాలరు.

1975 జూన్ లో ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీని నేటికీ విమర్శిస్తున్న బిజెపి దేశంలో ఎలాంటి ఆంతరంగ కల్లోలాంశాన్ని ప్రకటించకుండానే,దేశ పౌరులపై బహిరంగ యుద్ధాన్ని ప్రకటించి కొనసాగించడం అది శాంతి చర్చలను కోరుతున్న వారిని కాల్చి చంపుతామని ప్రకటించడం ఏరకంగా రాజ్యాంగ పాలన అవుతుందో దేశ ప్రజలు గమనించాలి.అందుకే ఆపరేషన్ కగార్ ను బేషరతుగా నిలిపివేసి మావోయిస్టులతో చర్చలకు సిద్ధపడాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాం.

కామ్రేడ్ నంబాల కేశవరావు సహా 27 మంది హత్యలను సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బాధ్యులపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, వీడియో రికార్డింగ్ ద్వారా బంధుమిత్రుల సమక్షంలో పోస్టుమార్టం జరపాలి. మృతుల శవాలన్నీ కుటుంబ సభ్యులకు అందజేయాలి. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ మొదలైనప్పటినుండి నంబాల కేశవరావు ఎన్ కౌంటర్ హత్య వరకు జరిగిన సంఘటనలన్నింటిపై సుప్రీంకోర్టు నియమించిన స్వతంత్ర కమిషన్ ద్వారా విచారణ జరిపించాలి. మధ్యభారతంలో అమలవుతున్న రాజ్యం చుట్టివేత-అణచివేత, చర్యలన్నింటిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి. ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి శాంతి చర్చల కమిటీ సభ్యుల మధ్యవర్తిత్వంలో కేంద్రం వెంటనే మావోయిస్టులు, ఆదివాసి జేఏసీ లతో శాంతి చర్చలకు ముందుకు రావాలి.గడచిన 16 సంవత్సరాలుగా ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని అడవి-బొగ్గు-ఇతర ఖనిజ సంపదలపై జరిగిన వ్యాపార ఒప్పందాలన్నింటిని ప్రభుత్వం బహిరంగ పరచాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) రెండు తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు, ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక విమలక్క, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు పట్లోళ్ల నాగిరెడ్డి, వెల్తురు సదానందం, ఏఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, అంజయ్య, పీడీఎస్ యూ (విజృంభణ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాయిసిడం బాబురావు, అల్లూరి విజయ్ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏపూరి మల్సూర్, రమేష్ పోతుల, పీఓడబ్ల్యూ (స్త్రీ-విముక్తి) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అరుణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

### అమెరికా నుండి మేధో వలసలను భారత్ సద్వినియోగం చేసుకోవాలి

## అందుకు మన ప్రధాని సిద్ధమా..?

1933లో జర్మనీ నుండి శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు వలస వెళ్లడం ప్రారంభమైంది. ఈ వలస పరిమాణం, జర్మనీ నుండి వెళ్లిన వ్యక్తుల నాణ్యత అంతటి ప్రభావం చూపింది, వారు ప్రధానంగా అమెరికా, పశ్చిమ ఐరోపాకు వెళ్లారు. ఈ వలసలు రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పశ్చిమ ఐరోపా, అమెరికా అభివృద్ధిలో గణనీయమైన ప్రభావం చూపాయి. చరిత్ర మరోసారి పునరావృతం కావచ్చని ఇప్పుడు సూచనలు కనిపిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో, అమెరికా నుండి అనేక మంది విద్యావేత్తలు ఇతర దేశాలకు వలస వెళ్లాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. 1933లో జర్మనీలోని రాజకీయ పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితి అంత తీవ్రంగా లేకపోవచ్చు, కానీ విద్యా స్వాతంత్ర్యంపై గుర్తించబడిన బెదిరింపు అనేక మంది విద్యావేత్తలను వలస వెళ్లేందుకు ప్రేరేపిస్తోంది. నేచర్ మ్యాగజైన్ నిర్వహించిన ఇటీవలి సర్వే ప్రకారం, అమెరికాలో బ్రెయిన్ డ్రెయిన్ ఇప్పటికే ప్రారంభమైనట్లు స్పష్టమవు తోంది. 75 శాతం మంది శాస్త్రవేత్తలు తమకు అవకాశం దొరికిన వెంటనే వలస వెళ్లాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు.

1930లలో, జర్మనీ నుండి వలస వెళ్లిన శాస్త్రవేత్తలు విదేశీ భూమిపై గొప్ప ఆవిష్కరణలు చేశారు. వారిలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, జేమ్స్ ఫ్రాంక్, ఎర్విన్ ష్రోడింగర్ మొదలగు వారు వలస వెళ్ళిన దేశాల్లో వారు చేసిన పనికి నోబెల్ బహుమతిని పొందారు. యూకే, అమెరికాలో వారి స్వీకరణకు ప్రత్యేకంగా స్థాపించిన సంస్థలు సహాయ పడ్డాయి. యుద్ధానంతర కాలంలో అమెరికా, పశ్చిమ ఐరోపాలో ఆవిష్కరణ సంస్కృతి వేగంగా ఆర్థిక వృద్ధికి దారితీసింది, ఈ వలసదారులు దీనిలో కీలక పాత్ర పోషించారు.

ఆసక్తికరంగా, 1930లలో కొంతమంది ప్రముఖ విద్యావేత్తలు భారతదేశానికి వలస వెళ్లాలని కూడా ఆలోచించారు. అలాంటి వ్యక్తులలో ఒకరు మాక్స్ బోర్న్, 1954లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్నవారు, అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త జె. రాబర్ట్ ఒప్పెన్ హైమర్‌కు గురువు. బోర్న్ 1935-1936లో భారతీయ శాస్త్రవేత్త సి.వి. రామన్ ఆహ్వానంతో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆరు నెలలు గడిపారు. రామన్ ఇటీవల ఐఐఎస్‌సికి వచ్చారు, ప్రపంచ స్థాయి ప్రతిభను ఆకర్షించాలని ఆలోచించారు. రామన్ బోర్న్‌ను బెంగళూరుకు ఆరు నెలల పాటు, తర్వాత శాశ్వతంగా ఆహ్వానించినప్పుడు, బోర్న్ ఆ ఆహ్వానాన్ని సంతోషంగా స్వీకరించారు. బెంగళూరులో బోర్న్ ఆరు నెలలు గడిపిన సమయంలో ఆయన ఉపన్యాసాలు, రామన్, ఆయన సహచరులతో




లోతైన విద్యాపరమైన చర్చలు జరిగాయి. అదేవిధంగా, పండిత్ మదన్ మోహన్ మాలవీయ జర్మనీలోని మేధావుల దీనస్థితిని గుర్తించి, వెంటనే చర్య తీసుకోవాల్సిన అవసరాన్ని ఊహించారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను కొత్తగా స్థాపించబడిన బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి ఆహ్వానించారు. ఐన్‌స్టీన్ బిహెచ్‌యూలోని విద్యాపరమైన వాతావరణంతో సంతోషిస్తారని, చివరికి అక్కడ ఫ్యాకల్టీ స్థానాన్ని స్వీకరించవచ్చని ఆశించారు. రామన్, మాలవీయ ఇద్దరూ సమకాలీన పరిస్థితిని అసాధారణమైన దూరదృష్టితో గుర్తించి, తమ సంస్థలకు అత్యుత్తమ వ్యక్తులను ఆహ్వానించ దానికి సిద్ధంగా ఉన్నారు.

ఇప్పుడు బ్రెయిన్ డ్రెయిన్ జరిగితే, అమెరికా ప్రపంచంలో అత్యంత ఆవిష్కరణ-స్నేహపూర్వక దేశంగా, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న స్థానం దెబ్బతినవచ్చు. స్వతంత్ర విశ్లేషకులు ఈ రెండు అంశాలపై వ్యాఖ్యానించారు. ఫలితంగా, ఐరోపాలోని దేశాలు అమెరికా నుండి బ్రెయిన్ డ్రెయిన్‌పై త్వరిత చర్యలు తీసుకున్నాయి. ఉదాహరణకు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఉత్తమ మేధావులను ఫ్రాన్స్‌కు వలసరావాలని బహిరంగ ఆహ్వానం పంపారు. భారతదేశం ఇప్పుడు పెద్ద సంఖ్యలో ప్రతిభావంతులైన విద్యావేత్తలను, అది కూడా తక్కువ సమయంలో స్వీకరించడానికి సిద్ధంగా ఉందా? 1930లలో పరిస్థితి ఇప్పటి కంటే చాలా భిన్నంగా ఉంది. అప్పట్లో, కొంతమంది బాధ్యతాయుతమైన వ్యక్తులు దూరదృష్టి, ధైర్యంతో ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నారు. అంతేకాక, భారతదేశంలో విశ్వవిద్యాలయాలు, సంస్థలు కేవలం స్థాపించబడుతున్నాయి, అనేక మందికి అక్కడ స్థానం దొరికే అవకాశం ఉంది. అయినప్పటికీ, మాక్స్ బోర్న్‌ను దీర్ఘకాలిక నియామకం కోసం తీసుకురావడంలో రామన్ తీవ్రమైన అడ్డంకులను ఎదుర్కొన్నారు. మరోవైపు, 1930లతో పోలిస్తే ఇప్పుడు విద్యా సంస్థలు చాలా పరిణతి చెందాయి. ఈ పరిణతి అనుకోని బ్యూరోక్రాటిక్ అడ్డంకులను కూడా తెచ్చింది. అత్యుత్తమ ప్రతిభను గుర్తించి, సంస్థలలో స్థానాలను అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి.

మోదీ ప్రభుత్వం నిజంగా ఇలాంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటే, ఒక కొత్త, ఆవిష్కరణాత్మక విధానం అవుతుంది. ప్రభుత్వం ప్రత్యేక-ప్రయోజన యంత్రాంగాలను ఏర్పాటు చేసి, అసాధారణ ప్రతిభావంతులైన విద్యావేత్తలను తిరిగి భారత్ కు రప్పించడంపై త్వరిత నిర్ణయాలు అమలు చేస్తే ట్రంప్ కు బుద్ధి చెప్పినట్లు అవుతుంది. భారత దేశం మేధావులతో నిండిపోతుంది. భారత్ కూడా గొప్ప ఆవిష్కరణల దేశంగా ఎదుగుతుంది. మన యూనివర్సిటీ విద్యార్థులకు చక్కటి బోధన, రీసెర్చ్ స్కిల్స్ పెంచటానికి ఇదే మంచి అవకాశం.అమెరికాలో కొలంబియా యూనివర్సిటీ, హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పరిశోధకులు, సైంటిస్టులు డోనాల్డ్ ట్రంప్ తో వేదింపులు పడలేక విదేశాల్లో అవకాశాల కోసం వెతుకుతున్నారట.చైనా, యూరప్ దేశాలు వారికి స్వాగతం పలకటానికి సిద్ధంగా ఉన్నాయి అనే వార్తలు వస్తున్నాయి.మన భారత దేశం శాస్త్ర-సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక అభివృద్ధి సాధించాలీ అంటే ఇదే మంచి అవకాశం.మన భారత ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోని వారికి పరిశోధనలు చేసుకొనే అవకాశాలు, వసతులు కల్పిస్తే మన దేశ విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన విద్య, పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటికే మన దేశం విద్యా రంగంలో వెనుక బడి ఉంది. నాసిరకం పరిశోధన కేవలం డిగ్రీ కోసం జరుగుతున్నాయి. దశాబ్ద కాలంగా మన యూనివర్సిటీల్లో రిక్రూట్మెంట్ లేక వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. పరిశోధనలు మూలన పడి ఉన్నాయి. యూజీసీ కి గ్రాంట్స్ తగ్గాయి.ఈ నేపథ్యంలో అమెరికా నుండి తిరుగు మొఖం పడుతున్న మేధో వలసలను మన దేశ అభివృద్ధికి ఉపయోగించుకోవాలి. బ్యూరోక్రాటిక్ ప్రక్రియల నుండి స్వతంత్రంగా ఉండే అనేక కొత్తగా స్థాపించబడిన ప్రైవేట్, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఈ విషయంలో నాయకత్వం వహించవచ్చు. నిస్సందేహంగా, ప్రస్తుత విచిత్రమైన భౌగోళిక రాజకీయ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఇటువంటి అత్యుత్తమ వ్యక్తులను ఆకర్షించడం భారత ఆర్థిక వృద్ధిపై దీర్ఘకాలికంగా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. భారత దేశం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుందా లేక మరోసారి దానిని జారవిడిచి పెడుతుందా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

జనంసాక్షి



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

- 66 గజాల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలి
- పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం
- దసరా నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి
- బీఆర్ఎస్ హయాంలో పేదలకు తీవ్ర అన్యాయం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- 823 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల అందజేత



**ఇబ్రహీంపట్నం, మే 24 (జనం సాక్షి) :** త్వరలో నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని బొంగులూర్ ప్రమీదా గార్డెన్ లో ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు చెందిన 823 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల నెరవేరుతుంటే సంతోషంగా ఉందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అంధించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు విషయంలో ఎవరికి కూడా లంచాలు ఇచ్చే అవసరం లేదని పేర్కొన్నారు. అలాంటిది ఎదైనా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వాళ్ళను క్షమించేది లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, సబ్సిడిపై వంటగ్యాస్ వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకునప్పటికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు పోతున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎవరైనా ఇబ్బంది పెడితే నేరుగా తమకు ఫోన్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం విడతల వారీగా రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేస్తుందని చెప్పారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా అందిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల ఇళ్లు నిర్మిస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. కేవలం 66 గజాల్లోనే ఇంటి నిర్మాణం ఉండాలన్నారు. లబ్ధిదారులు ఇళ్లను 45 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మంజూరు పత్రాలు అందుకున్న వారు వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరారు. దసరా నాటికి పూర్తి చేసి, గృహ ప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను వెలికి తీస్తున్నామని, త్వరలోనే భూమిలేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని చెప్పారు. అర్హత ఉండి ఇల్లు రానివారికి రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డీసీ నాయక్, ఆర్డీవో అనంత రెడ్డి, కమీషనర్లు బాలకృష్ణ, అమరేందర్ రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు,మాజీ జెడ్పీటీసీ మహిపాల్, టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్ మే 24 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించుకోవడానికి అవసరమైన అన్ని వసతులను వినియోగించుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రజా ప్రతినిధులు అందరం కలిసికట్టుగా పని చేయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో దుండిగల్ మండల విద్యాధికారి కృష్ణ, మండల రిసోర్స్ పర్సన్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పనలో నిర్లక్ష్యం వహించొద్దు



**కుత్బుల్లాపూర్, మే 24 (జనం సాక్షి) :** మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అధికారులకు సూచించారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన కార్పొరేషన్ పరిధిలోని అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీలో సమస్యల పరిష్కారం కోసం అధికారులు పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించాలన్నారు. ముఖ్యంగా రానున్న వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ ఎమ్మార్వో వాటర్ బాక్స్ విద్యుత్ శాఖ విద్యాశాఖ , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారత సైనికుల పరాక్రమం వెలకట్టలేనిది

- సైనికులకు సంఘీభావంగా సింధూర్ తిరంగా ర్యాలీ




**జడ్చర్ల, మే 24 (జనం సాక్షి) :** ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం చూపెట్టిన పరాక్రమం వెలకట్టలేనిదని పలువురు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో సైనికులకు మద్దతుగా సింధూర్ తిరంగా ర్యాలీని శనివారం ఘనంగా నిర్వహించారు. మనం సైతం దేశం కోసం సైనికులకు వందనం సింధూర్ తిరంగా ర్యాలీ అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ చౌరస్తా నుండి పట్టణంలోని నేతాజీ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు జాతీయ జెండాలు చేతబట్టి భారత్ మాతాకీ జై.. వందేమాతరం అంటూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి భారతదేశ గొప్పతనాన్ని చాటారన్నారు. ఉగ్ర మూకలు భారతదేశం వైపు కన్నెత్తి చూడాలంటేనే హడలెత్తించేలా భారత సైనికులు చేశారని అన్నారు. తిరంగా ర్యాలీలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో జడ్చర్ల పట్టణం జనసంద్రంగా మారింది. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మహిళలు, నాయకులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన జగద్గిరిగుట్ట పీఎస్ ఎస్ఐ

**కుత్బుల్లాపూర్, మే 24 (జనం సాక్షి) :** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శంకర్, ఆయన అనుచరుడు నాగేందర్ లు శనివారం ఏసీబీ నిర్వహించిన దాడులలో పట్టుబడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్–1 అధికారులు తెలిపిన వివరాల మేరకు జగద్గిరిగుట్ట ప్రాంతంలో సీజ్ అయిన డీజే వాహనాన్ని తిరిగి వాహన యజమానికి అప్పగించడం కోసం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శంకర్ బాధితుడి వద్దనుండి డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఎస్సై అనుచరుడైన నాగేందర్ ద్వారా లంచం తీసుకునేందుకు అంగీకరించారు. దీంతో బాధితుడు ఎస్సై అనుచరుడుకి 15వేల రూపాయలు ఇస్తూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం జరిపిన కెమికల్ టెస్ట్ లో పాజిటివ్గా తేలింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ–1 శంకర్ , ఏ–2 నాగేందర్‌ను అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో నిందితులను హాజరుపరిచారు. ఈ




సందర్భంగా ఏసీబీ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు తెలియజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్నవారు టోల్‌ఫ్రీ నెంబర్ 1064 లేదా 9440446106కు సమాచారం ఇవ్వాలన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**దోమ, మే 24 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడడమే కాకుండా మనిషికి, మనిషికి మధ్య ప్రేమానురాగాలను పెంచుతాయని బాస్ పల్లి మాజీ సర్పంచులు పద్మ, ఆనంతయ్య అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బాస్ పల్లి గ్రామంలో కీర్తిశేషులు చాకలి చిన్న స్మరకార్థం క్రికెట్ లీగ్ టోర్నమెంట్ను ఆర్గనైజర్లు కె.నరేష్, జి.కృష్ణ, కె.రాజు, ఎం.రాజు, శ్రీశైలం, జి.శేఖర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిధులుగా పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చాకలి చిన్న ఎంతో మృదుస్వభావి అని ఆయన మన మధ్యలో లేకపోవడం బాధాకరమన్నారు.ఆయన స్మరకార్థం గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో మొత్తం నాలుగు టీంలు పాల్గొనగా ప్రతి రోజు రెండు టీంలు అడుతాయని, ఫైనల్ లో రెండు టీంలు విజేతలుగా నిలుస్తాయని తెలిపారు. మొదటి విజేతకు రూ.10 వేల బహుమతి అందించగా, రెండవ టీంకు రూ.5 వేల నగదు బహుమతి ని అందిస్తామని చెప్పారు. ప్రతి టీంకు నియమ నిబంధనలు వర్తిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ప్రతి టీంలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, క్రీడల్లో తమ ప్రతిభను కనబరచాలన్నారు. వారికి సైతం బహుమతులు ఉంటాయని చెప్పారు. స్నేహపూర్వకంగా క్రీడలను ఆడుకోవాలి కానీ, గెలిచిన వారు ఓడిన వారిని హేళన చేయకుడదన్నారు.క్రీడాకారులు నిర్వాహకులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘాల నేతలు, యువకులు, సీనియర్ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అభివృద్ధిని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి

**తూప్రాన్, మే 24 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ మండల స్థాయి బాధ్యులు ప్రతి ఇంటింటికి తీసుకెళ్లాలని నియోజకవర్గ పరిశీలకులు వరప్రసాద్, మెట్టు సాయిలు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మనోహరాబాద్ మండలాల గ్రామస్థాయి పార్టీ అధ్యక్షులకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు వరప్రసాద్ మెట్టు సాయిలు తెలిపారు. తూప్రాన్ మనోహర బాద్ మండల పార్టీ నాయకులు కార్యకర్తలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి ప్రతి కార్యకర్తకు తీసుకెళ్లాల్సిన బాధ్యత గ్రామ మండల కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు ఉంటుందని అన్నారు. ప్రభుత్వ చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికి చేరైన కార్యకర్తలు నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల పురం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మనోహర్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీను తదితరులు పాల్గొన్నారు అనంతరం తూప్రాన్ బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జయ సంవిధాన్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మనోహరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**మల్కాజిగిరి, మే 24 (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మల్కాజిగిరి సర్కిల్ టియుడబ్ల్యూజే అధ్యక్షులు జార్జ్ విల్సన్,ప్రధాన కార్యదర్శి గిరి గౌడ్ గడ్డమీది కోరారు. శనివారం మల్కాజిగిరి సర్కిల్ గాంధీ పార్క్ ప్రాంగణంలో ఉన్న మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ ఆవరణలో ఈనెల 31న టిజెఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రజతోత్సవ వేడుకల గోడపత్రిక ను స్థానిక జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలవేళ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్, హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరచలేదని పేర్కొన్నారు. ప్రెస్ అకాడమీకి భార్య నిధులు కేటాయించి జర్నలిస్టులకు చేయూతనందిస్తూ మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు అధిక సాయాన్ని అందించాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులపై సీతకను వేస్తుందని ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించి విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బద్దల మురళీ కృష్ణ యాదవ్, అక్కల రాజేందర్ గౌడ్, పాండు గౌడ్, చేగుంట నరేష్ బాబు,, సాయి కిరణ్ గౌడ్, శివ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



**కాప్రా, మే 24 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి దేయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ లోని భక్షిగూడ,కృష్ణనగర్ కాలనీలలో 33.50 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తీ స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని అలాగే డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే కు,డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్, కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, దేవిరాజ్, బుచ్చిరెడ్డి, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, బాలయ్య గౌడ్, చారి, అంజయ్య గౌడ్, నవీన్ గౌడ్, అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, రత్నమాల, ఎల్లప్ప, మరియు బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, నిసార్ అహ్మద్ గోరి, కిరణ్ మరియు కాలనీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## లక్ష్యం మేరకు టాక్స్ వసూలు చేయాలి

- కమిషనర్ ఆర్ వి కర్ణన్



**హైదరాబాద్ సిటీ, మే 24 (జనంసాక్షి) :** లక్ష్యం మేరకు టాక్స్ వసూలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వార్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ అడిషనల్ సిసిపి, డిప్యూటీ కమిషనర్లు, ఏసిపిలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ కంటెంప్ట్ కోర్టు కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... బిల్ కలెక్టర్లు రెసిడెన్షియల్ టాక్స్ తో పాటుగా ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా వాసులు చేయాలని డిప్యూటీ కమిషనర్ లను ఆదేశించారు. రెసిడెన్షియల్ నుండి కమర్షియల్ గా మార్చి పన్ను వసూళ్లు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సర్కిల్ స్థాయిలో దినం తప్పించి దినం సమీక్ష చేసుకుని టాక్స్ వసూళ్ల లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. డి సి లతో టాక్స్ పై అడిషనల్ కమీషనర్ కూడా రివ్యూ చేయాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజుల్లో వసూలు చేయకుండా నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అంతకు ముందు కమిషనర్ వివిధ జోన్ లలో ఉన్న కంటెంప్ట్ కేసులకు సరైన రిప్లై ఇవ్వాలని, ఒక్కొక్క జోన్ వారిగా కంటెంప్ట్ కేసులు సమీక్షించారు. కోర్టు తీర్పు ప్రకారంగా సరైన రిప్లై ఇవ్వాలని, ఈ విషయంలో అవసరమైన సహాయం కొరకు లీగల్ ఓఎస్‌డి, అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ, సిసిపి శ్రీనివాస్ లను సంప్రదించాలని సూచించారు. కంటెంప్ట్ కేసులు తర్వాత వచ్చే వారంలో రిట్ పిటిషన్ లపై రివ్యూ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.ఈ సమావేశంలో సిసిపి శ్రీనివాస్, అడిషనల్ కమీషనర్లు అనురాగ్ జయంతి, సత్యనారాయణ, వేణు గోపాల్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రామ్ నాయక్, ఆడిషనల్ సిసిపి వెంకన్న, లీగల్ ఓ ఎస్ డి సుధీర్, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ ఏసిపి లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ హాస్టళ్లపై కొరడా

- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న టాస్క్ ఫోర్స్ టీమ్‌లు
- 38 హాస్టళ్లకు షోకాజ్ నోటీసులు
- 7 హాస్టల్ కిచెన్‌లు సీజ్
- రూ. 2,46,000 జరిమానా విధింపు



**హైదరాబాద్ సిటీ, మే 24 (జనంసాక్షి) :** నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు హాస్టళ్లలో టాస్క్ ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం పలు ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ షోకాజు నోటీసులు, కిచెన్ సీజ్ తో పాటు జరిమానాలు విధించారు.ఈ టీమ్ శుక్రవారం 58 హాస్టళ్లను తనిఖీ చేసి 30 హాస్టళ్లకు నోటీసులు జారీ చేసి, 8 హాస్టల్ కిచెన్ లను సీజ్ చేశారు. అంతేకాకుండా సుమారు రూ. 2.45 లక్షల జరిమానా విధించారు. హాస్టల్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం కాకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం మూలంగా ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో జిహెచ్ఎంసి కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్ ద్వారా నగరంలోని హాస్టళ్లలో తనిఖీలు చేయించారు. హాస్టళ్ల ఆకస్మిక తనిఖీలకు కొనసాగింపుగా 24.05.2025 శనివారం ఎల్బీనగర్ జోన్‌లోని శ్రీనగర్ కాలనీ, లలిత నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం, కూకట్‌పల్లి జోన్‌లోని కె పి హెచ్ పి, మూసాపేట్ ప్రాంతాలు, శేరిలింగంపల్లి జోన్‌లోని వినాయక్ నగర్, పత్రికా నగర్‌లలో ఈ డ్రైవ్ నిర్వహించారు. 60 హాస్టళ్లను తనిఖీ చేసి 38 హాస్టల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. 07 హాస్టల్ కిచెన్ లను మూసివేశారు. జీహెచ్ఎంసి చట్టం, 1955 నిబంధనల ప్రకారం బృందాలు రూ.2,46,000 జరిమానా విధించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
25 మే 2025

# హైవే విస్తరణ బాధితులకు పరిహారం కోసం కృషి చేస్తా..

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, మే 24 (జనం సాక్షి) :** 167వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జడ్చర్ల పట్టణ పరిధిలో నిర్మాణాల తొలగింపుతో నష్టపోయిన బాధితులకు పరిహారం ఇప్పించడానికి ప్రయత్నిస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. దీని కోసం బాధితులందరూ తమ దరఖాస్తులను తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇవ్వాలని కోరారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన పార్టీ నేతల ఇళ్లను కాపాడుకోవడానికి హైవే అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లోని హైవే బాధితులకు పరిహారం ఇచ్చిన కేంద్రం, జడ్చర్లకు మాత్రం పరిహారం ఇవ్వకపోయిన కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. శనివారం జడ్చర్ల పట్టణంలో 20వ, 2వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా అనిరుధ్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి మొదలుకొని కల్వకుర్తి రోడ్డులోని జడ్చర్ల వంద పడకల ఆస్పత్రి వరకూ ఉన్న ఇళ్లు , భవనాలను తొలగించడం జరిగిందని, అయితే ఇతర ప్రాంతాల్లో ఇళ్లు కొట్టేసినప్పుడు నష్టపరిహారం ఇచ్చారని, కానీ జడ్చర్ల పట్టణంలో మాత్రం పరిహారం ఇవ్వకపోయినా గతంలో ఉన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దీని కోసం కనీసం ఒక లేఖ అయినా ఇచ్చారా అని నిలదీసారు. ఈ విషయం గురించి తాను ఎన్నికలకు ముందు కూడా మాట్లాడానని గుర్తు చేసారు. ప్రస్తుతం జాతీయ రహదారుల విభాగం అధికారులతో ఈ విషయం గురించి తాను మాట్లాడానని, జడ్చర్ల పట్టణంలో నష్టపోయిన బాధితులకు పరిహారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసానని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన కార్యకర్తకు సంబంధించిన ఇల్లు కొట్టాల్సి వస్తుందని నేషనల్ హైవే డిజైన్ మార్చారని, ఈ కారణంగానే రోడ్డుకు ఒక వైపు ఎక్కువగా కొట్టేసి, మరోవైపు తక్కువగా కొట్టారని ఇదెక్కడి న్యాయమన్నారు. ఇప్పుడు అఖిల పక్షం సమావేశం పెట్టుకున్నప్పుడు గతంలో ఎవరి ఇళ్లు పోకూడదని హైవే అలైన్ మెంట్ మార్చారో గుండెలపై చేయి వేసుకొని ఆలోచించాలని అనిరుధ్ రెడ్డి హితవు పలికారు. ఈ అలైన్‌మెంట్ మార్చినప్పుడు లక్ష్మారెడ్డి ఏం ఆలోచించారని, ఈ విషయంగా అసలు ఆయనకు అవగాహన ఉందా? అని విమర్శించారు. ప్రభుత్వ భూములకు, దేవుని భూములకు ఎన్వోసీలు తెచ్చుకోవాలి, ప్లాటింగ్ చేసి ఎలా అమ్ముకోవాలనే ఆలోచన తప్ప నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే ఆలోచన కూడా మాజీ ఎమ్మెల్యేకు లేదని దుయ్యబట్టారు. ఈ కారణంగా నష్టపోయిన వారికి పరిహారం ఇప్పించడానికి తాను ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. దీని కోసం రహదారి విస్తరణలో నష్టపోయిన జడ్చర్ల పట్టణ వాసులు తమ వివరాలతో కూడిన దరఖాస్తులను తన క్యాంపు కార్యాలయంలో అందించాలని కోరారు. ఈ విషయాన్ని తాను కేంద్ర జాతీయ రహదారుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులందరికీ పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు బుక్క మహేష్, రాజు, నాయకులు మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, నిత్యానందం, ఏం మాలిక్ షాకీర్, రమేష్ యాదవ్, షేక్ బాబా తదితరులు ఉన్నారు.

# రహదారి నిర్మాణంతో పాత బజార్‌కు అన్యాయం చేయకండి

- ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేసిన నాయకులు



**జడ్చర్ల, మే 24 (జనం సాక్షి) :** జడ్చర్ల పట్టణంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి 167 విస్తరణ వల్ల బాదేపల్లి పట్టణంలోని పాతబజార్ కు అన్యాయం జరగకుండా రహదారి నిర్మాణంలో మార్పులు చేసి న్యాయం చేయాలని అఖిలపక్షం నాయకులు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డిని కోరారు. జడ్చర్ల సిగ్నల్ గడ్డ మీదుగా నిర్మాణం చేపడుతున్న 167వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ వాహనాలు పాత బజార్ వెళ్లేందుకు వీలు లేకుండా ఆర్.యు.బి రోడ్డు ద్వారా కేవలం కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు మాత్రమే పరిమితం చేసి రోడ్డు నిర్మాణం చేపడుతుండడంతో అఖిలపక్షం నాయకులు శనివారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. శనివారం పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ పట్టణంలో సిగ్నల్ గడ్డ దగ్గర నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వల్ల పాత బజార్, పద్మావతి కాలని, చైతన్య నగర్ తదిర కాలనీలకు స్కూల్ బస్ లు రావడానికి లేకుండా పోతుందని, ఇప్పటికే పాత బస్టాండ్ కు ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే పట్టణాలు, గ్రామాల ప్రజలకు మేలు జరిగేదిగా ఉండాలని కానీ ఈ రోడ్డు వలన రవాణా సౌకర్యం లేక పూర్తిగా నష్టపోయే పరిస్థితి నెలకొందని అన్నారు. గత ప్రభుత్వ హయంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జాతీయ రహదారి విస్తరణ పనులలో కొన్ని మార్పులు చేయించి ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి నష్టం జరగదు అని చెప్పడంతో అందరూ మౌనంగా ఉన్నారని కానీ ఇప్పుడు జాతీయ రహదారి అధికారులు రోడ్డు విస్తరణలో బాగంగా వేస్తున్న ఫ్లై ఓవర్ వల్ల బాదేపల్లి పాత బజార్ కి బస్సులు భారీ వాహనాలు వచ్చే అవకాశం లేదని చెప్పడంతో అందరూ కంగుతిన్నామని వాపోయారు. జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తమ సమస్యను తీసుకెళ్లి బాదేపల్లికి నష్టం జరగకుండా చూడాలని అన్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి నీ కలసి జాతీయ రహదారి వల్ల గ్రామానికి జరిగే నష్టాన్ని వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తాను నేషనల్ హైవే అధికారులతో మాట్లాడతానని త్వరలోనే వారితో కలిసి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించి ఎవ్వరికి ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చిస్తానని అన్నారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు సీతారాం, పిట్టల మురళి, రామ్ మోహన్, సాహితీ రెడ్డి, అమర్ నాథ్ గౌడ్, బాలవర్ధన్ గౌడ్, బాదేపల్లి రంజిత్ బాబు, రాంరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఉమాశంకర్ గౌడ్, నంద కిషోర్ గౌడ్, సత్యం, శ్రీనివాసులు, మురళి, హాఫీజ్, అనిల్, వెంకటేశ్వర్ రెడ్డి, నర్సింహా, ముచర్ల కృష్ణయ్య, ఎంబి బాల కృష్ణ, గుండు వెంకటేష్, అశోక్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# రసాయన వినియోగాన్ని తగ్గించాలి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మే 24 (జనం సాక్షి) :** నారాయణపేట మండలం,సింగారం గ్రామం శనివారం రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ పరిమళ కుమార్, డాక్టర్ సరిత మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించి వాటి స్థానంలో పచ్చ రొట్ట ఎరువులు,వర్మి కంపోస్టు, జీవన ఎరువులు వాడాలని తెలిపారు. అధిక రసాయన ఎరువులు వాడకం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించి ప్రత్యమ్నాయంగా జీవ నాశినులు ఎరువులైన రైజోబియం, ట్రైకోడర్మా, సూడోమొనాస్ వంటివి వేసుకోవాలని సూచించారు. దీంతో భూమి సారవంతమైతుందని, అలాగే పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. భారీగా హజరైన రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఏఓ జాన్ సుధాకర్,యంఏఓ బాల దినకర్, పశు వైద్యాధికారి అనిరుధ్ ఆచార్య, ఏఈఓ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జయతీర్థ చారి, క్రిష్టపార్, హన్మంతు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత విద్య



**చిలప్‌చేడ్, మే 24 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా చిలప్ చేడ్ మండల శిక్షణ కార్యక్రమం ఎంఈఓ విఠల్ నేతృత్వంలో కేజీబీవీ చిట్కుల్ కేంద్రంగా శనివారంతో విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విఠల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్,విద్యా బోధనలో నూతన మెలుకువలు,పద్ధతులు పాటిస్తూ ప్రణాళికబద్ధంగా బోధిస్తూ నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించాలని, ఖచ్చితమైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు మరింత బలపడే విధంగా ఈవిద్యా సంవత్సరం నుంచి ఏఐ ఆదారిత విద్యను అందించాలని, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జూన్ 6నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల నమోదు సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్స్‌గా సునీల్, నాగేందర్, సుజాత, మహేష్, వెంకటకృష్ణ, పండరి, యాదయ్య, నవీన్‌లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇందులో మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీఆర్పీలు మల్లేశం,రాజశేఖర్, మండల ఎంఆర్సి సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు.

# ఎత్తిపోతల పథకాల భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి. రవి నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 24 (జనం సాక్షి) :** జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు ఎత్తిపోతల పథకాల భూసేకరణ పనులు, పునర్వస పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి (స్పెషల్ ఆఫీసర్ )జి. రవి నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ విసి హాల్లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి నారాయణపేట కొడంగల్ స్కీం,రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ పనులలో భూసేకరణ గురించి పనులను ఇరిగేషన్, రెవిన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అయ్యే విధంగా భూసేకరణ, ఇంకా మిగిలిన పెండింగ్లో ఉన్న భూసేకరణ చేయాలన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కృష్ణా నది ద్వారా జలాలను వినియోగించడం వల్ల జిల్లాలో సాగునీరు అవసరం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట కొడంగల్ స్కీం ఎత్తిపోతల పథకాల భూ సేకరణ పనులపై చర్చించారు. జిల్లాలో 21 గ్రామాలలో సేకరణ జరగగా మక్తల్ లో 155.38 ఉట్కూర్ లో 234.16 నారాయణపేటలో 94.33 దామరగిద్దలో 76.35 ప్రోగ్రెస్ ఉందన్నారు. యల్. ఎ. ప్రొపొసల్స్ కానుకూర్తి ట్యాంక్ (749ఏసీ)1లక్ష ఎక్కర్స్ గ్రావిటీ కెనల్స్ ఖన్కుర్తి, దౌలతాబాద్, పనులలో ప్రాసెస్ అఫ్ ఇన్వెస్టిగేషన్ 1,500 ఏసీ ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, సి.ఈ.రమణారెడ్డి ఎస్. ఈ.హచ్. టి.శ్రీధర్ ఈ. ఈ. బ్రహ్మం, ఈ. ఈ.ప్రతాప్ సింగ్,ఆర్.డి.ఓ.రాంచందర్, తహసీల్దార్ లు నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌పై సీపీఎం ఖండన

- కేంద్ర ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి టౌన్, మే 24 (జనం సాక్షి) :** ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులపై జరిగిన ఎన్‌కౌంటర్‌ను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని, కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపకపోవడం, అమానుషంగా హత్యలు చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. శనివారం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీసగఢ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్ చేయడం అమానవీయ ఘటనగా పేర్కొన్నారు. మావోయిస్టులు చర్చల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం, ఛత్తీసగఢ్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కారానికి ప్రయత్నించకపోగా హత్యాకాండకు పాల్పడడమే తమ విధానంగా మార్చుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. మావోయిస్టులను అంతం చేస్తామంటూ కేంద్ర హెూం మంత్రి డెడ్‌లైన్ ప్రకటిస్తుండడం, చర్చల అవసరం లేదని ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రి చెబుతుండడం వారి ఫాసిస్టు మనస్తత్వానికి నిదర్శనమని, వారి తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రం వెంటనే చర్చల కోసం మావోయిస్టుల విజ్ఞప్తిని అంగీకరించాలని, వారిపై పారా మిలిటరీ ఆపరేషన్లను నిలిపివేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నాయకులు అశోక్, రాజయ్య, బాలరాజు, అర్జున్, తది తరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, మే 24 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం రోజున కలెక్టర్ కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో వారిని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి, ఖాజానాజిమ్‌అలీ అప్సర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యా సంవత్సరం పూర్తి అయినవారికి ఉన్నత చదువుల కోసం మరొక కళాశాలలో చేరటానికి టీసీ, మెమో, బోనఫైడ్ లు స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ విద్యార్థులకు రాకపోవడంతో ఫీజులు కట్టిన తర్వాతనే ఇస్తామని వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసున్నారని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి అన్నారు. టీసి, మెమో, బోనఫైడ్‌లు ఇవ్వక పోవడంతో విద్యార్థులు ఫీజులు కట్టలేక ఉన్నత విద్యను అభ్యసించ లేక మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. అదేవిధంగా ఏదైనా ఉద్యోగ పోస్టులకు అప్లై చేసుకోవడానికి సర్టిఫికెట్స్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వం దృష్టికి వెంటనే తీసుకువెళ్లి నిధులు విడుదల చేయించాలని వినతిలో పేర్కొన్నారు. లేనిపక్షంలో విద్యార్థి ఉద్యమాలు తీవ్రస్థాయిలో ఉంటాయని బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి అన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 24 (జనం సాక్షి) :** నకిలీ విత్తనాల నియంత్రణపై టాస్క్ ఫోర్స్ సమావేశం నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ టీం కలిసి నకిలీ విత్తనాలు నియంత్రణపై చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో డీఎస్పీ లింగయ్య తో కలిసి నకిలీ విత్తనాల విక్రయాలపై ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏవోలు విత్తన దుకాణాల పై తనిఖీలు నిర్వహించాలన్నారు. సీడ్ డీలర్లు ఎలాంటి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలు అమ్మరాదని తెలిపారు. డీలర్లు లూస్ విత్తనాలు ఫేక్ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏవోలు వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎక్కడ కూడా నకిలీ విత్తనాలు అమ్మకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మిన సీడ్ వ్యాపారులపై పిడిఎఫ్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. 2024లో నకిలీ విత్తనాల మీద 8 మందిపై పిడిఎఫ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీడీ యాక్ట్ నమోదు చేస్తే వారు ఒక సంవత్సరం జైలులో శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. సీడ్ డీలర్లు సహకరించి నకిలీ విత్తనాల నిరోధానికి కృషి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో సీడ్ వ్యాపారులు తమకు సహకరించి నకిలీ విత్తనాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఉన్నట్లు తెలిస్తే తమకు గానీ ఎస్పీకి గానీ సమాచారం ఇస్తే వారి పేరు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో డిఏవో, ఎడిఏ ఎస్ హెచ్ ఓ డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో, అత్యాచార కేసులలో దోషులకు శిక్ష పడేలా చూడాలి

- ప్రతి కేసులో ఇన్వెస్టిగేషన్ నాణ్యతగా ఉండాలి
- పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, కోర్టు డ్యూటి అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, మే 24 (జనం సాక్షి) :** మర్డర్, పోక్సో, అత్యాచార, మాదక ద్రవ్యాల కేసులలో దోషులకు శిక్ష పడేలా చూడాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, కోర్టు డ్యూటి అధికారులతో యస్పి కో–ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ను త్వరితగతిన పూర్తి చేసి, నిర్ణీత సమయంలో కేస్ ఫైల్ కోర్టు కు పంపేవిధంగా చూడాలని సూచించారు. కోర్ట్ డ్యూటి అధికారులు చార్జ్ షీట్ దాకలు మొదలుకొని, తీర్పు వెలువడే వరకు ఫిర్యాది, బాదితులకు అండగా ఉంటూ, నిందితులు సాక్షులను ఇబ్బందులు కలిగించకుండా చూడాలన్నారు. వీలైనన్ని ఎక్కువ కేసులో దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. పోక్సో, అత్యాచార కేసులలో దోషులు తప్పించుకోవడానికి వీలులేదన్నారు. చట్టం ముందు దోషులకు శిక్ష పడినప్పుడే తిరిగి నేరం చేయడానికి వెనకడుగు వేస్తారని అన్నారు. దోషులకు శిక్ష పడితేనే ప్రజలలో పోలీసుల పై నమ్మకం పెరుగుతుందని అన్నారు. కోర్ట్ డ్యూటి అధికారులు కోర్ట్ అధికారులతో మంచి కమ్యూనికేషన్ కలిగి వివిధ కేసులలో ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. కోర్ట్ డ్యూటి పోలీసు అధికారులు వారానికి ఒక్కసారి సంభందిత యస్.హెచ్.ఓ లతో కో–ఆర్డినేషన్ మీటింగ్ పెట్టుకొని, వివిధ కేసులల్లో సమన్స్, కేసు ప్రాపర్టీ వంటి అంశాల గురించి చర్చించాలని అన్నారు. డ్యూటి పరంగా ఎలాంటి సమస్యలున్న నేరుగా నా దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ.., విధి నిర్వహణలో అలసత్వం చూపరాదని అన్నారు. అనంతరం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యం.సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ కేసులలో సైంటిఫిక్, ఎలక్ట్రానిక్ సాక్షాదారాలు చాలా కీలకం అని, ఈ సాక్షాదారాల వలన నిందితులు తప్పించుకోవడానికి అవకాశం లేదని ప్రతి కేసులో సైంటిఫిక్, వీడియో, ఫోటో గ్రాఫి, చాలా కీలకం అన్నారు. వివిధ కేసులలో యస్.హెచ్.ఓ లకు తగు సలహాలు సూచనలు చేస్తూ ఎల్లవేళలా సహాయకారిగా ఉంటామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీటీసీ అదనపు శ్రీనివాస్ రావ్, సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డియస్పి ప్రభాకర్, నారాయణఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యం. సత్యనారాయణ, రాజేశ్వర్, సూర్ రెడ్డి, విజయ్ శంకర్ రెడ్డి, స్వాతి, లతీఫ్ ఉర్ రహమాన్, రజిత రథోడ్, స్వాతి గౌడ్, సుభాష్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, కోర్ట్ లైజనింగ్ అధికారి సత్యనారాయణ కోర్ట్ డ్యూటి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన జాబితాను జిల్లా స్థాయికి సమర్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల నడిగడ్డ, మే 24 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేసి, పరిశీలించిన జాబితాను వెంటనే జిల్లా స్థాయికి సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఐ.డి.ఓ.సి. కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్లు,రాజీవ్ యువ వికాసం పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఇందిరమ్మ ఇళ్ల అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హుల వివరాల జాబితాను వెంటనే అందజేయాలని అన్నారు. పైలట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, సంబంధిత ఎ.ఈ.లు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. ఎ.ఈ లు పంచాయితీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులు నిర్మాణం పనులను ప్రారంభించుకొనే విధంగా ప్రోత్సహించాలని ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో, ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున,అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను జాప్యం లేకుండా వేగవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఎంపిక జరగాలని అన్నారు. లబ్ధిదారుల వివరాల సాఫ్ట్ కాపీని బ్యాంకులకు వెంటనే పంపించాలని,అలాగే సెక్టార్ వారీగా నాన్ లింకేజ్ బ్యాంకింగ్ వివరాలతో జాబితా సిద్ధం చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. సోమవారంలోపు లబ్ధిదారుల బ్యాంక్ వివరాల నిర్ధారణను పూర్తి చేసి,తుది జాబితాను జిల్లా కార్యాలయానికి సమర్పించాలని అన్నారు. అధికారులు, బ్యాంకర్లు పరస్పర సమన్వయంతో పని చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఈ.డి. ఎస్సీ కార్పొరేషన్ రమేష్ బాబు, ఎల్డీయం శ్రీనివాస రావు, పి.డి హౌసింగ్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, స్పెషల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జీపీవో పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ సత్య శారదాదేవి

**వరంగల్ ప్రతినిధి, మే 24 (జనం సాక్షి):** గ్రామపాలన అధికారులు(జీపీవో) పరీక్ష నిర్వహిణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను తెలిపారు. వరంగల్ లోని ఇస్లామీయ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 198 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. శనివారం సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, మే 25న ఆదివారం ఉదయం 10 30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్టియూహెచ్ కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీటింగ్ అరేంజ్మెంట్స్ పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన త్రాగు నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మేర ఇన్విజిలేటర్ నియమించాలని,అభ్యర్థులు ఏ విధమైన ఎలక్ట్రానిక్ మరియు వాచీలు తీసుకురావద్దని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్ల తో మెడికల్ టీం ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల రూట్ లలో బస్సు నడపాలని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ షాపులు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వరంగల్ నుండి ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఏవో విశ్వ ప్రసాద్ , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## భ్రూణ హత్యలను నివారించాలి

- జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్



**మహబూబాబాద్ మే 24 (జనం సాక్షి) :** శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ మెడికల్ టర్మినేషన్ ప్రెగ్నెన్సీ పిసిపిఎన్ డిటిఆక్ట్‌ల పై జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉందని అబార్షన్స్ రేట్ ఎక్కువగా ఉందని ఎక్కడైతే ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలలో ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ఆరోగ్య సిబ్బంది ఎక్కడైనా ఏ హాస్పిటల్లో నైనా అబార్షన్స్ జరిగితే చెప్పాలని ఎంటిపి ఆక్ట్ ప్రకారం వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు డాక్టర్ జగదీశ్వర్ పీడియాట్రిషన్ నగేష్ గవర్నమెంట్ ప్లీడర్ డాక్టర్ మీనాక్షి గైనకాలజిస్ట్ సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ డాక్టర్ నాగవని ఐసిడిఎస్ సూపర్వైజర్ వాహిని కౌన్సిలర్ రమేష్ చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ వెంకటేష్ ఆరోగ్య విద్యా బోధకులు కేవీ రాజు హెచ్ ఈ ఓ లోక్య సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ అరుణ్ మనోహర్ ఎల్ డి కంప్యూటర్స్ సిసి అనిల్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు



## ప్రజా సంక్షేమమే నా లక్ష్యం

- ప్రజల ఆకాంక్ష మేరకే అభివృద్ధి చేస్తున్నాం
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు

**మంచిర్యాల ప్రతినిధి మే 24 (జనంసాక్షి) :** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిచేయడంలో నిమగ్నమై ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజలకు అవసరమైన అన్ని పనులూ త్వరితగతిన పూర్తిచేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నానని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. శనివారంనాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రి ఆయన సందర్శించారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి అతి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. గోదావరి నదిపై బ్రిడ్జి విషయంలో కొంతమంది అదే పనిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

## దళితుల భూములకు ఎకరాకు 13.5 లక్షలు

- ఎమ్మెల్యేకు 2 వందల కోట్లు
- దళితులను దగా చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు
- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఆగ్రహం



**మంచిర్యాల ప్రతినిధి మే 24 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లాలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు విషయంలో పోచంపాడు గ్రామ శివారులోని వేంపల్లి, ముల్కల్లా, గ్రామాలకు చెందిన దళిత ,బీసీ సోదరుల, భూములకు ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు ఎకరానికి పదమూడున్నర లక్షల రూపాయలు అతి తక్కువ చెల్లించి భూములు బలవంతంగా లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ దళితుల భూములకు మార్కెట్ రేట్ ప్రకారం వారికి ఇవ్వాల్సిన న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ స్థలంలో ఇండస్ట్రియల్ పార్క్ చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు, కానీ భయపెట్టి, బెదిరించి వాళ్ల దగ్గర నుంచి అన్యాయంగా భూములు గనుక తక్కువ ధరకు తీసుకుంటే, రేపు మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మేము దళిత,బీసీ సోదరులకు అండగా ఉంటాం.. ఎవరైన అక్కడ భూములు తక్కువ ధరకు కొనుగోలు చేసిన,అట్టి భూములను భవిష్యత్ లో తిరిగి మళ్ళీ దళిత,బీసీ సోదరులు వారి ఆధీనంలోకి తీసుకుంటారని గుర్తు చేశారు. నేడు మార్కెట్ రేటు ప్రకారం అక్కడ భూమి విలువలో 30 శాతం డబ్బు ప్రభుత్వానికి కట్టి, మిగతా 70 శాతం డబ్బు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇచ్చి మీరు భూములు కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో మీరు కట్టిన డబ్బులు, భూమి మీకు తిరిగి రావు అని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ రోజు ఆ భూమికి ఎంత రేటు ఉంటుందో అంత రేటు అక్కడ కొన్న వ్యాపారస్తులే అక్కడున్న దళిత బీసీ సోదరులకు చెల్లించవలసి వస్తుందని గుర్తు చేశారు. ఇప్పుడు తక్కువ చెల్లించి బెదిరించి భూములు తీసుకుంటే రాబోయే ప్రభుత్వంలో ఆ భూమిని వాళ్ళు ఆక్రమించుకుంటారని తెలిపారు.ఆప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తున్నారని అన్నారు. అన్యాయానికి మీరు కొమ్ముగాసి, పేదవాళ్ల ను రోడ్డున పడేసి, మీరు అక్కడ వ్యాపారం చేసి డబ్బులు సంపాదించుకుంటాము అని అనుకుంటే ఇది సరైన పద్ధతి కాదు అని అన్నారు. ముల్కల్ల,వేంపల్లి గ్రామాలకు సంబంధించిన భూమి కోల్పోతున్న రైతులు, మాకు ఇప్పుడు జరుగుతున్న అన్యాయాన్ని బాండు పేపర్ మీద రాసి ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారుల అండతో మమ్ములను బెదిరించి భూములు తీసుకున్నారు కాబట్టి, మాకు న్యాయం చేయగలరు, మాకు ఇష్టం లేకున్న,భయంతోనే మేము ఈ భూములు ఇచ్చి డబ్బులు తీసుకున్నామని మాకు చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ పట్టణ అధ్యక్షులు,మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, టీజీబీకేఎస్ నాయకులు,కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.

## సమాజంలో ఏకత్వం శాంతి సామరస్య స్థాపనకు కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు

- వరంగల్ జిల్లా జడ్జి విబి నిర్మల గీతాంబ




**వరంగల్ ప్రతినిధి, మే 24 (జనం సాక్షి):** సమాజంలోని వివిధ రకాల వ్యక్తులు మధ్య నెలకొన్న వివాదాలను సామరస్యంగా శాంతి పూర్వకంగా పరిష్క రించినట్లయితే సమా జంలో శాంతిభద్రతలు పరిఢవి ల్లుతాయని వీటి కోసం కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు ఎంతగానో ఉపయుక్తమని వరంగల్ జిల్లా జడ్జి విబి నిర్మలా గీతాంబా అన్నారు. శనివారం వరంగల్‌లో మూడు కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను న్యాయమూర్తి ప్రారంభించారు. ఎల్‌బి నగర్‌లో ముస్లిం కమ్యూనిటీ సెంటర్, బాపూజీ భవన్‌లో ఆల్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ మరియు పాపాయిపేట్ చమన్‌లో వాసవి మీడియేషన్ సెంటర్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ సుజోయ్ పాల్ గారి ఆదేశాల మేరకు ఈ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా సెంటర్లలో మధ్యవర్తులుగా వ్యవహరించే పెద్దమనుషులకు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఇదివరకే మూడు రోజుల శిక్షణ ఇచ్చినట్లు ఆమె ప్రకటించారు. ఈ కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రాల్లో ఎవరైనా తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. అట్టివారికి ఉచితంగా సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తారని అన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రాలలో పరిష్కరించబడిన వివాదాలకు లోక్ అదాలత్ ద్వారా తీర్పులను జారీ చేస్తారని, ఇవి అంతిమమైన అప్పీలు రహితమైన తీర్పులని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. సాయికుమార్ ఆయా కమ్యూనిటీ పెద్దలు పాల్గొన్నారు.

## వీధి దీపాలు తక్షణమే ఏర్పాటు చేయాలి

**టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ రెడ్డి**

**నస్పూర్, మే 24, (జనంసాక్షి):** సింగరేణి యాజమాన్యం కార్మికుల శ్రేయస్సు గాలికి వదిలేసి,రాత్రి సమయంలో కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి,శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెట్టం లక్ష్మణ్ ఒక ప్రకటనలో విమర్శించారు.ఏరియాలోని రాయల్ టాకీస్ నుండి ఎస్ఆర్పి 3 గనికి వెళ్లే దారి,సిసిసి నుండి సంగమల్లయ్యపల్లె మీదుగా ఇదే గనికి వెళ్లే దారు లలో రాత్రి సమయంలో వీధి దీపాలు లేక కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఆయా మార్గాలలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే రేవూరి



**పరకాల, మే 24 (జనం సాక్షి):** మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళు తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని వి ఓ భవనంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం శిక్షణ కేంద్రంలో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులు చేయాలి అనే దృఢ సంకల్పంతో ముందుకు వెళుతుందని అన్నారు.ఇప్పటికే ఆత్మకూరు,దామెర,గీసుగొండ, సంగెం మండల కేంద్రాలలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ప్రారంభించామని అన్నారు.మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నామని, దానికి అనుగుణంగా మార్కెటింగ్ వ్యవస్థనుతీసుకురాబోతున్నామన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అనే ఉద్దేశంతోనే సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి అవకాశాలు పొందాలని అన్నారు.మహిళా సంఘాలతో కలిసి పనిచేయడానికి సంబంధించి వి హబ్ తో వివిధ సంస్థలకు మధ్య కుదిరిన అవగాహనా ఒప్పంద పత్రాలను ముఖ్యమంత్రి గారి సమక్షంలో మార్చుకున్నామని అన్నారు.రాష్ట్రంలో మహిళలను ప్రోత్సహించాలి అని,వారిని ఆర్థికంగా నిలబెట్టాలి అని,ఆర్థిక క్రమ శిక్షణతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళు తుందన్నారు.

## అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్లే ముద్దసాని మృతి

- ముద్దసాని సత్యనారాయణ రెడ్డి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్

**చెన్నారావుపేట, మే 24 (జనంసాక్షి) :** అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్లనే చెన్నారావుపేట సొసైటీ మాజీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి మృతి చెందారని ఆయన మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ అన్నారు. శనివారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెన్నారావుపేట సొసైటీ మాజీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి గుండెపోటుతో మరణించడం చాలా దురదృష్టకరమన్నారు. ఫ్యాక్స్ నియమ నిబంధనలకు విరుద్ధంగా చైర్మన్ గా ఉన్న సత్యనారాయణ రెడ్డిని తొలగించడం ఆయనను మానసికంగా వేధించినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. అధికార పార్టీ నాయకులు వారి అనుచరులు సొసైటీ నియమాలను పాటించకుండా కేవలం వారి కార్యకర్తలకు లబ్ధి చేర్చడం కోసం ఇష్టారీతిన రుణాలు మంజూరు చేయమని వేధించారన్నారు. సొసైటీ పరిధిలో నడుస్తున్న పెట్రోల్ బంకులో లక్షలాది రూపాయల డీజిల్ ను అధికార పార్టీ ముఖ్య నాయకులు సొంత కాంట్రాక్టు వ్యాపారం కోసం చెల్లించాలని సత్యనారాయణ రెడ్డిని వేధించారన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే మానసిక వేదనకు గురై సత్యనారాయణ రెడ్డి గుండెపోటుతో మృతి చెందడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షతో నియమ నిబంధనలకు విరుద్ధంగా నియోజకవర్గంలో కొద్దిమంది సొసైటీ చైర్మన్ లను తొలగించినట్లు ప్రకటనలు చేయడం దానికి అధికారులు వత్తాసు పలకడం వల్లనే ఇలాంటి పరిణామాలు జరిగాయన్నారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు చైర్మన్లను కొనసాగించాలని తీర్పు ఇచ్చినప్పటికి వరంగల్ జిల్లా డిసిబి కోర్టు తీర్పును గౌరవించకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు భయపడి అధికారులు పనిచేయకూడదని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్లు చెట్టుపెల్లి మురళీధర్ రావు, సుకినె రాజేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ పత్తి నాయక్, బిఆర్ఎస్ మండల ఇంచార్జి బాల్నె వెంకన్న, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ చింతకింది వంశీ, మాజీ సర్పంచులు కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, బానోతు లాల్ సింగ్, బిఆర్ఎస్ మండల నాయకులు కొండవీటి ప్రదీప్ కుమార్, జున్నుతుల మహేందర్ రెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్లు, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన తండాలకు బీటీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**సారంగాపూర్, మే 24 (జనంసాక్షి) :** సారంగాపూర్ మండలం సిరిపెల్లి గ్రామం నుండి బంద్రేవ్ తండా వరకు ఐటీడీఏ నిధులు 75 లక్షల రూపాయలతో నూతన బిటి రోడ్డు నిర్మాణ పనులకి నాగపూర్ పీఆర్ రోడ్డు నుండి దేవితండా వరకు రూ. 37 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు కాల్వ నరేష్, సీనియర్ నాయకులు రాంశంకర్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, ముత్యం రెడ్డి, రాజేందర్ రెడ్డి, సాహెబ్ రావ్, రాజేశ్వర్ రెడ్డి, నాయకులు నారాయణ, విలాస్, ప్రకాష్, వీరయ్య, పోతన్న, నర్సయ్య, రాజు రెడ్డి, తిరుమల చారి, శ్రీకాంత్ రెడ్డి, మహేష్ రెడ్డి, శేఖర్ గౌడ్, వినోద్, గద్దర్, జగదీష్, చాణక్య, నవీన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రేరణ 'స్ఫూర్తి'

- 11 మండల కేంద్రాల్లో విఫలమైన విద్యార్థులకు అవగాహన



**వరంగల్ ప్రతినిధి, మే 24(జనంసాక్షి):** ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో విఫలమైన విద్యార్థులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల్లో ప్రోత్సాహం, ప్రేరణ కల్పించడానికి ప్రత్యేకంగా స్ఫూర్తి కార్యక్రమాన్ని రూపొందించారు. శనివారం వరంగల్ జిల్లాలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ విద్యాసంస్థల్లో పదవ తరగతి పరీక్ష రాసి ఫెయిల్ అయిన 649 మంది విద్యార్థులకు శనివారం జిల్లావ్యాప్తంగా దుగ్గొండి, చెన్నారావుపేట, ఖానాపూర్, నల్లబెల్లి, నెక్కొండ మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయాల్లో మండల ప్రత్యేక అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల సహకారంతో విద్యార్థులకు అధికారులు, నిపుణుల చేత ప్రత్యేకంగా ప్రేరణ, అవగాహన తరగతులు నిర్వహించారు. పదో తరగతిలో విఫలమైన పిల్లలు నిరుత్సాహపడకూడదని, విఫలం విజయానికి తొలిమెట్టు అని, వైఫల్యం అనేది మనల్ని మరింత మెరుగుపరుచుకోవడానికి ఒక అవకాశమని, ఇది కేవలం ఒక పరీక్ష మాత్రమే అని, భవిష్యత్తును నిర్ణయించదని, విద్యార్థుల తల్లిదండ్రులు స్నేహితుల సహకారంతో మళ్లీ పరీక్షలు రాసి ఉత్తీర్ణం కావాలన్నారు. జీవితం అంటే కేవలం మార్కులే కాదని, అసలు అవి దేనికి ప్రామాణికమే కాదని, ఫెయిల్ అయినంత మాత్రాన ఓడిపోయినట్లు కాదని, మేధావులు క్రీడాకారుల వ్యాపారులు పరీక్షల్లో తప్పిన వారే అని, విఫలానికి కారణాలు తెలుసుకొని ఓడిపోయిన ప్రతిసారి కసితో చదివి విజయం సాధించాలని విద్యా నిపుణులు, అధికారుల ద్వారా విద్యార్థులకు ప్రేరణ కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో 11 మండలాల మండల ప్రత్యేక అధికారులు డిఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా ఎస్సి అధికారి భాగ్యలక్ష్మి, దుగ్గొండి ఎంపీడీవో అరుంధతి ఎంపీఓ, మోడెం శ్రీధర్ గౌడ్ విద్య అధికారి, మండల విద్య శాఖ ఆధికారులు, ప్రాధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దులు దాటుతున్న సన్నబియ్యం

- ఆదాయ వనరుగా రూపాయి కిలో పథకం
- విషయం తెలిసినా పట్టించుకోని అధికారగణం

**నిజామాబాద్, మే 24 (జనంసాక్షి) :** బియ్యం పథకంపై ఆజమాయిషీ లేకపోవడం వల్ల చౌక బియ్యాన్ని తినడానికి బదులు అమ్ముకోవడానకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవు తున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. పాలకుల దూరాలోచన లేని కారణంగా ఈ బియ్యం కేవలం వ్యాపార దృక్పథంతో సాగుతున్నాయి. సన్నబియ్యం రూపాయికే వస్తాయా అన్నది ఆలోచించడం లేదు. రాయితీ బియ్యం అక్రమ రవాణాను కొందరు వృత్తిగా మార్చుకున్నారు. తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తాన్ని రైతుల కు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. ఎపి విడిపోయిన తరవాత కూడా ఇంకా ఈ పథకాన్ని అమలు చేస్తున్న తీరు కారణంగా

అవినీతి పెరిగి పోతోంది. వేలకోట్లు ఈ పథకం కోసం ఖర్చవుతున్నా మళ్లీ సమీక్ష చేయలేక పోతున్నారు. ఎక్కడ ఓట్లు పోతాయో అన్న అభయం వెన్నాడుతున్నట్లుగా ఉంది. రేషన్ కార్డులు తగ్గించడమంటే పేదవారికి బియ్యం దక్కకుండా అడ్డుకోవడం కాదు. రేషన్ బియ్యం తినే ప్రతిఒక్కరికీ బియ్యం అందిస్తాం అంటూ ప్రజలు కట్టే పన్నులకు పాతరేస్తున్నారు. చౌకధరలకు తీసుకుని బయట అమ్ముకునే వారిని గుర్తించి తొలగించడం లేదు. కార్డులు తగ్గించకున్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం.

# అన్ని వృత్తులలో కల్లా ఉపాధ్యాయ వృత్తి మిన్న

- **వృత్యంతర శిక్షణలో పాల్గొని దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే జారే**



చండ్రుగొండ, మే 24 (జనం సాక్షి) : ఉపాధ్యాయులు తమ బోధనలో కొత్త వరవడి సృష్టించి మెలుకువలతో విద్యార్థులను తీర్చిదిద్దటంలో ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా ఉండాలని ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం చండ్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వృత్యంతర కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలంటే ఆరోగ్యంగా ఉండాలని ఆ దిశగా ఉపాధ్యాయులు నిరంతరం వారిని ఒక కంట కనిపెడుతూ తల్లిదండ్రులకు తగు సూచనలు చేయాలన్నారు. ఆటపాటలతో పాటు చదువుపై శ్రద్ధ చూపే విధంగా పాఠశాల ఆవరణ, తరగతి గదుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పన ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విద్యా వైద్యం ఈ రెండు పేద ప్రజలకు అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అనంతరం అయ్యన్న పాలెం రైతు వేదికలో జరిగిన జీలుగు విత్తనాలు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు. రైతులు పంట మార్పిడి చేయటం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. పేదల పాలిట వరంగా సీఎం ఆర్ ఎఫ్ పథకం పకడ్బందీగా రాష్ట్రంలో అమలు చేస్తూ ముందుకు సాగుతుందని దానిలో భాగంగా అశ్వరావుపేట నియోజకవర్గం లో సుమారు 21 లక్షల రూపాయలు 60 మంది లబ్ధిదారులకు గాను చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చండ్రుగొండ లో 20 మంది లబ్ధిదారులకు ఐదు లక్షల 43 వేల 500 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా రంజక పాలన కొనసాగుతుందని ఇచ్చిన హామీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లు వాడుకునే వారికి ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రూ 500 కే గ్యాస్ సిలిండర్లు, పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ తో పాటు రైతుల కష్టాలు తొలగే విధంగా ధరణిని మార్పులు చేర్పులు చేసి జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూభారతిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్న పోడుదారులకు గిరి సౌర వికాస్ పథకం, రాజీవ్ యువ వికాస్ పథకంతో యువతకు వెన్నుదన్నుగా ఉండేందుకు 50 వేల నుంచి నాలుగు లక్షల వరకు రుణాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇందిర మిల్లు మంజూరు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్ నల్లమోతు వెంకటరమణ తుమ్మలపల్లి సురేష్ బొర్రా సురేష్ చెవుల చంద్రరావు పొన్నెబోయిన బిక్షమయ్య సారెపల్లి శేఖర్ సుంద్రు విజయ్ కిరణ్ రెడ్డి భోగినబోయిన కోటేశ్వరరావు నరసింహారావు సయ్యద్ రఫుల్ బుంగ శ్రీను అన్వర్ రాందాస్ బాబులాల్ పుల్లయ్య రెడ్డి పోగు సురేష్ అధికారులు తహసీల్దార్ సంధ్యారాణి ఎంఈఓ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 28న హైదరాబాద్‌లో చాకలి ఎస్సీ సాధన సమితి 8వ వార్షికోత్సవం



రఘునాథపాలెం, మే 24 (జనం సాక్షి) : చాకలి కులస్తులను ఎస్సీ జాబితా లో చేర్చాలనే డిమాండ్ తో ఈ నెల 28 న హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన్ కేంద్రం లో మహా సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీ లక్ష్మి, జిల్లా అధ్యక్షుడు దుంపటి నగేష్ లు పేర్కొన్నారు. చాకలి ఎస్సీ సాధన సమితి 8 వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సభ జరుపుతున్నట్లు తెలిపారు. శనివారం ఖమ్మం కేంద్రం లో పాటు పలు మండల కేంద్రాల్లో మహాసభల పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సస్సందర్భంగా వారు మాట్లాడుతూ 18 రాష్ట్రాలతో పాటు 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో చాకలి ఎస్సీ జాబితా లో ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అసెంబ్లీ లో తీర్మానం చేసి పార్లమెంట్ కి పంపాలని డిమాండ్ చేశారు. చాకలి కులం విద్యా వైద్య సామాజిక రంగాల్లో వెనక బాటుతో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పగిళ్ల కృష్ణవేణి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎడవల్లి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు వల్లంకొండ కొండలు, జిల్లా సహాయ కార్యదర్శి మిట్టపల్లి శంకర్, జిల్లా నాయకులు కొండపర్తి రామారావు, పాలకేటి వీరాస్వామి, పాలకేటి పాపులు, మాచర్ల వెంకటేశ్వర్లు, సట్టు భద్రయ్య, సట్టు సురేష్, వాడేపూడి వీరబాబు, సీతారాములు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల కుటుంబాల జీవన ప్రగతి రాజీవ్ యువ వికాస పథకం

- **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



భువనగిరి కలెక్టరేట్, మే 24 (జనం సాక్షి) : నిరుద్యోగుల కుటుంబాల జీవన ప్రగతి రాజీవ్ యువ వికాసం పథకం అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ హనుమంతరావు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకంతో నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం కు కృషి చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం నిరుద్యోగుల ఆర్థిక ప్రగతిని పెంపొందించే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలన్నారు. ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ ఈ బి సి నిరుద్యోగుల కుటుంబాల జీవన ప్రగతి రాజీవ్ విధంగా రాజీవ్ యువ వికాస పథకం క్రింద యూనిట్లను నెలకొల్పుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. అన్ని కుటుంబాలకు సమన్యాయం జరిగే విధంగా పారదర్శకతతో చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు యూనిట్ల ఎంపిక విధానం అవగాహనతో జరగాలన్నారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాస పథకం నిలవాలని, సాధికారిత సాధించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి డిఆర్ డిఏ పిడి నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్యాంసుందర్, బీసీ సంక్షేమ అధికారి యాదయ్య పాల్గొన్నారు.

# జూన్ చివరి నాటికి హౌజింగ్ కాలనీ ఇండ్లు పూర్తి చేయాలి

- **అడ్వాన్స్ టెక్నాలజీ ద్వారా నిరుద్యోగులకి ఉపాధి కల్పన**
- **రోడ్ల పనులు నాణ్యతగా ఉండాలి**
- **హుజూర్ నగర్ పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హుజూర్‌నగర్, మే 24 (జనంసాక్షి) : హుజూర్ నగర్ నియోజకవర్గం అభివృద్ధి ఒక యజ్ఞంలా తలపెట్టి రాజకీయాలకి తావు లేకుండా అందరి సహకారంతో ముందుకు వెళ్తున్నామని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని రామ స్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2160 ఇండ్లను, 30 కోట్లతో నిర్మించే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, 6.0కోట్ల రూపాయలతో నిర్మించే ఐ టి ఐ కాలేజీ, 8 కోట్ల రూపాయలతో నిర్మించే ఆర్ %c% బి గెస్ట్ హౌజ్, ఔటర్ రింగ్ రోడ్డు, 4.5 కోట్లతో నిర్మించే డిగ్రీ కాలేజీ, 8. 5 కోట్లతో నిర్మించే జూనియర్ కాలేజీ నిర్మాణ పనులను రాష్ట్ర నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామస్వామి గుట్ట వద్ద ఇండ్లు అన్ని జూన్ చివరి నాటికి పూర్తి చేసి జులై –ఆగస్టులో ఇండ్లు లేని నిరుపేదలని గుర్తించి ఇండ్లు పంపిణీ చేయాలని, పనులు అన్ని వేగవంతంగా నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిరుద్యోగులకి ఉపాధి కల్పనకి గొప్ప అవకాశం అని ఏ టి సి ద్వారా అడ్వాన్స్ స్కిల్స్, రోబో టెక్నాలజీ, ఎలక్ట్రికల్ వెహికల్ రిపేర్, ప్రాసెసింగ్ టెక్నాలజీ లాంటి వాటిపై 170 మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించటం జరుగుతుందని జూన్ నాటికి నిర్మాణం పూర్తి చేసి జులై నుంచి తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి, డియంఎఫ్‌టి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్లు అన్ని వేగవంతంగా నాణ్యతగా నిర్మించాలని, రోడ్డు వేసేటప్పుడు ఎలక్ట్రిక్ పోల్స్ అడ్డు ఉంటే వాటిని తొలగించాలని అధికారులకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ సూర్యనారాయణ, ఆర్ అండ్ బీఎస్ ఈ సీతారామయ్య, పి ఆర్ ఈ ఈ వెంకటయ్య, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, హౌజింగ్ ఎస్ ఈ వెంకటదాస్ రెడ్డి, డి ఈ జగన్, ఏ ఈ సాయిరాం రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వర్షాకాలం లోపు పూర్తి చేయాలి

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



ఖమ్మం/రఘునాథపాలెం, మే 24 (జనంసాక్షి) : చేపట్టిన అభివృద్ధి పనులను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మంత్రి, రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామంలో ఎస్సి కాలనీ నందు సి.ఆర్.ఆర్. (ఎస్.సి.పి.) నిధులు 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత సిసిరోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు, ఎన్.డి.ఆర్. నిధులు 99 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కోయచలక కమలాపురం రహదారిపై చేపట్టిన మైనర్ బ్రిడ్జి పున: నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ కోటపాడు గ్రామంలో చేపట్టిన అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్, మైనర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వర్షాకాలం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఉంటున్న పేద ప్రజలకు మొదటి దశలో ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రానికి కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం




సూర్యాపేట ప్రతినిధి, మే 24 (జనంసాక్షి) : మాతృత్వం అనేది ఒక వరమని, ఆడ మగ అనే తేడా లేదని, తల్లిదండ్రులు అపోహలు వీడాలని జిల్లా ఎస్పీ కె.నరసింహా శనివారం ఒక ప్రకటనలో అన్నారు. స్త్రీ గర్భంలో ఉన్న శిశువు ఆడ లేదా మగ అనేది తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడ శిశువు భ్రూణ హత్యలకు పాల్పడం అత్యంత నేరమని అన్నారు. ఇలాంటి వాటికి పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందిస్తూ ప్రాణ రక్షకులుగా ఉండాల్సిన ఆర్‌ఎంపీలు వారి బాధ్యత మరవద్దన్నారు. లింగ నిర్ధారణ ను ప్రోత్సహించవద్దని, ఆడ శిశు భ్రూణ హత్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసి నిఘా పెంచామని, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు, హాస్పటల్ వైద్యులు ఇలాంటివి చేయవద్దని కోరారు. ఇలాంటి పరీక్షలు నిర్వహించిన, ప్రోత్సహించిన, సహకరించిన అలాంటి వారి అందరిపై చర్యలు ఉంటాయన్నారు. ప్రీ-నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టం, నూతన చట్టాల ప్రకారం అత్యంత కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. 10 సంవత్సరాల పైబడి కఠిన జైలు శిక్ష, జరిమానా ఉంటుందని తెలిపారు. ఇలాంటి వాటిపై స్థానిక పోలీసులకు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమాలు చేయాలి

- **మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**



మిర్యాలగూడ, మే 24 (జనం సాక్షి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. శనివారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేయాలన్నారు. నిత్యం ప్రజలను అంటిపెట్టుకొని ఉండాలన్నారు. వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, గృహలక్ష్మి కింద మహిళలకు ఆర్థిక సహాయం, గ్యాస్ పై 500 రూపాయలు సబ్సిడీ వెంటనే అమలు చేయాలన్నారు. దీని కోసం ఉద్యమాలు చేయాలని పిలుపు నిచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పుడు తండ్రి, కూతుర్ల లేఖ హాట్ టాపిక్ గా మారిందని వారి మధ్యలో ఉన్న సమస్య ప్రజలకు అవసరం లేదన్నారు. ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమంపై శ్రద్ధ పెట్టకుండా అందాల పోటీల పేరిట కోట్లు ఖర్చు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వన్ టౌన్ కార్యదర్శి డా.మల్లు గౌతమ్ రెడ్డి, టూ టౌన్ కార్యదర్శి బావాండ్ల పాండు, సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర, సత్యనారాయణ రావు, తిరుపతి రామ్మూర్తి, దేశిరాం నాయక్, కోడిరెక్క మల్లయ్య, అరుణ, పాపి రెడ్డి, గోవర్ధనా, కరిమున్నిసా బేగం, రామచంద్ర, పల్లా భిక్షం, ఏసు, కరీం, వజీర్, రామారావు, శివ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళల ఆందోళన

- **కట్టిన డబ్బు కొందరు స్వాహాచేశారంటూ నిరసన**

బూర్గంపహాడ్, మే 24 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళలు ఆందోళన చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలో 40 గ్రూపులకు పైనే డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణానికి చెల్లించిన వాయిదాలకు రూ.60వేలు అదనంగా చెల్లిస్తే చెల్లించిన నగదు ఖాతాల్లో జమచేయకుండా మధ్యవర్తులుగా ఉన్న కొందరు డ్వాక్రా లీడర్లు స్వాహా చేశారని ఆరోపిస్తూ కార్యాలయం ఎదుట డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కూలీ నాలీ చేసుకుని డ్వాక్రా సంఘంలో సభ్యులుగా ఉంటూ డబ్బును పొదుపు చేసుకుంటుంటే డ్వాక్రా లీడర్లు కొందరు చెల్లించిన డబ్బును ఖాతాల్లో వేయకుండా స్వాహా చేస్తున్నారని తమ డబ్బు జమచేసేలా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఐకేపీ ఏపీఎం ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు ఐకేపీ సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని, బుక్ కీపర్లు వద్దంటూ ఆందోళనలో నినాదాలు చేశారు. డ్వాక్రా మహిళలు చెల్లించిన సొమ్ములో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు డబ్బు స్వాహా చేసినట్లు రుజువైతే రికవరీ చేస్తామని, డ్వాక్రా మహిళలకు న్యాయం చేస్తామని ఐకేపీ ఏపీఎం నాగార్జున హామీ ఇవ్వడంతో డ్వాక్రా మహిళలు ఆందోళన విరమించారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ వద్దిరాజు



ఖమ్మం టౌన్, మే 24 (జనం సాక్షి) : జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనారోగ్య బాధితులకు తన సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. బుర్హాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం రూ. 2.50 లక్షల చెక్కులను ఎంపీ రవిచంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కారణాల చేత అనారోగ్యం పాలైన బాధితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ తోట వీరభద్రం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిబోయిన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లిలో భారీగా నిషేధిత గంజాయిని పట్టుకున్న జిల్లా పోలీసులు




టేకులపల్లి, మే 24 (జనంసాక్షి) : కోట్ల రూపాయల విలువ కలిగిన నిషేధిత గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని విశ్వసనీయ సమాచారం మేరకు టేకులపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా టేకులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలో గల ఏ.సి.ఏ సులానగర్ మినిస్ట్రీ చర్చ్ వద్ద శనివారం ఉదయం నిర్వహించిన వాహన తనిఖీలలో ఎస్కార్ట్ గా వస్తున్న కారు నెంబర్ హెచ్ ఆర్ 05 బి కె 6032, హెచ్ ఆర్ 63ఇ 7315 అను నంబరు గల ఐచర్ వ్యాన్ ను ఆపి తనిఖీ చేయగా 698 కిలోల ప్రభుత్వ నిషేధిత గంజాయిని గుర్తించారు. సుమారుగా 3,49,00,000/- రూపాయల విలువ గల ఇట్టి గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకోవడమైనది. ఐచర్ వ్యానులో ఉన్న ముగ్గురు వ్యక్తులను, కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. ఇట్టి నిషేధిత గంజాయిని అమ్మిన వ్యక్తులపైన, కొనుగోలు చేసిన వ్యక్తులు, రవాణా చేస్తున్న వ్యక్తులందరిపై కేసు నమోదు చేసి అట్టి రవాణాకు ఉపయోగించిన ఐచర్, కారు ను, 5 మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేసినట్లు టేకులపల్లి సిఐ తాటిపాముల సురేష్, ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు అటవీ ప్రాంతం నుండి హర్యానా రాష్ట్రం, కురుక్షేత్ర ప్రాంతానికి అక్రమంగా ఇట్టి గంజాయిని రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలిందని, పట్టుబడిన నిందితులందరూ కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్ కుమార్ ఆదేశాలతో పార్సిల్ సర్వీస్ మాటున ఇట్టి గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన ఆరుగురు వ్యక్తుల వివరాలను వెల్లడించారు. ఏ1). సందీప్ కుమార్ ఏ రింకు తండ్రి బల్బీర్ సింగ్, కశ్యప్, డ్రైవర్ జెగ్గకేర, కురుక్షేత్ర జిల్లా, హర్యానా రాష్ట్రం. ఏ2). లక్విందర్ తండ్రి పప్పు, చిర్వర్ (హరిజన్), ఐచర్ క్లీనర్, సిద్ది గాడి, కౌతాన్ జిల్లా, హర్యానా రాష్ట్రం. ఏ3). అమర్ నాథ్ కుమార్ ఏ అమర్ నాథ్ తండ్రి సంతోష్ సింగ్, కురుక్షేత్ర జిల్లా, హర్యానా రాష్ట్రం. ఏ 4). పవన్ కుమార్ తండ్రి అశోక్ కుమార్, కార్ డ్రైవర్, పానిపట్ జిల్లా, హర్యానా రాష్ట్రం. ఏ 5). రాజ్ కుమార్ ఏ విహార్ తండ్రి దిల్ రామ్, జోగ్నేకర, కురుక్షేత్ర జిల్లా, హర్యానా రాష్ట్రం. ఏ 6). కృషన్ కుమార్ ఏ కాలే తండ్రి జిలే సింగ్, కార్ డ్రైవర్ గోహన, సోనిపట్ జిల్లా, హర్యానా రాష్ట్రం. అమ్మిన వ్యక్తి వివరాలు:- ఏ 7) హరి ఖారా, ఏ 8) ప్రిన్స్ కుమార్, హర్యానా రాష్ట్రం. పట్టుబడిన ఆరుగురు వ్యక్తులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టునకు తరలించడం జరిగినదని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న టేకులపల్లి సిఐ టి.సురేష్, ఎస్సై ఏ.రాజేందర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు.




# అశోక్ లేలాండ్ హై జంప్

**• పెరిగన కంపెనీ షేర్లు**




ముంబై: వాణిజ్య వాహన రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ గతేడాది (2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతంపైగా జంప్‌చేసి రూ. 1,246 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 934 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,542 కోట్ల నుంచి రూ. 14,696 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 12,037 కోట్ల నుంచి రూ. 13,097 కోట్లకు పెరిగాయి. ఈ నెల(మే) 22న చెల్లించిన(రెండో) రూ. 4.25 డివిడెండ్‌ను తుది డివిడెండ్‌గా ప్రకటించింది. మరోవైపు వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది. దీంతో ప్రతీ షేరుకి మరో షేరుని ఉచితంగా జారీ చేయనుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కంపెనీ నికర లాభం రూ. 2,696 కోట్ల నుంచి రూ. 3,383 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 45,703 కోట్ల నుంచి రూ. 48,535 కోట్లకు ఎగసింది. వెరసి క్యూ4తోపాటు పూర్తి ఏడాదిలో రికార్డ్ ఆదాయం సాధించినట్లు కంపెనీ చైర్మన్ ధీరజ్ హిందుజా పేర్కొన్నారు. గతేడాది మొత్తం వాణిజ్య వాహన విక్రయాలు 1,95,093 యూనిట్లను తాకాయి. కంపెనీ ఆర్థికంగా పటిష్టస్థితిలో ఉన్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో షేను అగర్వాల్ పేర్కొన్నారు. 2025 మార్చికల్లా రూ. 4,242 కోట్ల నగదు నిల్వలున్నట్లు వెల్లడించారు. ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.4 శాతం బలపడి రూ. 240 వద్ద ముగిసింది.

**కొత్త షేర్లు..**

స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, పైపుల తయారీ కంపెనీ స్కోడా ట్యూబ్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 130-140 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 27న షేర్లను విక్రయించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 220 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 220 కోట్లు అందుకోనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 100 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఇష్యూ నిధులను సీమ్‌లెస్, వెల్డెడ్ ట్యూబ్స్, పైప్స్ ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు వెచ్చించనుంది. అంతేకాకుండా వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు నిధులను కేటాయించనుంది. ధరల శ్రేణి ప్రకారం కంపెనీ విలువను రూ. 840 కోట్లుగా బ్రోకరేజీలు అంచనా వేశాయి. ఈపీసీ, ఇండస్ట్రియల్ కంపెనీలకు ఉత్పత్తులను సరఫరా చేస్తుంది. ఆయిల్ అండ్ గ్యాస్, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, విద్యుత్ తదితర రంగాలలో వీటిని వినియోగిస్తారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ బ్లూ వాటర్ లాజిస్టిక్స్ ప్రతిపాదిత ఐపీవో మే 27న ప్రారంభమై 29న ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు మే 26 బిడ్డింగ్ తేదీగా ఉంటుంది. పబ్లిక్ ఇష్యూ కోసం ఒక్కో షేరు ధర శ్రేణి 132-135గా నిర్ణయించారు.

# బంగారం ధరల్లో భారీ ఒడిదొడుకులు



దేశంలో కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. క్రితం రోజున మోస్తరుగా తగ్గిన పసిడి ధరలు నేడు (మే 24) అంతకుమించి దూసుకుపోయాయి. దీంతో బంగారం తగ్గిందేలే అనుకుంటే మళ్లీ పెరిగిందంటూ కొనుగోలుదారులకు నిట్టూర్పు తప్పలేదు. మే 24 నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి..

**ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాల్లో..**

24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,080
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,900

హైదరాబాద్, విజయవాడ సహా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు,జీఎస్టీ కారణంగా కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.550, రూ.500 పెరిగాయి.

**చెన్నైలో..:**24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,080 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,900 చెన్నైలో బంగారం ధరలు ఇతర గరాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోర్ట్ సౌకర్యాలు, డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. నిన్న టితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.550, రూ.500 పెరిగాయి.

**ఢిల్లీలో..:** 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,230 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,050 ఢిల్లీలో బంగారం ధరలు రవాణా ఖర్చులు, స్థానిక ట్యాక్స్‌ల కారణంగా కొంత ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ నగరంలో బంగారం కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఆభరణాలపై ఎక్కువ ఆసక్తి చూపుతు న్నారు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.550, రూ.500 పెరిగాయి.

**ముంబైలో..**

24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,080
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,900

ముంబైలో బంగారం ధరలు స్థానిక డిమాండ్, జ్యువెలరీ డిజైన్‌లపై ఆధారపడి మారుతూ ఉంటాయి. ఈ నగరంలో బంగారం కొనుగోలు చేసే ముందు పలు జ్యువెలరీ షాపుల ధరలను సరిపోల్చడం మంచిది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.550, రూ.500 పెరిగాయి.

**బెంగళూరులో..**

24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,080
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,900

బెంగళూరులో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి, కానీ స్థానిక ఆర్థిక పరిస్థితులు, ఫెస్టివల్ సీజన్ డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేయవచ్చు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.550, రూ.500 పెరిగాయి.

**వెండి ధరలు..**


దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు స్వల్ప తగ్గుదల నమోదైంది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో నిన్నటితో పోలిస్తే ఈరోజు వెండి కేజీకి రూ.100 తగ్గి రూ.1,10,900 వద్దకు వచ్చింది. అలాగే ఢిల్లీ ప్రాంతంలోనూ రూ.100 క్షీణించి రూ. 99,900 వద్ద కొనసాగుతోంది.

# రేంజ్ రోవర్ హిమాలయన్

**సరికొత్త స్పెషల్ ఎడిషన్**

రేంజ్ రోవర్ రణథంబోర్ స్పెషల్ ఎడిషన్ మంచి ఆదరణ పొందటంతో.. కంపెనీ ఇప్పుడు మరో స్పెషల్ ఎడిషన్‌ను 'హిమాలయన్' పేరుతో లాంచ్ చేయడానికి సిద్ధమైంది. ఇది లేత పెయింట్ షేడ్స్ పొందనున్నట్లు సమాచారం. రేంజ్ రోవర్ హిమాలయన్ ఎడిషన్ గురించి కంపెనీ చాలా వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. కానీ ఇది ఇప్పుడున్న అన్ని ఎడిషన్స్ కంటే కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుందని తెలుస్తోంది. అయితే కంపెనీ ఈ స్పెషల్ ఎడిషన్‌ను ఎన్ని యూనిట్లకు పరిమితం చేసింది. ఎప్పటి నుంచి విక్రయిస్తుందనే విషయాలను కూడా వెల్లడించలేదు. స్పెషల్ ఎడిషన్లకు డిమాండ్ పెరగడంతో.. హిమాలయన్ ఎడిషన్స్ లాంచ్ చేయడానికి సిద్ధమైనట్లు.. జేఎల్ఆర్ గ్లోబల్ మేనేజింగ్ డైరెక్టర్ మార్టిన్ లింపెర్ట్ పేర్కొన్నారు. కస్టమర్లు మరిన్ని స్పెషల్ ఎడిషన్స్ కోరుకుంటున్నారు. కాబట్టి మేము మరో మోడల్ ప్లాన్ చేస్తున్నామని ఆయన అన్నారు. గతంతో పోలిస్తే.. రేంజ్ రోవర్ కార్లు మంచి అమ్మకాలను పొందుతున్నాయి. గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 40 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో లగ్జరీ విభాగంలో మూడో స్థానానికి చేరింది. రేంజ్ రోవర్ రేంజ్ రోవర్ స్పోర్ట్ యొక్క స్థానిక అసెంబ్లీ మోడళ్ల అమ్మకాలు 2.5 రెట్లు పెరిగాయి.






# ఎల్ఐసీ గిన్నిస్ రికార్డ్




ప్రభుత్వరంగ బీమా సంస్థ 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' కేవలం 24 గంటల్లో అత్యధిక జీవిత బీమా పాలసీలు విక్రయించి.. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. జనవరి 20న భారతదేశం అంతటా 4,52,839 మంది ఎల్ఐసీ ఏజెంట్లు 5,88,107 జీవిత బీమా పాలసీలను విజయవంతంగా పూర్తి చేశారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలు జారీ చేయడం ఇదే మొదటిసారి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించింది. 24 గంటల్లో అత్యధిక జీవిత బీమా పాలసీలు అమ్ముడయ్యాయని ఎల్ఐసీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించించింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ టైటిల్ అనేది.. మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, అవిశ్రాంత పనికి నిదర్శనం. కస్టమర్లు, వారి కుటుంబాలకు కీలకమైన ఆర్థిక రక్షణను అందించాలనే మా లక్ష్యం పట్ల మా నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఎల్ఐసీ పేర్కొంది. జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే' నాడు ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తూ.. ఎల్ఐసీ ఎండీ సీఈఓ సిద్ధార్థ మొహంతి చేపట్టిన చొరవకు నిదర్శనమే ఈ రికార్డు అని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సీఈఓ సిద్ధార్థ మొహంతి మాట్లాడుతూ.. 'మ్యాడ్ మిలియన్ డే'ని చారిత్రాత్మకంగా మార్చినందుకు కస్టమర్లు, ఏజెంట్లు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

## యూనియన్ బ్యాంక్‌తోపాటు మరో సంస్థపై

# ఆర్‌బీఐ జరిమానా

Union Bank of India

బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో విఫలమై నందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్ (లెండ్‌బాక్స్)పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జరిమానా విధించింది. నిబంధనల ప్రకారం నడుచుకోని సంస్థలపై కఠిన చర్యలుంటాయని ఆర్‌బీఐ పేర్కొంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై జరిమానా బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 నిబంధనలు, పూచీకత్తు లేని వ్యవసాయ రుణాలపై ఆర్‌బీఐ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.63.6 లక్షల జరిమానా విధించింది. నిధుల బదిలీలో జాప్యం, పూచీకత్తు లేని రుణ విధానాల్లో ఉల్లంఘనలు వెలుగులోకి రావడంతో ఈ జరిమానా విధించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ముఖ్యంగా వ్యవసాయం వంటి ప్రత్యేక రక్షణ అవసరమయ్యే రంగాల్లో ఆర్థిక సంస్థలు నిర్దేశిత రుణ నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూడాలని ఆర్‌బీఐ నొక్కి చెప్పింది. ఆర్‌బీఐ పీర్-టు-పీర్ (పీ2పీ) లెండింగ్ ప్లాట్‌ఫామ్ డైరెక్షన్స్-2017ను పాటించనందుకు లెండ్‌బాక్స్ బ్రాండ్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్‌పై రూ.40 లక్షలు జరిమానా విధించింది. దేశ డిజిటల్ లెండింగ్ ఎకోసిస్టమ్‌లో గణనీయమైన వృద్ధిని చూసిన పీ2పీ లెండింగ్ కార్యకలాపాలకు సంబంధించిన లోపాలను సెంట్రల్ బ్యాంక్ గుర్తించింది. ఫిన్‌టెక్ కంపెనీలు పారదర్శకత పాటించాలని, వినియోగదారులు, రుణదాతలను రక్షించడానికి రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని గుర్తు చేసింది.

# యాపిల్‌కు సుంకాల భయం లేదు

## 27శాతం విధించినా మరేం ఫర్వాలేదు:జీటీఆర్ఐ నివేదిక




భారత్‌లో తయారయ్యే ఐఫోన్లపై అమెరికా 25 శాతం సుంకం విధించినా ఆ దేశంలో తయారీతో పోలిస్తే మొత్తం ఉత్పత్తి వ్యయం ఇండియాలో చాలా తక్కువగా ఉంటుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక తెలిపింది. యాపిల్ ఉత్పత్తులను ఇండియాలో తయారు చేయాలని నిర్ణయించుకుంటే ఐఫోన్లపై 25 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో ఈ మేరకు జీటీఆర్ఐ వివరాలు వెల్లడించింది. అమెరికాతో పోలిస్తే భారత్‌లో ఐఫోన్ తయారీ వ్యయాలు గణనీయంగా తక్కువగా ఉన్నాయని, ప్రధానంగా కార్మికులకు అయ్యే ఖర్చుల వ్యత్యాసాలు భారీగా ఉండడమే ఇందుకు కారణమని నివేదిక పేర్కొంది. భారతదేశంలో ఐఫోన్లను అసెంబ్లింగ్ చేసే కార్మికులకు నెలకు సుమారు 230 అమెరికన్ డాలర్లు(సుమారు రూ.20,000) ఖర్చు అవుతుంది. అయితే కాలిఫోర్నియా వంటి యూఎస్ రాష్ట్రాల్లో కార్మికుల ఖర్చులు నెలకు 2,900 అమెరికన్ డాలర్లు(రూ.2,44,760)కు పెరుగుతాయి. భారత్‌తో పోలిస్తే ఇది 13 రెట్లు అధికంగా ఉండడం గమనార్హం. ప్రస్తుతం సుమారు 1,000 డాలర్ల(రూ.85,000)గా ఉన్న ఐఫోన్ తయారీలో యాపిల్ తన బ్రాండ్, సాఫ్ట్‌వేర్ ద్వారా అధికంగా 450 డాలర్ల వాటాను సమకూరుస్తుంది. మిగతాది ఇతర దేశాల నుంచి సమీకరిస్తున్న ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్‌కు వెచ్చిస్తుంది. యూఎస్ కాంపోనెంట్ మేకర్స్ (క్వాల్‌కామ్, బ్రాడ్‌కామ్): 80 డాలర్లు తైవాన్ (చిప్ తయారీ): 150 డాలర్లు దక్షిణ కొరియా (ఓఎల్ఈడీ స్క్రీన్లు, మెమొరీ చిప్స్): 90 డాలర్లు జపాన్ (కెమెరా): 85 డాలర్లు జర్మనీ, వియత్నాం, మలేషియా (ఇతర భాగాలు): 45 డాలర్లు చైనా, ఇండియా (అసెంబ్లింగ్): 30 డాలర్లు ఐఫోన్ అసెంబ్లింగ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న భారతదేశం, చైనా మొత్తం రిటైల్ ధరలో 3% కంటే తక్కువే సంపాదిస్తుండడం గమనార్హం. భారత్‌లో ఐఫోన్లు తయారు చేస్తే అమెరికా 25 శాతం టారిఫ్ విధించిన ప్పటికీ దేశంలో ఐఫోన్ల తయారీ ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని నివేదిక తెలుపుతుంది. ప్రభుత్వం నుంచి యాపిల్ భారత్‌లో ఐఫోన్ తయారీపై ప్రొడక్షన్-లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) ప్రయోజనాన్ని సైతం పొందుతుంది.

### శాంసంగ్‌కూ ప్రత్యేక మినహాయింపులు ఉండవు

**• యాపిల్ తరహాలోనే సుంకాలు: ట్రంప్ వార్నింగ్**

అమెరికాలో ఐఫోన్లను తయారు చేయకపోతే యాపిల్ కంపెనీపై 25 శాతం సుంకాలను విధిస్తామని యూఎస్ ప్రెసిడెంట్ 'డొనాల్డ్ ట్రంప్' పేర్కొన్నారు. ఇప్పుడు ఈ రూల్ శాంసంగ్ సహా ఇతర అన్ని స్మార్ట్‌ఫోన్ సంస్థలకు వర్తిస్తుందని ట్రంప్ వైట్ హౌస్ వద్ద మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. అమెరికా విధించే సుంకాల ప్రభావం ఉండకూడదు అనుకుంటే.. స్మార్ట్‌ఫోన్ తయారీదారులు ఇక్కడే (అమెరికాలో) ప్లాంట్స్ ఏర్పాటు చేసుకోవాలి. అలా కాకుండా భారతదేశంలో లేదా ఇతర ఏ దేశంలోనో తయారు చేసిన ఫోన్లను అమెరికాకు దిగుమతి చేసుకుంటే.. 25 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. సౌత్ కొరియా దిగ్గజమైన 'శాంసంగ్' అమెరికా మార్కెట్లో అత్యధిక అమ్మకాలు చేపడుతున్న రెండో మొబైల్ కంపెనీగా ఉంది. గ్లోబల్ మార్కెట్లో ఈ సంస్థ ప్రతి సంవత్సరం 220 మిలియన్ ఫోన్స్ విక్రయిస్తోంది. ఇందులో సుమారు 60 శాతం ఫోన్స్.. వియత్నాంలో ఉత్పత్తి అవుతున్నాయి. ఇక్కడి నుంచే ప్రపంచంలోనే చాలా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇకపై ఈ విధానంతో అమెరికాకు శాంసంగ్ ఫోన్స్ తీసుకుని వస్తే.. సుంకాలు చెల్లించక తప్పదు.




# మాకొద్దీ బెంగళూరు

**• ఆఫీస్ తరలిస్తున్న టెకీ..**

దేశ ఐటీ రాజధానిగా పేరున్న బెంగళూరులో తరచూ భాష వివాదాలు రేగుతున్నాయి. ఉద్యోగం, ఉపాధి కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భిన్న భాషా నేపథ్యాలున్న వారు అక్కడికి వస్తుంటారు. ముఖ్యంగా హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలవారికి బెంగళూరులో స్థానికుల నుంచి భాషాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో బెంగళూరుకు చెందిన ఓ టెక్ ఫౌండర్ తన కంపెనీ కార్యాలయాన్ని పుణెకు తరలించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కౌశిక్ ముఖర్జీ అనే ఎంట్రప్రెన్యూర్ ఇటీవల చెలరేగిన భాష వివాదంపై సోషల్ మీడియాలో స్పందిస్తూ తన నిర్ణయాన్ని ప్రకటించారు. భాష వివాదాలతో కన్నడ మాట్లాడలేని తమ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడని, అందుకే బెంగళూరులోని తమ కంపెనీ కార్యాలయాన్ని పుణె తరలించనున్నట్లు తెలిపారు. తమ ఉద్యోగులు లేవనెత్తిన ఆందోళనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, వారి అభిప్రాయాలతో తానూ ఏకీభవిస్తున్నానని చెప్పారు. 'బెంగళూరులోని మా కార్యాలయాన్ని ఆరు నెలల్లో మూసేసి పుణెకు తరలించాలని ఈ రోజే నిర్ణయం తీసుకున్నా. భాష వివాదాలు ఇలాగే కొనసాగుతుంటే కన్నడ మాట్లాడలేని మా ఉద్యోగులు బాధితులు కావడం నాకు ఇష్టం లేదు. ఈ ఆలోచన ఉద్యోగుల ఆందోళల నుంచే వచ్చింది. వారి అభిప్రాయాలతో నేను ఏకీభవించాను' అంటూ కౌశిక్ ముఖర్జీ తన 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు. బెంగళూరులోని చందాపుర ప్రాం తంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఇటీవల మేనేజర్‌కు, కస్టమర్‌కు మధ్య భాషా వివాదం తలెత్తింది. మేనేజర్ కన్నడలో మాట్లాడేందుకు నిరాకరించడంతో తీవ్ర వాగ్వాదం చెలరేగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో కన్నడ సంఘాలు, రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేశారు. మేనేజర్ ప్రవర్తన ఆమోదయోగ్యం కాదంటూ బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వి సూర్య ఈ వీడియోను షేర్ చేయగా కౌశిక్ ముఖర్జీ దానికి స్పందిస్తూ పోస్ట్ చేశారు.

# సరుకు రవాణాలో పాక్ ఆగమాగం

భారత్-పాకిస్థాన్ యుద్ధంతో పాక్‌కు తంటాలు తప్పడం లేదు. యుద్ధ సమయంలో భారత్ తీసుకున్న నిర్ణయంతో పాక్ తీవ్రంగా ఇబ్బందులు పడుతోంది. దాంతో ఆర్థి కంగా, వాణిజ్యం పరంగా సవాళ్లు ఎదుర్కొంటోంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ నుంచి ఓడరేవుల ద్వారా వచ్చే సరుకుల రవాణాను భారతదేశం నిషే ధించింది. ఇది ఆ దేశ దిగుమతులు, ఎగుమతులను గణనీయంగా ప్రభావితం చేస్తోంది. ఈ చర్య వల్ల పాకిస్థాన్‌కు, అక్కడి నుండి ఇతర దేశాలకు వెళ్లే ప్రత్యక్ష సర్వీసులను కోర్ షిప్పింగ్ లైన్లు నిలిపివేశాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు పాక్ ఫీడర్ నౌకలపై ఆధారపడవలసి వస్తుంది. ఈ నిషేధం వల్ల ముఖ్యంగా ఐరోపాతో దాయాది దేశం వాణిజ్యం తీవ్రంగా ప్రభావితం అవుతోంది. భారతదేశంలోని ముంద్రా నౌకాశ్రయం పాక్ నుంచి యూరప్ వెళ్లే ఎగుమతులకు కీలకమైన ట్రాన్స్‌షిప్‌మెంట్ కేంద్రంగా ఉంది. కానీ పాక్ ఉగ్రవాదులు భారత పర్యాటకులను దారుణంగా హతమార్చిన నేపథ్యంలో భారత్ విజయవంతంగా ఆపరేషన్ సింధూర్‌ను అమలు చేసింది. ఈ సమయంలో పాక్ సరుకు రవాణాను నిషేధించింది. ప్రస్తుతం పాకిస్థాన్ షిప్పింగ్ కంపెనీలు కొలంబో, సలాలా, జెబెల్ అలీ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్స్ ద్వారా సరుకును రవాణా చేస్తున్నాయి. దాంతో పాక్ సంస్థలకు అదనంగా బీమా ఛార్జీలు భారంగా మారాయి. దాంతోపాటు పాకిస్థానీ అమ్మకందారులతో వ్యవహరించే వ్యాపారులను బ్యాంకు గ్యారంటీలు ఇవ్వమని కంపెనీలు ఒత్తిడి చేస్తున్నాయి. ఇది వాణిజ్య కార్యకలాపాలను మరింత క్లిష్టతరం చేస్తుంది. ఇప్పటికే కష్టాల్లో ఉన్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కీలక పరికరాలు, ముడిసరుకులు, యంత్రాల దిగుమతుల్లో జాప్యాన్ని ఎదుర్కొంటుందని మార్కెట్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ధాన్యాలు, వస్త్రాల ఎగుమతులు కూడా దెబ్బతింటాయని భావిస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల పాకిస్థాన్‌లోని వివిధ టెర్మినల్స్ వద్ద ఎగుమతి కంటైనర్ల నిల్వలు పేరుకుపోతున్నాయి. దాంతో సరుకుల రవాణా ఒకటి నుంచి మూడు రోజుల వరకు ఆలస్యం అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అధికంగా ఇంటర్నెట్ వినియోగిస్తున్న ఇండియాలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రోసస్ కంపెనీ సిద్ధంగా ఉన్నట్లు సంస్థ సీఈఓ ఫాబ్రిసియో బ్లోయిసి తెలిపారు. ఇప్పటికే భారతదేశ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లో 9 బిలియన్ డాలర్ల(సుమారు రూ.75,960 కోట్లు)ను ఇన్వెస్ట్ చేసినట్లు చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో మరింత పెట్టుబడి పెట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ముందుందని తెలిపారు.

# విస్తరణకు సై

**కంపెనీ పరిధి పెంచుకుంటున్న ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ**




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ (ఎస్‌జీఎల్‌టీఎల్) సా మర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఉత్పత్తి సామర్థ్యాల పెంపుపై వచ్చే 2-3 ఏళ్లలో రూ. 130 కోట్లు పైగా ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతం 60 టన్నుల క్రేన్, 60 మి.మీ. మందం ఫ్యాబ్రికేషన్ సామర్థ్యం ఉండగా .. 100 టన్నుల క్రేన్, 100 మి.మీ. మందం ఫ్యా బ్రికేషన్ స్థా యికి పెంచుకోనున్నట్లు సంస్థ తెలిపింది. అలాగే ప్రస్తుత మున్న 5 వెల్డింగ్ రోబోల సంఖ్యను కూడా గణనీ యంగా పెంచుకోనున్నట్లు పేర్కొంది. తద్వారా అంతర్జాతీయంగా హెవీ ఇంజినీరింగ్ విభాగంలో అవకాశాలు అందిపుచ్చుకోనున్నట్లు వివరించింది. మరోవైపు, గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 3 శాతం పెరి గి రూ. 16 కోట్లకు చేరగా, ఆదాయం రూ. 171 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో అన్ని కీలకాంశాల్లోనూ రెండంకెల స్థాయి వృద్ధి సాధించినట్లు కంపెనీ ఎండీ నాగేశ్వరరావు కందుల తెలిపారు. జీఎల్ హక్కా జపాన్, ఐపీపీ యూఎస్ఏతో భాగస్వామ్యాలు, పటిష్టమైన ఆర్డర్ బుక్, కొత్త ప్రొడక్ట్ లైన్స్‌తో ఈసారి మరింత మెరుగ్గా రాణించగలమని ధీమా వ్యక్తం చేశారు.

# ఆధార్ అప్‌డేట్ గడువు జూన్ 14 వరకే..

దేశ ప్రజలకు అత్యంత ముఖ్యమైన డాక్యుమెంట్ ఆధార్. జారీ చేసినప్పటి నుంచి వీటిని ఇంత వరకూ అప్‌డేట్ చేసుకోనివారు వెంటనే చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో ఉచితంగా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడీఏఐ)అవకాశం కల్పించింది. ఇందుకోసం గతేడాది గడువును విధించింది. ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ ప్రస్తుతానికి జూన్ 14 వరకు గడువు విధించారు. ఆ తర్వాత రూ.50 రుసుమును చెల్లించి ఆధార్ కేంద్రాల వద్ద అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ అప్‌డేట్ రెగ్యులేషన్స్, 2016 ప్రకారం.. కార్డుదారులు తమకు కార్డు జారీ చేసినప్పటి నుంచి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి వారి గుర్తింపు రుజువు (పీఓఐ), చిరునామా రుజువు (పీఓఏ) అప్‌డేట్ చేసుకోవాలి. రెగ్యులర్ అప్‌డేట్లు ఆధార్ లోని సమాచారం, ప్రస్తుత డాక్యుమెంటేషన్‌కు అనుగుణంగా ఉండేలా చూస్తాయి. ఆధార్‌ను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేసుకోకపోతే ప్రభుత్వ సబ్సిడీలను పొందేటప్పుడు, బ్యాంకు ఖాతాలను తెరిచేటప్పుడు లేదా ఇతర అవసరమైన కేవైసీ ప్రక్రియలను పూర్తి చేసేటప్పుడు సమస్యలకు దారితీయవచ్చు. అంతేకాకుండా ఆధార్ సమాచారాన్ని క్రమం తప్పకుండా అప్‌డేట్ చేసుకోవడం వల్ల డెమోగ్రాఫిక్ డేటా బేస్‌లో ఖచ్చితత్వాన్ని నిర్వహించడానికి అధికారులకు వీలవుతుంది. తద్వారా దుర్వినియోగాలు, మోసాలు నివారించడంతోపాటు ప్రజా సేవల్లో జాప్యాలు, తిరస్కరణలను తగ్గించడానికి ఆస్కారం కలుగుతుంది. ఆన్‌లైన్‌లో ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే సౌకర్యాన్ని యూఐడీఏఐ అందిస్తున్నప్పటికీ, ఆధార్‌లోని కొన్ని రకాల వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది. యూఐడీఏఐ ప్రస్తుతం మై ఆధార్ పోర్టల్ ద్వారా నిర్దిష్ట డెమోగ్రాఫిక్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయడానికి అనుమతిస్తోంది. అవి ఏమిటంటే..

**బయోమెట్రిక్ సమాచారం మారదు**

ఆన్‌లైన్‌లో ఆధార్ బయోమెట్రిక్ సమాచారం అప్‌డేట్ చేసేందుకు వీలులేదు. ఫోటో, వేలిముద్రలు, ఐరిస్ (కనుపాప) స్కాన్ వంటి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయాలనుకుంటే, భౌతికంగా ఆధార్ నమోదు కేంద్రంలో మాత్రమే చేసుకోవాలి. ఎందుకంటే బయోమెట్రిక్ వివరాలను ధ్రువీకరించాల్సిన అవసరం ఉంటుంది. అందుకు అవసరమైన పరికరాలు కేంద్రాల వద్ద మాత్రమే ఉన్నాయి.

## సంక్షిప్తంగా..



### సరస్వతీ పుత్రికకు లక్ష్మీకటాక్షం

**చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గుల్లపల్లి అభినయకు పైచదువులకు ఆర్థిక సహాయం**

**రామడుగు(జనంసాక్షి):** కొక్కెరకుంట గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్‌లో గుల్లపల్లి అభినయ పదోతరగతి పరీక్షల్లో 984 మార్కులు సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ హెల్పింగ్ హాండ్స్ సహకారంతో రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆమె ఇంజినీరింగ్ మొదటి విద్యా సంవత్సరానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించామని క్లబ్ అధ్యక్షుడు యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ తెలిపారు. అదేవిధంగా తర్వాతి మూడు సంవత్సరాలకు గానూ అవసరమయ్యే రూ.55 వేలను కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ తౌటు కిషన్ రెడ్డి, బత్తిని అజయ్, జేరిపోతుల మహేష్, గజ్జెల నవీన్ కుమార్, ఎండి చోటే పాల్గొన్నారు.

### త్వరలో కొత్త రేషన్ కార్డులు

**కేకే**



**ముస్తాబాద్ మే 24 (జనంసాక్షి):** కొత్త రేషన్ కార్డులకు వచ్చేనెల నుంచి సన్న బియ్యం పంపిణీ. కార్డులు మంజూరైన వారికి ఈనెల 25 నుంచి మొబైల్ లకు మెసేజ్ లు గ్రామసభల ద్వారా ఎం పికైన వారికి కొత్త కార్డులు మంజూరు కొత్త కార్డులతో కలిపి రాష్ట్రంలో మూడు కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు శుభవార్త చెప్పబోతోంది కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి నెలకు 1,89 లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తుంది. నిరుపేదలకు కడుపునిండా సన్న బియ్యం అందించడమే ప్రభుత్వము ఒక సంకల్పంతో ముందుకు పోతుంది పేద ప్రజల కోసం నిరుపేదల కోసం ప్రభుత్వం పని చేస్తుంది కేకే మహేందర్ రెడ్డి అన్నారు

### ఘనంగా సరస్వతి పుష్కరాలు

**విధులు నిర్వహిస్తున్న డిఎల్పివో**



**ముత్తారం మే 24(జనంసాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద మే 15 నుండి నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాలలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వర్తించేందుకు పెద్దపెల్లి జిల్లా పాలనాధికారి కోయా శ్రీహర్ష ఆదేశాల మేరకు మంథని డివిజన్ పంచాయితి అధికారి సతీష్ కుమార్ పర్యవేక్షించడం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డివిజన్ పంచాయితీ అధికారి సతీష్ కుమార్ మాట్లాడుతూ.. సరస్వతి పుష్కరాలలో భాగంగా అశేష భక్తులు హాజరు అవుతున్నందువలన అక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్న క్రమంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులతో తడి చెత్త,పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం జరుగుతుందని,ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడంతోపాటు అవసరం ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడం మండల,గ్రామ పంచాయితీ అధికారులతో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.

### తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలు

**హుజురాబాద్, మే 24 (జనంసాక్షి):** హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలగోని రాములు(55) శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో హుజురాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. రాములు చెట్టుపై నుండి పడడంతో ప్రస్తుతం జీవనోపాధి గీత కార్మిక వృత్తికి దూరమయ్యాడని, రెక్క ఆడితే డొక్కా ఆడని పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం రాములు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు.



# ఆయిల్‌ఫామ్‌కు ప్రాధాన్యతనివ్వాలి

- ప్రత్యామ్నాయ పంటగా పెంచాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ బ్యూరో, మే 24 (జనంసాక్షి) :** రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, ఈ సాగులో ఆయిల్ ఫామ్ కు ప్రాధాన్యత నివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. లోహియా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై "బంగారు రైతు" అవగాహన కార్యక్రమాన్ని కరీంనగర్ లోని కె.ఎస్.ఎల్ గార్డెన్ లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరై మాట్లాడుతూ, కేవలం వరి మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని అన్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండి ఉత్పత్తి తక్కువగా ఉండే పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ఒక సీజన్లో వరి వేస్తే మరో సీజన్లో ప్రత్యామ్నాయ పంట వేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలలో ఆయిల్ ఫాం సాగు ప్రయోజనకరమైనదని తెలిపారు. ఈ పంటలో అంతర పంట కూడా సాగు చేయవచ్చని అన్నారు. మూడు సంవత్సరాల పాటు కష్టపడితే 30 సంవత్సరాల నికర ఆదాయం ఈ పంట ద్వారా చేకూరుతుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం నాలుగు సంవత్సరాలకు గాను ఎకరానికి రూ.51 వేల వరకు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎకరానికి రూ.22,500 సబ్సిడీని బిందు సేద్యం కోసం సబ్సిడీ అందిస్తోందని వివరించారు. జిల్లాలో కేవలం 320 మంది రైతులు మాత్రమే 1200 ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగు చేస్తున్నారని అన్నారు. ఈ సాగు విస్తీర్ణాన్ని ఈ ఏడాది 3000 ఎకరాల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని, ఆయిల్ ఫామ్ ద్వారా రైతులు లాభాలను అర్జించవచ్చని అన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, లోహియా సంస్థ సీఈవో సిద్ధాంత్ లోహియా, ప్రతీక్ పట్నాయక్ పాల్గొన్నారు.

## న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**అడిషనల్ సెషన్ జడ్జి శ్రీనివాసరావు..**



**గోదావరిఖని, జనంసాక్షి :** ఉచిత న్యాయ సేవలు అందుకోవడానికి పేద ప్రజలు మండల న్యాయ సేవ సమితిని సంప్రదించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ , డిస్ట్రిక్ట్ అండ్ అడిషనల్ సెషన్స్ జడ్జి టి. శ్రీనివాస రావు సూచించారు. మండల న్యాయ సేవ సమితి ఆద్వర్యంలో శనివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ వరకట్న దురాచారం రూపుమాపడానికి , భ్రూణ హత్యలు అరికట్టడానికి , అవినీతి నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పు దారిలో పోకుండా ఉండేందుకు వారిలో జ్ఞానం పెంపొందడానికి విద్యా బుద్దులు నేర్పించాలని అన్నారు. క్షణికావేశంలోనే ఎక్కువ శాతం నేరాలు జరుగుతున్నాయని అన్నారు. నేరాలు జరగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ భావోద్వేగాలను , ఆవేశాలను నియంత్రించుకోవాలని అన్నారు. ఆలోచన అనేది మనిషికి దేవుడిచ్చిన వరమని అన్నారు. మంచి ఆలోచనలతో క్రమశిక్షణ, నీతి , నిజాయితీతో సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. సంపాదించిన ఆస్తులు శాశ్వతం కావని సంపాదించుకున్న పేరు మాత్రమే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అలెగ్జాండర్ , ఆల్ఫ్రెడ్ నోబెల్ ఉదంతాలు నిరూపించాయని అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అనుకొని సాధ్యమైన%శీ%త వరకు అవసరం ఉన్న వారికి , ఆపదలో ఉన్న వారికి సహాయం అందించాలని అన్నారు. అలాగే సమాజ హితం కోసం అవసరమైన పక్షంలో ఎక్కువ సమయం కేటాయించి సిబ్బంది పని చేయాలని అన్నారు . రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , న్యాయవాదులు గుడికందుల భూమయ్య ,గోలి తిరుపతి రావు , ఆర్ ఓ ఆంజనేయులు , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , మెప్మా సి ఓ లు , ఆర్ పి లు , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## తహసిల్దార్‌కు ఘనసన్మానం

**అట్టడుగు వర్గాల ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి**

**సుల్తానాబాద్,మే 24(జనంసాక్షి) :** సుల్తానాబాద్ నూతన తహసిల్దార్ పదవి బాధ్యతలను స్వీకరించిన ఎండి బస్సిరోద్దీన్ ను శనివారం ధర్మ సమాజ్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి బోకియో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షులు ఆవునూరి సతీష్ జిల్లా నాయకులు ఎదుళ్ల శంకరయ్య మండల నాయకులు ఆషాడం విక్రమ్ తదితరులు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో అట్టడుగు వర్గాలకు చెందిన పెండింగ్లో ఉన్న వివిధ రకాల, భూ రెవెన్యూ సమస్యలను పరిష్కారం చేయాలని తహసిల్దార్ బసీరుద్దీన్ ను కోరారు. అపరిస్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. స్పందించిన తహసిల్దార్ బసీరుద్దీన్ మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన భూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం త్వరితగతిన నిర్ణయాలు తీసుకొని జవాబుదారి ఘనంగా ఉంటామన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తహసిల్దార్ బసీరుద్దీన్ సూచించారు.

## ఆరుగాలం కష్టం క'న్నీటి'పాలు



**మేడిపల్లి, భీమారం(జనంసాక్షి):** ఉమ్మడి మేడిపల్లి మండలం లోని గత నాలుగు రోజులు గా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తుతున్న కొనుగోలు కేంద్రాల్లో కాంటా ఆలస్యం అవ్వడంతో, ధాన్యం కేంద్రాల్లోని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మండలాల కేంద్రాల్లోని అన్ని గ్రామాల్లో భారీ వర్షాలకు కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం కుప్పలలోకి నీరు చేరడం, తూకం వేసి ఉంచిన ధాన్యం బస్తాలు తడవడంతో రైతులు ధాన్యం బస్తాలను కాపాడుకోవడానికి నన అవస్థలు పడుతున్నారు. రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు మొదలయి నెల అయిన తూకం ఆలస్యంగా నడవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వహకులపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం పండించడానికి పడిన కష్టం కంటే చేతికి వచ్చిన పంటను కాపాడుకొని అమ్మడానికి అంతకంటే ఎక్కువ కష్టపడాల్సి వస్తుంది అని తడిసిన ధాన్యాన్ని చూపిస్తూ రోధిస్తున్నారు.

## ఘనంగా పీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



**వీణవంక మే 24 (జనంసాక్షి)** వీణవంక తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షులు 60వ జన్మదిన వేడుకలు వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పండ్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘుపాల్ రెడ్డి,ఎండి సాహెబ్ హుస్సేన్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో ఒక కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్సీ,రాష్ట్రంలో టీపిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్రములో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పై ఎంతో కృషి చేసిన బొమ్మ మహేష్ వారి చేసిన సేవను గుర్తించి కేంద్ర పార్టీ పెద్దలు మల్లికార్జున కార్గే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రానికి టీపీసీసీ అధ్యక్షులు గా నియమించిన మంచి నాయకుడని పేద బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టడంలో దిట్ట అని భావించి వారికి టీపీసీసీ బాధ్యతలు అప్పగించడం జరిగింది తెలంగాణ రాష్ట్రంలో 6 గ్యారంటీలు అమలు కోసం నిరంతరం శ్రమిస్తూ రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ ఒకే నెలలో చేసిన ఘనత ఆయనది వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉంచాలని వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి,ఎండీ సాహెబ్ హుస్సేన్,గంగాడి రాజిరెడ్డి,మాజీ సర్పంచ్ లు చిన్నాల అయిలయ్య యాదవ్,కర్ర తిరుపతి రెడ్డి,దాసరపు లక్ష్మణ్,ధర్మకర్త జున్నుతుల మధుకర్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మాదాసు సునీల్,ఈదునూరి పైడి కుమార్,ఒరేం శ్రీనివాస్,ఉయ్యాల నాగరాజు,కర్ర గురు,లింగాల ప్రపంచ రెడ్డి,మర్రి సమ్మయ్య తదితరులు పాలుగోన్నారు.

## నాలాపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ ..**



**గోదావరిఖని, జనంసాక్షి:** రామగుండం కార్పొరేషన్ పరిధిలో రోడ్లను నాళాలను ఆక్రమించి చేసిన నిర్మాణాలను తొలగించడంలో నగరపాలక సంస్థ పనితీరు అభినందనీయమని అలాగే మార్కండేయ కాలనీ రోడ్డు వెడల్పు మాస్టర్ ప్లాన్ ప్రకారం చేయడానికి అడుగులు పడడం శుభసూచకమని అయితే మార్కండేయ కాలనీ ఆదిత్య హోటల్ పక్కన ప్రధాన నాలాపై స్లాబ్ చేసి సిసి రోడ్లు నిర్మించడం జరిగింది మాస్టర్ ప్లాన్ నిర్మాణంలో భాగంగా ఆ నాలాపై ఉన్న నిర్మాణాన్ని కూడా కార్పొరేషన్ అధికారులు తొలగించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. నూతన మున్సిపల్ చట్టం-2019 ప్రకారం నాళాలపై కానీ నాలాకు ఆనుకొని ఉన్న నిర్మాణాలు చేసే వారిపై రామగుండం నగరపాలక సంస్థ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అలాంటి నిర్మాణా లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నాలాపై ఉన్న నిర్మాణం పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు.వర్షాకా లంలో స్లాబ్ నిర్మాణం కోసం నాలాలో నిర్మించిన పిల్లర్ల వల్ల చెత్తాచెదారమంతా జామై పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బం దులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇలా నాళాలపై నిర్మాణం వల్ల అనేక ప్రాంతాల్లో నాళాల నీరు బయటికి పొంగి పొర్లడం జరుగుతుందని దీనివల్ల కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అయినవాడికి ఆకులో కాని వాడికి కంచంలో పెట్టే పద్ధతిని ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు విడనాడాలని అన్నారు. కార్పొరేషన్ లో ఒక బలమైన నాయకత్వం ఉన్నందున ఈ పరిస్థితుల్లోనే మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి అధికారులంతా కసరత్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ముస్తాబాద్ మే 24 (జనంసాక్షి):** ముస్తాబాద్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. మండలంలో 24 చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. తొమ్మిది లక్షల 25 వేల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ప్రభుత్వం ప్రజలకు సామాన్యులకు అందుబాటులో ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్నబియ్యం అందిస్తుందంటే కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యమైంది. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుంది కొంతమంది కావాలని ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేస్తుంద్రు అలాంటి వారి మాటలు ఎవరు నమ్మద్దు. అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు అది ప్రజలు గమనిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి తక్కువ సమయంలోనే ఎన్ని అభివృద్ధి పథకాలు అమలు జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గుండెలు శ్రీనివాస్ గౌడ్, గజ్జేల రాజు, ఎండి సాదుల్ పప్పా, శీల ప్రశాంత్, మిరుదొడ్డి భాను, దునుకుల కొండయ్య, మామిండ్ల ఆంజనేయులు, తలారి నర్సింలు, కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు లబ్ధిదారులు పాల్గొన్నారు

## నూతన బదిలీ విధానం సరికాదు

**ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలి**
**-ఐఎన్టీయూసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి**
**నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన**



**యైటీంక్లయిన్ కాలనీ మే 24 (జనంసాక్షి):** సింగరేణిలో ఉద్యోగుల బదిలీలపై నూతన విధానంపై యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులను నిరసిస్తూ, రద్దుచేయాలనీ డిమాండ్ చేస్తూ ఓసీపీ-1 గనిలో ఐఎన్టియూసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గని ఫిట్ కార్యదర్శి వెంకటస్వామితో కలిసి మాట్లాడారు. గెలిచిన సంఘాలకు కనీస సమాచారము, అనుమతి లేకుండానే కార్మిక వ్యతిరేక ఉత్తర్వులను జారీ చేసిన యాజమాన్యం వెంటనే ఉత్తర్వులు వెనుకకు తీసుకోవాలని లేనిపక్షంలో తీవ్ర పోరాటాలకు ఐఎన్టియూసి సిద్ధమన్నారు. కార్మిక వ్యతిరేక చర్యలను తమ యూనియన్ సహించదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం



**హుజురాబాద్, మే 24 (జనంసాక్షి):** ఇటీవల హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి సూపరింటెండెంట్ గా నియమితులైన నల్లా నారాయణరెడ్డిని పట్టణానికి చెందిన వివిధ సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.పివి సేవాసమితి అధ్యక్షుడు తూము వెంకట రెడ్డి శాలువాతో సన్మానించగా వైద్యులు రామలింగారెడ్డి , బిజెపి సీనియర్ నాయకులు మాసాడి ముత్యం రావు బొకేను అందించి స్వీట్స్ పంచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి ని దైవంగా భావించే వ్యక్తి డాక్టర్ నారాయణరెడ్డి అని అన్నారు. వైద్య వృత్తిలో స్థిరపడిన నాటి నుండి పేద ప్రజల సేవయే పరమావధిగా భావిస్తూ..క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగిన వ్యకి గా వైద్యరంగంలో ఆదర్శ వ్యక్తి గా అభివర్ణించారు. వృత్తి పరంగానే కాకుండా సందర్భానుచితంగా సేవాకార్యాక్రమాలల్లో పాల్గొంటు ఇతరులను ఉత్తేజపరుస్తాడని వారిసేవలను గుర్తుచేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ స్థాయి పెరిగితే బాధ్యత లు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలల్లో వైద్యపరంగా ప్రజలకు అవసరమైనఅన్ని వసతులు ఉన్నాయని గర్భిణి స్త్రీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనైనదని వారన్నారు.ప్రభుత్వం కల్పించే వైద్య సేవలను పేద మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నారాయణరెడ్డి ప్రజలకు సూచించారు.పై అధికారుల సూచనలు ,తోటి సిబ్బందితో కలసి ముందుకు పోతానని అన్నారు. ఈకార్యక్రమంలో అలయన్స్ అధ్యక్షుడు బి మనోజు,ప్రధాన కార్యదర్శి టి.మాధవరావు పీడీ కొన్ని రాజిరెడ్డి ఉపాధ్యాయుడు, కె సాధానందం, గౌరీశంకర్ వేల్పుల ప్రభాకర్ కాసర్ల.శ్రీహరి ముక్కెర కన్నయ్య తదితరులు పాల్గొన్నారు. 2

## అర్హులైన పేదలకే 'రాజీవ్ యువ వికాస్' అందించాలి

**బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి**



**వేములవాడ, మే 24 (జనంసాక్షి):** రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైన నిరుపేదలకి అందజేయాలని బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో వేములవాడ రూరల్ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టగా దానికి సిబిల్ స్కోర్ ఉండాలనే నిబంధన జోడించడాన్ని, గ్రామాల్లో కేవలం అధికార పార్టీ కార్యకర్తలకే ఈ పథకం వర్తిస్తదంటూ యువకులను మభ్యపెడుతున్నట్టు బయట ప్రచారం జరుగుతుంది అన్నారు. అర్హులైన పేదలను కాదని అధికార పార్టీకి అనుకూలంగా ప్రభుత్వ అధికారులు అనర్హులను ఎంపిక చేస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వాటన్నిటికీ కూడా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దానే తిరుపతి,మంద రాజేందర్, ఆకుల బాబు,మల్లారం తిరుపతి, ముస్కం సంజీవ్, ఎడుమేకల మధు, బి జె పి కార్యకర్తలు పాల్గొన్నారు.

## చారిత్రక వైభవాన్ని భావితరాలకు అందించాలి

**ఆలయంలో డీఈవో ప్రత్యేక పూజలు**



**రాయికల్ మే 24(జనంసాక్షి):** మన దేశ చారిత్రక వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన గురతర బాధ్యత ఉపాధ్యాయుల పైన ఉందని జిల్లా విద్యాధికారి కే రాము అన్నారు. రాయికల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షణ చేశారు. అనంతరం పట్టణంలోని చారిత్రక కట్టడమైన త్రికూట ఆలయాన్ని ఆయన సందర్శించి, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ సాంస్కృతిక చారిత్రక వైభవానికి ఆలయాలు ప్రతీక అని, ఆధ్యాత్మికత తో మానసిక ప్రశాంతత, సానుకూల దృక్కోణం అలవడుతుందని, ఆయనకు ఆలయ కమిటీ పక్షాన ఆలయ కమిటీ చైర్మన్ మచ్చ శ్రీధర్, ప్రధాన అర్చకులు యం.సతీష్ శర్మ లు, ఉపాధ్యాయ సంఘాల పక్షాన టి.వై.ఎం.ఎస్.ఈ.యు. రాష్ట్ర శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, తపస్ జిల్లా బాధ్యులు చెరుకు మహేశ్వర శర్మ, పి.ఆర్.టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొన్నం రమేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గాజెంగి రాజేశం, హిందూ ఉపాధ్యాయ సమితి జిల్లా బాధ్యులు డి జితేందర్ రెడ్డి, అక్కినపెల్లి సతీష్ , రాచర్ల శ్రీనివాస్, తదితరులు స్వామి వారి శేష వస్త్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

## వెంకటేశ్వరా స్వామి కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్



**కథలాపూర్(జనంసాక్షి):** మండలం ఊటుపల్లి గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు,ఎండీ. అజీమ్, శేఖర్, ప్రవీణ్,అంజయ్య, డైరెక్టర్లు వాకిట్ రాజారెడ్డి, గంగాధర్, శేఖర్, శిరీష హరిప్రసాద్, కిషన్,కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# తానాకాన్ కరీంనగర్

## తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డాక్టర్లు



**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) :** తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్ వారి రెండు రోజుల కాన్ఫరెన్స్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం జరిగింది. శనివారం రోజు కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన స్పెషాలిటీ డాక్టర్స్ తమ లేటెస్ట్ అప్డేట్ డెలిగేట్స్ కి చూపించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్ నాయర్ కారికల్ మెడికల్ కాలేజ్ పాండిచ్చేరి నుండి వచ్చి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ గూర్చి క్లుప్తంగా తెలియపరిచినారు. ఈ విధంగా లేటెస్ట్ అప్డేట్ గూర్చి చర్చించడం ఇట్టి కార్యక్రమంలో కరీంనగర్ , తెలంగాణ నుండి 900 డాక్టర్స్ పాల్గొన్నారు. డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ అరుణ్ కటారి ప్రెసిడెంట్ ఎలెక్ట్ తానా తెలంగాణ స్టేట్ , డాక్టర్ చాట్ల శ్రీధర్, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ మంగీలాల్, డాక్టర్ సునీల్ రెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ జగన్ మోహన్ రావు, డాక్టర్ బి.ఎన్.రావు, డాక్టర్ విజేందర్ రెడ్డి, డాక్టర్ టీకేకే నాయుడు, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ రఘురాం, డాక్టర్ విజయ మోహన్ రెడ్డి, డాక్టర్ శ్రీలత రెడ్డి, డాక్టర్ శైలజ, డాక్టర్ మమతారెడ్డి, డాక్టర్ వై నరేంద్ర, డాక్టర్ జయరాం, డాక్టర్ ఈ శైలజ, డాక్టర్ శేష శైలజ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ రమణాచారి, డాక్టర్ రామ్ కిరణ్ , ఇతర ప్రముఖ డాక్టర్స్ పాల్గొన్నారు. ఆదివారం రోజు (నేటి) ఇన్స్టాలేషన్ ప్రోగ్రాం లో హెల్త్ మినిస్టర్ దామోదర రాజా నరసింహ , ఐటి మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు , ట్రాన్స్పోర్ట్ అండ్ బీసీ వెల్ఫేర్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ , డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే మానకొండూరు, మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ హోమ్ అఫైర్స్ ఆఫ్ ఇండియా మినిస్టర్ బండి సంజయ్ , గంగుల కమలాకర్ కరీంనగర్ ఎమ్మెల్యే , డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే , మేడిపల్లి సత్యం చొప్పదండి ఎమ్మెల్యే తదితరులు పాల్గొంటారు.

# యువరాజ్ సింగ్‌కు కొత్త బాధ్యత



హైదరాబాద్ (జనంసాక్షి) : క్రికెట్ లెజెండ్, 2011 ప్రపంచ కప్ విజేత జట్టులోని కీలక సభ్యుడు యువరాజ్ సింగ్ ఇప్పుడు కొత్త ఇన్నింగ్స్ షురూ చేశాడు. ఈసారి యువీ భారత్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా క్రీడల వృద్ధిని పునరుజ్జీవింపజేయడం లక్ష్యంగా ప్రోలిథిక్ టాలెంట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ అనే కొత్త అథ్లెట్ నిర్వహణ సంస్థను ప్రారంభించారు. సిక్స్-హిట్స్ పరాక్రమానికి..భారత్ 2011 ప్రపంచ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన యువరాజ్ సింగ్, భారత్ వెలుపల అథ్లెటిక్స్ అభివృద్ధి కోసం ప్రోలిథిక్ టాలెంట్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించనున్నాడు. దీనికోసం ఏజెన్సీ భారత క్రికెట్, ఐపీఎల్ స్టార్ అభిషేక్ శర్మను కూడా ఎంపిక చేసింది. కోచింగ్ ప్రపంచంలో సిక్సర్లు కొట్టనున్న యువరాజ్ సింగ్ కు పెద్ద బాధ్యత అప్పగించింది.ప్రోలిథిక్‌లో మెంటర్‌షిప్ పాత్రలో చేరడం గురించి యువరాజ్ సింగ్ మాట్లాడుతూ, 'నా ప్రయాణాన్ని తిరిగి చూసుకున్నప్పుడు, ఏదైనా క్రీడా కెరీర్‌లో మనుగడ సాగించడానికి, విజయం సాధించడానికి సరైన మార్గదర్శకత్వం, ఫిట్‌నెస్, ఆహారం, మానసిక బలం ఎంత ముఖ్యమో నేను గ్రహిస్తాను. మనం ప్రోలిథిక్ తో చేస్తున్నది నేను ప్రారంభించినప్పుడు నాకు ఉంటే బాగుండు అని నేను కోరుకుంటున్నాను. ఒక బ్రాండ్ మాత్రమే కాకుండా ఒక అథ్లెట్ సమగ్ర అభివృద్ధిని చూసే బృందం. ఈ సహకారం తరువాతి తరాన్ని మానసికంగా మరింత పదునుగా, బలంగా, మరింత సిద్ధంగా ఉండేలా శక్తివంతం చేస్తుందని చెప్పుకొచ్చాడు. ప్రోలిథిక్ ఎఫర్ట్ డైరెక్టర్.. 200 నాటౌట్ సినిమా వ్యవస్థాపకుడు రవి భాగ్‌చంద్కా మాట్లాడుతూ, 'ప్రతి అథ్లెట్‌లోని అత్యుత్తమ ప్రతిభను బయటకు తీసుకురావడానికి మేము సమిష్టిగా కృషి చేస్తున్నందున ఈ వెంచర్ పరివర్తన చెందుతుందని నేను నమ్ముతున్నాను. మనం చేపట్టబోయే ఉత్తేజకరమైన మిషన్ ఖచ్చితంగా గేమ్ ఛేంజర్ అవుతుంది. అబుదాబి 10, మాక్స్ 60 కరేబియన్ టోర్నమెంట్ వంటి అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొన్న న్యూయార్క్ స్ట్రైకర్స్ యజమాని సాగర్ ఖన్నా మాట్లాడుతూ, 'క్రీడలలో రాణించడానికి మద్దతు ఇవ్వడమే మా లక్ష్యం అభిషేక్ వంటి మంచి ప్రతిభ ఉన్న ఆటగాళ్లతో పనిచేయడం మాకు అలా చేయడంలో సహాయపడుతుంది' అని అన్నారు.

# అఫ్ఘాన్‌లో చెస్‌పై నిషేధం

హైదరాబాద్ (జనంసాక్షి) : తాలిబన్ ప్రభుత్వం ఆఫ్ఘనిస్థాన్‌లో మరొక విచిత్రమైన నిషేధాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. అదే చదరంగంపై బ్యాన్. తాము అధికారంలోకి వచ్చాక ఇప్పటికే మహిళలు క్రీడల్లో పాల్గొన కూడదని హుకుం జారీ చేసిన తాలిబన్లు లేడీ అథ్లెట్ లు వేరే దేశాలకు వెళ్ళిపోవడానికి కారణం అయ్యారు. గత పారిస్ ఒలింపిక్స్‌లో ఆఫ్ఘనిస్తాన్‌ను రిప్రజెంట్ చేసిన ముగ్గురు మహిళలు వేరే వేరే దేశాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఆఫ్ఘనిస్తాన్ మహిళల క్రికెట్ టీం కూడా ఆస్ట్రేలియా లాంటి వేరే దేశాల నుంచి తమ దేశానికి ప్రాతినిధ్యం. వహిస్తున్నారు. ఇలా క్రీడల్లో మహిళలపై మొదలైన నిషేధాలు నెమ్మదిగా మొత్తం ఆటల పైనే నిషేధం దిశగా వెళ్తోంది. తాజాగా చదరంగంపై బ్యాన్ విధిస్తున్నట్టు తాళిబన్లు ప్రకటించారు. ఇది తాత్కాలికమైన నిషేధం అని చెప్తున్నప్పటికీ పరిస్థితి చూస్తుంటే అలా కనిపించడం లేదు.నిషేధం విధించడం తాలిబాన్లకు ఇది కొత్త కాదు. అమెరికా దాడులకు ముందు కూడా ఆఫ్ఘనిస్తాన్‌లో చదరంగం ఆడడంపై నిషేధం విధించారు. ఇప్పుడు మళ్లీ తాత్కాలిక నిషేధం అంటున్నారు. కానీ దానికి ఒక టైమ్ లిమిట్ అంటూ చెప్పకపోవడంతో ఈ నిషేధం శాశ్వతమే అని అర్థమవుతుంది అంటున్నారు చెస్ ప్రేమికులు. అటు ఇటుగా అధికారికంగా ఆ దేశంలో జాతీయస్థాయిలో చదరంగం ఆడే ప్రొఫెషనల్ ప్లేయర్లు 400-500 మంది ఉంటారని ఒక అంచనా. ఇప్పుడు వారంతా ఆటకు దూరమయ్యారు. చదరంగం ఆడితే తాలిబన్ల చేతల్లో కఠిన శిక్షలు ఉంటాయనే భయం వారిని పట్టి పీడిస్తోంది. కానీ పురుషులాడే ఇతర ఆటలకు అనుమతి ఇచ్చి చదరంగం మీద మాత్రమే ఎందుకు నిషేధం విధిస్తున్నారంటే దానికి మరికొన్ని మతపరమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఒక విదేశీ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వ వర్గాలు చెబుతున్న దాని ప్రకారం చదరంగం ఆడడం 'షరియా ' చట్టానికి వ్యతిరేకం. గ్యాంబ్లింగ్ లాంటి ఆటలను షరియా చట్టం ఒప్పుకోదు కాబట్టి చదరంగాన్ని నిషేధిస్తున్నట్టు తాలిబన్లు చెప్పుకుంటున్నారు. కానీ అసలు కారణం అది కాదని అభ్యుదయ వాదులు చెబుతున్నారు.

# గిల్ యే కెప్టెన్

- వైస్ కెప్టెన్ గా రిషబ్ పంత్ నియామకం
- ఇంగ్లండ్ పర్యటనకు టీమిండియా జట్టు ప్రకటన



న్యూఢిల్లీ (జనంసాక్షి) : భారత టెస్టు క్రికెట్ లో నూతన శకం షురూ అయ్యిందని చెప్పవచ్చు. సుదీర్ఘ ఫార్మాట్ లో రోహిత్ శర్మ, వారసుడిగా యువ ఆటగాడు శుభ్ మన్ గిల్ ను బీసీసీఐ శనివారం ఎంపిక్ చేసింది. అందరూ ముందుగానే ఊహించినట్లుగానే టెస్ట్ జట్టు కెప్టెన్సీ పగ్గాలను గిల్ చేతిలో పెట్టింది. ఈ మేరకు వచ్చే నెలలో ఇంగ్లండ్ పర్యటనకు టీమిండియా జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. సారథిగా శుభ్ మన్ గిల్, వైస్ కెప్టెన్ గా రిషబ్ పంత్ ను సెలక్ట్ చేసింది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది బీసీసీఐ. జూన్ 20 నుంచి ఇంగ్లండ్ తో 5 టెస్టుల సిరీస్ జరగనున్న సంగతి తెలిసిందే. కాగా గిల్ టీం ఇండియాకు 37వ టెస్ట్ కెప్టెన్ కానున్నాడు. 25 ఏళ్ల గిల్ టీం ఇండియాకు 5వ అతి పిన్న వయస్కుడైన టెస్ట్ కెప్టెన్. ఇంగ్లాండ్ గడ్డపై బ్యాట్‌తోనే కాకుండా కెప్టెన్సీలోనూ బాగా రాణించడం ఇప్పుడు గిల్ ఎదుర్కొనే కఠినమైన సవాలు. అర్ష్‌దీప్ సింగ్ తొలిసారి టెస్ట్ జట్టులోకి ఎంపికయ్యాడు. శార్దుల్ ఠాకూర్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుతంగా రాణించిన ఓపెనర్ యశస్వి జైస్వాల్, ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి తమ స్థానాన్ని నిలుపుకోగలిగారు. సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ కూడా జట్టులో ఉన్నారు. ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ తరపున అద్భుతమైన బ్యాటింగ్ చేసినందుకు సుదర్శన్ కు బహుమతి లభించింది. కరుణ్ నాయర్ 8 సంవత్సరాల తర్వాత టీమ్ ఇండియాలోకి తిరిగి వచ్చాడు. 2024-25 రంజీ ట్రోఫీలో విదర్భ తరపున ఆడుతున్నప్పుడు అతను 863 పరుగులు చేశాడు. అందుకే ఇప్పుడు సెలెక్టర్లు అతనికి చాలా కాలం తర్వాత అవకాశం ఇచ్చారు.ఇంగ్లండ్లో జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో పేస్ అటాక్‌కు నాయకత్వం వహిస్తాడు. అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ వంటి ఫాస్ట్ బౌలర్లు కూడా బుమ్రాకు మద్దతుగా ఉంటారు. స్పిన్ బౌలింగ్ బాధ్యత కుల్దీప్ యాదవ్, జడేజా భుజాలపై ఉంటుంది. భారత్, ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ మొదటి టెస్ట్ మ్యాచ్ లీడ్స్‌లో జరగనుండటం గమనించదగ్గ విషయం. దీనితో, 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చక్రం ప్రారంభమవుతుంది. రెండవ టెస్ట్ బర్మింగ్‌హామ్‌లో, మూడవ టెస్ట్ లార్డ్స్‌లో నాల్గవ టెస్ట్ మాంచెస్టర్‌లో జరుగుతుంది. టెస్ట్ సిరీస్‌లోని చివరి 5వ మ్యాచ్ కెన్నింగ్టన్ ఓవల్‌లో జరుగుతుంది. కాగా 2020లో ఆస్ట్రేలియాపై గిల్ టెస్టు క్రికెట్‌లో ఎంట్రీ ఇచ్చాడు. టెస్టుల్లోనూ గిల్ ఓపెనర్‌గానే ప్రస్థానం ప్రారంభించాడు. వచ్చీ రావడంతోనే ఓపెనర్‌గా బరిలోకి దిగిన గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 45, 35లి స్కోర్లు నమోదు చేశాడు. అలా ఓపెనింగ్ స్థానాన్ని పరిమితం చేసుకున్న గిల్, ఇంటాబయట అనేక విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.ఇప్పటివరకు 32 టెస్టులకుగానూ గిల్ 59 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్‌కు దిగాడు. 35 యావరేజ్‌తో 1893 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 128 టెస్టుల్లో గిల్‌కు అత్యధిక స్కోర్‌గా ఉంది. ఇందులో ఆసియాలో 1177 పరుగులు చేశాడు. ఇటీవల కాలంలో టీమ్‌ఇండియాకు అతి తక్కువ వయసులోనే కెప్టెన్‌గా ఎంపికైన ప్లేయర్‌గా గిల్ రికార్డ్ కొట్టాడు. ఇక ఇదివరకు వన్డే, టీ20 ఫార్మాట్‌లలో టీమ్‌ఇండియాకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఉంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన టీమ్‌ఇండియా జట్టులో కెప్టెన్ రోహిత్‌కు శుభ్‌మనే డిప్యూటిగా వ్యవహరించాడు.అటు ఐపీఎల్‌లోనూ గిల్ కెప్టెన్‌గా తనదైన మార్క్ చూపిస్తున్నాడు. 2024లో తొలిసారి గుజరాత్ టైటాన్స్ పగ్గాలు అందుకున్న గిల్ ఆ సీజన్‌లో కాస్త తడబడ్డాడు. అయినప్పటికీ ప్రస్తుత సీజన్‌లో కెప్టెన్సీ, బ్యాటింగ్ రెండింట్లోనూ తనదైన మార్క్ చూపిస్తున్నాడు. ఈసారి గుజరాత్‌ను ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేర్చాడు. అటు బ్యాట్‌తోనూ అదరగొడుతున్న గిల్ 13 మ్యాచ్‌ల్లో 636 పరుగులు చేశాడు. కాగా, రోహిత్ రిటైర్మెంట్ తర్వాత టీమ్‌ఇండియాకు కొత్త కెప్టెన్ ఎవరా అని పెద్ద చర్చే జరిగింది. తొలి నుంచి ప్రచారం జరిగినట్లుగానే సెలక్టర్లు కూడా గిల్ పేరు ఖరారు చేశారు. దీంతో రోహిత్ వారసుడిగా గిల్ కొత్త అధ్యాయం మొదలు పెట్టనున్నాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో జట్టును నడిపించడం సవాలుతో కూడుకున్న పనే. అందులోనూ అత్యుత్తమ జట్టైన టీమ్‌ఇండియాకు కెప్టెన్సీ వహించడంతో గిల్‌పై భారీగానే అంచనాలు ఉన్నాయి. కెప్టెన్‌గా తొలి సిరీస్‌తోనే గిల్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది. ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ నెగ్గడం గిల్ ముందున్న అసలైన సవాల్. పైగా ఈ సిరీస్‌తోనే డబ్ల్యూటీసీ సైకిల్ ప్రారంభం అవ్వనుండడం వల్ల టీమ్‌ఇండియా ఫ్యాన్స్ ఘనమైన ఆరంభం ఆశిస్తున్నారు. ఇక జట్టులో తనకంటే సీనియర్లు బుమ్రా, రాహుల్, జడేజాను ఎలా సమన్వయం చేస్తాడన్నది ఆసక్తికరం. ఐసీసీ ఈవెంట్లలో భారత్ ఇప్పటివరకు డబ్ల్యూటీసీ టైటిల్ మాత్రమే నెగ్గలేదు. ఈ టోర్నీలో రెండుసార్లు ఫైనల్‌కు చేరుకున్నా, డబ్ల్యూటీసీ టైటిల్ భారత్‌కు కలగానే మిగులుతోంది. విరాట్ కెప్టెన్సీలో 2021, రోహిత్ సారథ్యంలో 2023లో టీమ్‌ఇండియాకు ఫైనల్‌లో నిరాశే మిగిలింది. ఇక కొత్త కెప్టెన్ గిల్ నేతృత్వంలోనైనా భారత్ డబ్ల్యూటీసీ 'గద' అందుకోవాలని టీమ్‌ఇండియా ఫ్యాన్స్ అతడికి ఫ్యాన్స్ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.

## బుమ్రాకు టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు ఎందుకివ్వలేదు?




చాలా కాలంగా, జస్‌ప్రీత్ బుమ్రా కూడా టెస్ట్ జట్టు కెప్టెన్సీ రేసులో ఉన్న సంగతి తెలిసిందే. కానీ సెలెక్టర్లు గిల్ వైపే మొగ్గు చూపారు. అయితే ఈ నిర్ణయం వెనుక కారణం కూడా వెలుగులోకి వచ్చింది. జట్టు ప్రకటన తర్వాత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ టెస్ట్ కెప్టెన్‌గా బుమ్రాను కాదని.. శుభ్‌మాన్ గిల్‌ను ఎందుకు ఎంచుకున్నారో వివరించారు. అయితే బుమ్రా మొత్తం సిరీస్ ఆడతాడనే గ్యారెంటీ లేదని అగార్కర్ అన్నారు. ఇంగ్లాండ్‌తో జరిగే ఐదు టెస్టులకూ బుమ్రా అందుబాటులో ఉంటాడని తాను అనుకోలేదని అగార్కర్ అన్నారు. అతను మూడు మ్యాచ్‌లు ఆడినా లేదా నాలుగు మ్యాచ్‌లు ఆడినా, మనం ఫిజియో బృందంతో కలిసి దీనిని అంచనా వేయాల్సి ఉంటుందని తెలిపారు. బుమ్రా ఫిట్‌నెస్, పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యలను బట్టి స్పష్టంగా అర్థం అవుతోంది. ఒక ఫాస్ట్ బౌలర్‌గా, ఇంగ్లాండ్‌లో వరుసగా ఐదు టెస్టులు ఆడటం ఏ ఆటగాడికైనా సవాలు వంటిది. దానికి తోడు, కెప్టెన్సీ బాధ్యతను చేపట్టడం అతనికి మరింత ప్రమాదకరంగా ఉండేది. బుమ్రా గాయం చరిత్ర కూడా ఈ నిర్ణయానికి ఒక ముఖ్యమైన కారణం అయ్యింది.

## టీమిండియా జట్టు ఇదే:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్, వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధృవ్‌కే జురెల్, ధృవ్‌షింగ్‌టన్ జురెల్ జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.

# భక్తులతో కిటకిటలాడిన కాళేశ్వరం

- ఏర్పాట్లలో దేవాదాయ శాఖ విఫలం
- పదో రోజు భారీగా తరలివచ్చిన భక్తజనం..
- కాళేశ్వరం నుండి పల్గుల వరకు ట్రాఫిక్ జామ్..
- సరస్వతి ఘాట్ కు దూరమైన పార్కింగ్ స్థలాలు..
- దూరభారంతో ఇబ్బందులు పడిన భక్తులు..
- తలలు పట్టుకుంటున్న అధికారులు..





జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం భక్తులతో శనివారం కిటకిటలాడింది.. పదో రోజు భక్తులు భారీగా తరలిరావడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి.. కాళేశ్వరం నుండి పలుగుల వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.. నిరీక్షణ చేయలేక భక్తులు వాహనాలను వదిలేసి కాలినడకన సరస్వతి ఘాటుకు తరలివెళ్లారు.. పార్కింగ్ స్థలాలు ఎక్కడికక్కడ నిండిపోవడంతో వాహనాలకు చోటు లేకుండా పోయింది.. దీంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.. వాహనాలు కదలలేని పరిస్థితుల్లో ఉండడంతో అనేకమంది భక్తులు వాహనాలు దిగి నడిచి వెళ్లాల్సి వచ్చింది.. సరస్వతి ఘాట్ వద్దకు వెళ్లి, ఆ తర్వాత కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయంలో మొక్కులు చెల్లించారు.. దూర భారంతో భక్తులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల బురదమయం కావడంతో రోడ్లు ఇరుకుగా మారాయి.. సరస్వతి ఘాటు, కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, ఆర్టీసీ బస్టాండ్, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ స్థలాలకు వెళ్లే దారులన్నీ శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి.. మేడారం జాతరను తలపించేలా భక్తులు తరలిరావడంతో ఎటు చూసినా జన ప్రవాహమే కనిపించింది.. భక్తుల తాకిడి పెరగడంతో అధికారులు తలలు పట్టుకున్నారు.. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.. ముఖ్యంగా ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.. దూర భారంతో పడరాని పాట్లు పడ్డారు.. నరకయాతన అనుభవించారు..

### సరస్వతి పుష్కరాలకు భారీగా తరలివచ్చిన భక్తజనం..

పదో రోజైన శనివారం సరస్వతి పుష్కరాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీతో ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి. సరస్వతి నదీ పుష్కరాలు కొనసాగుతున్న నేపథ్యంలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కర ఘాట్ లో శనివారం ఉదయం నుండే భక్తుల రద్దీ పెరుగుతూ వచ్చింది. లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం ఘాట్ కు తరలిరావడంతో దారులన్నీ జనసంద్రంగా మారాయి. ప్రభుత్వం తరఫున పుష్కర స్నానాల కోసం భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, అంచనాకు మించి భక్తులు తరలిరావడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. భక్తులకు అందుబాటులో శుద్ధమైన నీటి సరఫరా, వైద్య సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ పాట్లు తప్పలేదు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరేలు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తూ, రద్దీ నియంత్రణ చర్యల్లో భాగంగా తాత్కాలిక బస్ స్టాండ్, పార్కింగ్ ప్రదేశాల నుండి భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించినా, పోలీస్ శాఖ, రెవెన్యూ, పంచాయతీ, ఆరోగ్య శాఖలు, ఆర్ డబ్ల్యూఎస్, దేవస్థానంతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినా ఫలితం శూన్యమైంది. భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు..యంత్రాంగం పూర్తి స్థాయిలో భక్తులకు సౌకర్యాలు కల్పనలో నిమగ్నమయ్యారు. ఉదయం నుండి భక్తుల రద్దీ కొనసాగుతున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సౌకర్యాలు పర్యవేక్షణ చేస్తూ వాకి టాకీ ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నా, ముందుచూపు కొరవడడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో ఫెయిల్ అయ్యారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు బురదమయం కాగా, తాత్కాలికంగా పీఆర్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా స్టోన్ డస్ట్ వేయించినప్పటికీ, కాలినడకన పాదరక్షలు లేకుండా వచ్చిన భక్తులకు చుక్కలు కనిపించాయి. కంకర రోడ్డుపై నడవలేక తల్లడిల్లిపోయారు.

### ట్రాఫిక్ ను కంట్రోల్ చేయలేకపోతున్న అధికారులు..

కాళేశ్వరం వెళ్లే దారుల్లో ట్రాఫిక్ ను అధికారులు కంట్రోల్ చేయలేకపోతున్నారు. ముందస్తు ప్లాన్ లేకుండా వాహనాల రద్దీని అంచనా వేయకపోవడంతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా పదో రోజు అంచనాకు మించి వాహనాలు భారీగా రావడంతో అధికారులు క్రమబద్ధీకరించడంలో విఫలమయ్యారు. దీంతో భక్తులు ట్రాఫిక్ లో ఇరుక్కుని నానా ఇబ్బందులు పడ్డారు. ఓవైపు పార్కింగ్ స్థలాలు ఎక్కడికక్కడ నిండిపోగా, రోడ్ల వెంట కూడా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పార్కింగ్ స్థలాల నుండి ప్రధాన రోడ్డుకు రావాలంటేనే గంటల తరబడి సమయం పడుతుంది. ఇక బయట నుండి వచ్చే వాహనాలన్నీ పార్కింగ్ స్థలాలకు వెళ్లలేక రోడ్లపైనే నిలిచిపోవడంతో భక్తులు పడరాని పాట్లు పడ్డారు. కాళేశ్వరం, మహాదేవపూర్ మధ్య ప్రధాన రహదారిని వన వే చేసినప్పటికీ ఆ రహదారి వెంట కూడా ప్రైవేటు వాహనాలను వెళ్ళనివ్వలేదు. చివరికి పలుగుల, గంగారం, కాటారం మీదుగా భూపాలపల్లి, హనుమకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను పంపించారు. కాళేశ్వరానికి వచ్చే దారులన్నీ వాహనాలతో నిండిపోవడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. సరస్వతి ఘాటు వద్దకు ప్రైవేటు వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. కనీసం పార్కింగ్ స్థలాలకు కూడా ప్రైవేట్ వాహనాలు వెళ్ళలేని పరిస్థితి ఉండడంతో రోడ్లపైనే ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. భక్తులు నిలిచిపోయిన వాహనాల నుండి దిగి కాలినడకన సుమారు 10 కిలోమీటర్ల వరకు గమ్యస్థానాలకు చేరుకున్నారు. కేవలం ట్రాఫిక్ సమస్య వల్ల గంటల తరబడి ఆలస్యం అవుతుండడంతో భక్తులు పడరాని పాట్లు పడ్డారు. మిగతా రెండు రోజుల్లో ఇంకా భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉండడంతో సంబంధిత అధికారులు ఏ మేరకు చర్యలు చేపడతారనే సందేహం భక్తుల్లో నెలకొంది.

### చివరి రెండు రోజుల్లో భక్తులు లక్షల్లో వచ్చే అవకాశం..

సరస్వతి పుష్కరాలకు రానున్న రెండు రోజుల్లో లక్షలల్లో భక్తులు వచ్చే అవకాశం ఉంది. జిల్లా యంత్రాంగం అనునిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అప్రమత్తం చేస్తున్నప్పటికీ, ఆచరణలో అది శూన్యమవుతుందనే చెప్పాలి.

సరస్వతి పుష్కరాల కొనసాగుతున్న నేపథ్యంలో 10 వ రోజు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఏర్పాట్లను పరిశీలించి, రానున్న రెండు రోజులు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సరస్వతి ఘాట్ లో భక్తల రద్దీని పరిశీలించి, కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, రక్షణ చర్యలు, విఐపిలు పుణ్య స్నానాలు ఆచరించడానికి ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని, కంటైనర్ ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మెయిన్ ఘాట్ నుండి సరస్వతి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డులో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విఐపిల కోసం ఏర్పాటు చేసిన కంటైనర్ లో క్రమం తప్పక నీటి సరఫరా ఉండే విధంగా చూడాలని సూచించారు. ఘాట్ ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని తెలిపారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని భక్తుల రద్దీని పరిశీలించి పుష్కరాల సేవలు ఏవిధంగా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకున్నారు. క్యూ లైన్ల రద్దీని దృష్టిలో ఉంచుకొని త్వర త్వరగా దర్శనాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అక్కడి నుండి కాళేశ్వరం లోని పలుగుల జంక్షన్, తాత్కాలిక బస్టాండ్, ఇప్పల బోరు జంక్షన్, పార్కింగ్ స్థలాలను పరిశీలించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులతో మాట్లాడారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా పోలీసులు అప్రత్తంగా ఉండాలని ఎలాంటి ప్రమాదాలు జరగ కుండా సురక్షిత ప్రయాణాలు చర్యలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనదారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.



# ఇండ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

- తెలంగాణ వ్యవసాయ సలహాదారులు పోచారం



నిజామాబాద్ జిల్లా బ్యూరో ఇంచార్జి మే 24 (జనం సాక్షి) : బాన్సువాడ నియోజకవర్గంలో ఇండ్లు లేని ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తానని, ఇందిరమ్మ ఇండ్లు కేవలం అర్హులైన వారికేనని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ అర్బన్, రూరల్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాన్సువాడ అర్బన్ కు 260 మంది, రూరల్ మండలంలో 353 మంది లబ్ధిదారులకు మొత్తం 613 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి,ఇళ్ల నిర్మాణం పైన అవగాహన కల్పించారు. నిరుపేదలందరికీ ఇల్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులైన వారు ముందుకు వస్తే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని తెలియజేసారు. తదుపరి బాన్సువాడ పట్టణం కోటగల్లి లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఇంచార్జి అడిషనల్ కలెక్టర్ చందర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బీసీ గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల ఫలితాలు విడుదల



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర బీసీ గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి ఫలితాలు ప్రకటించటం జరిగింది. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్https://mjpt-bcwreis.telangana.gov.in, https://mjpabcwreis.cgg.gov.in ద్వారా పరిశీలించవచ్చని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. గత సంవత్సరాల వరకు ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయించబడగా, ఈ ఏడాది నుండి ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా, 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 130 బాయ్స్ కాలేజీల్లో 11,360 సీట్లు ఉండగా, 127 గర్ల్స్ కాలేజీల్లో 10,720 సీట్లు కలిపి మొత్తం 22,080 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 61,119 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 22,080 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని, సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ తీసుకోవాలని ఆయన సూచించారు.

జనంసాక్షి www.janamsakshi.org ఆదివారం 25 మే 2025

# రాజీవ్ శాంతినగర్ ఎత్తిపోతల పథకం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- లిఫ్ట్ ద్వారా 5000 ఎకరాలకి శాశ్వతంగా సాగునీరు
- రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**కోదాడ (జనంసాక్షి) :** రాజీవ్ శాంతినగర్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం అనంతగిరి మండలం శాంతినగర్ లోని పాలేరు వాగుపై 54 కోట్ల రూపాయలతో నిర్మించే రాజీవ్ శాంతి నగర్ ఎత్తి పోతల పథకంను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి చే శాంతి నగర్ లిఫ్ట్ ని ప్రారంభించటం జరిగిందని, 2016 తరువాత లిఫ్ట్ పని చేయటం లేదని గత ఆగస్టు 30 న వచ్చిన వరదతో పుంపు హౌస్ దెబ్బ తినదని తెలిపారు. ఎంత పెద్ద వరద ఉధృతినైనా తట్టుకునేలా శాశ్వతంగా ఉండేలా గత పంపు హౌస్ కంటే 3 మీటర్ల ఎత్తులో రాజీవ్ శాంతి నగర్ లిఫ్ట్ నిర్మించటం జరుగుతుందని దీని ద్వారా అనంతగిరి మండలంలోని 7 గ్రామాలలో 3129 ఎకరాలు,కోదాడ మండలం లోని 3 గ్రామాల పరిధిలో 1781 ఎకరాలు మొత్తం 5000 ఎకరాలు తీవ్ర కరవు వచ్చిన పాలేరు వాగు నుండి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకొని రావటం జరుగుతుందని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ కి సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు,అలాగే మున్నేరు నీరు ని పాలేరు కి తరలించి సాగు నీరు వదలటం జరుగుతుందని తెలిపారు. శాంతి నగర్ లో పాలేరు వాగుపై ఇప్పుడు ఉన్న చెక్ డ్యామ్ వల్ల ఉపయోగం లేదని మరొక చెక్ డ్యామ్ నిర్మిస్తామని అన్నారు. రైతులకి పైపులు భూమికింద నుండి పోయిన నష్టపరిహారం చెల్లిస్తామని,ఎత్తి పోతల పథకానికి,చెక్ డ్యామ్ కి రాజకీయాలకి తావు లేకుండా రైతులు సహకరించాలని మనం అందరం కలిసి అద్భుతమైన ఎత్తిపోతల పథకం నిర్మించుకుందాము అని ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు,ఆర్డీవో సూర్యనారాయణ,లిఫ్ట్ ఇరిగేషన్ సీఈ రమేష్ బాబు,మండల పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి,తహసిల్దార్ హిమబిందు,మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు,మాజీ జెడ్పిటిసి కొనతం ఉమా,గునుకుల గోపాల్ రెడ్డి పేరు,బుర్ర పుల్లారెడ్డి,కొండపల్లి వాసు,డేగ కొండయ్య,గుర్రం వెంకటరెడ్డి,బుర్ర నరసింహారెడ్డి, రాఘవరెడ్డి,వెంపటి వెంకటేశ్వరరావు,కిరణ్ రెడ్డి,బద్దం కృష్ణారెడ్డి,గింజుపల్లి రఘు,నాగుల మీరా,దస్తగిరి,మట్టపల్లి రామకోటయ్య మట్టపల్లి నరేష్,సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# కరోనాపై ఆందోళన వద్దు

- మన దేశంలో పరిస్థితి నార్మల్‌గానే ఉంది
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, (జనంసాక్షి) :** కరోనాపై ఆందోళన చెందాల్సిన పని లేదని, మన దేశంలో పరిస్థితి నార్మల్‌గానే ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ డిసీజ్‌ల నివారణ, నియంత్రణపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష చేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, డీఎంఈ నరేంద్రకుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు, ఎపిడమాలజిస్టులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి రాష్ట్రాలకు ఇప్పటివరకూ అడ్వైజరీలు, గైడ్‌లైన్స్ ఏమీ రాలేదు అని అధికారులు తెలిపారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉండడం, ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేకపోవడమే ఇందుకు కారణమై ఉండొచ్చునని అభిప్రాయపడ్డారు. సుమారు 3 సంవత్సరాల క్రితమే కోవిడ్ ఎండెమిక్ స్టేజ్‌లోకి వచ్చిందని, అప్పుడప్పుడు కేసులు నమోదు అవడం, తగ్గడం, పెరగడం సహజమేనని ఎపిడమాలజిస్టులు మంత్రికి వివరించారు. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశం కూడా ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ నమోదయ్యే కోవిడ్ కేసులను మేనేజ్ చేయడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని అధికారులు మంత్రికి తెలిపారు. టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ సహా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఉండాలన్నారు. కరోనా, సీజనల్ డిసీజ్‌ల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కోవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు మంత్రి సూచించారు. వర్షాకాలంలో సీజనల్ డిసీజ్‌ల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలుబు, దగ్గులాగే కోవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని.. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్కు ధరించడం వల్ల ఒకరి నుంచి ఒకరికి వైరస్‌లు వ్యాపించకుండా ఉంటాయన్నారు. ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంటే దోమలు పెరిగి, వ్యాధులు వ్యాపించే ప్రమాదముంటుందని, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై పంచాయతీరాజ్, మునిసిపల్, ఇతర శాఖలతో కలిసి పని చేయాలన్నారు. అన్ని హాస్పిటల్లలో సరిపడా మెడిసిన్, ఇతర రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కోవిడ్, డెంగీ పేరిట ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఉగ్రకదలికలపై దృష్టిసారించిన ఎన్ఐఏ

- సిరాజ్ చుట్టూ దర్యాప్తును ముమ్మరం



**హైదరాబాద్, మే24 (జనంసాక్షి):** ఉగ్ర కదలికలపై తీవ్ర దృష్టిసారించిన జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ, హైదరాబాద్‌లో కీలకంగా మకాం వేసిన సిరాజ్ అనే వ్యక్తి చుట్టూ దర్యాప్తును ముమ్మరం చేసింది. గత ఏడు సంవత్సరాలుగా గ్రూప్స్ పరీక్షల శిక్షణ పేరుతో హైదరాబాద్‌లో తిష్ట వేసిన సిరాజ్, పక్కా వ్యూహంతో కార్యకలాపాలను సాగించినట్లు అధికారులు గుర్తించారు. సిరాజ్‌తో కలిసి ఉన్న సమీర్ అనే వ్యక్తి – హైదరాబాద్, విజయనగరం, ఢిల్లీ, బెంగళూరు, ముంబైలో రెక్కీ చేసినట్లు– తెలిసింది. గత సంవత్సరం నవంబరు 22న ముంబయి అంధేరిలో జరిగిన ఓ మత కార్యక్రమానికి సిరాజ్, సమీర్ హాజరైనట్లు– విచారణలో వెల్లడైంది. అందులో అధాన్ ఖురేషి, దిల్వాన్, మొహిసిన్ షేక్, జసీర్ అలియాస్ అమన్, ఫహాద్, అమిర్ అన్సారీ వంటి వ్యక్తులెందరికీ సంబంధించిన సంబంధాలు కూడా వెలుగుచూశాయి. ఒమన్, సౌదీ దేశాల నుంచి సిరాజ్, సమీర్లకు ఆర్థిక సాయం అందినట్లు గుర్తించిన అధికారులు, ఆ ఛానెల్లపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే యూపీకి చెందిన బాదర్ అనే వ్యక్తి, ఫర్హాన్ మోయినుద్దీన్ అనే వరంగల్ యువకునితో సిరాజ్ సంబంధాలు ఉన్నట్లు– తెలిసింది. బాదర్‌తో సిగ్నల్ యాప్ ద్వారా కాంటాక్ట్‌లో ఉండటం, ఫర్హాన్ కోసం ప్రత్యేకంగా నాలుగు బృందాల గాలింపు చర్యలు కొనసాగించడం ప్రస్తుతం దర్యాప్తులో కీలకాంశంగా మారింది. సిరాజ్ స్థాపించిన సంస్థలో సభ్యత్వం కలిగి ఉన్న ఇతరులను కూడా గుర్తించే ప్రయత్నంలో ఉన్న ఎన్ఐఏ, దేశీయంగా మరియు అంతర్జాతీయంగా ఉగ్రవాద అనుకూల స్వభావమున్న యువకులతో సంబంధాలను విపులంగా పరిశీలిస్తోంది. సిరాజ్, సమీర్ల ప్లాన్ ఏమిటన్నదానిపై క్లారిటీ కోసం అధికారులు మరింత లోతుగా ఆరా తీస్తున్నారు. ఈ విచారణతో పాటు–, ఇతర అనుమానాస్పద చర్యలను పసిగట్టి ముందస్తు చర్యలు తీసుకునే దిశగా భద్రతా సంస్థలు సన్నద్ధమవుతున్నాయి.

# అటవీ ప్రాంతాల అభివృద్ధికి సహకరిద్దాం

- అటవీ సంరక్షణ... ఆదివాసీల అభివృద్ధి రెండూ అవశ్యమే
- చిన్నచిన్న అంశాలకు గిరిజనులను ఇబ్బంది పెట్టొద్దు
- అటవీ శాఖ అధికారులకు ఫారెస్టు మినిస్టర్ కొండా సురేఖ ఆదేశం
- మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అటవీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో సమీక్ష



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అటవీ ప్రాంతాల అభివృద్ధికి ఫారెస్టు డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు, డీఎఫ్ఓలు సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. అటవీ సంరక్షణ... గిరిజనుల అభివృద్ధి రెండూ అనివార్యమేనని అన్నారు. నిబంధనలను పాటిస్తూ... అటవీ ప్రాంత ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఫారెస్టు అధికారులు చూడాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, మౌలిక సదుపాయాల కల్పన సంబంధిత పనులు, అటవీ శాఖ అనుమతులకు ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించేందుకు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం శనివారం తెలంగాణ సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు, ఎంఎల్ఏలు వెడ్మా బొజ్జు, కోవా లక్ష్మీ, పాల్వాయి హరీశ్, అనిల్ జాదవ్, ఎంఎల్సీ దండే విఠల్, సీసీఎఫ్, డీఎఫ్ఓ, ఐటిడిఎ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను మంత్రులకు వివరించారు. మంత్రి సురేఖ స్పందిస్తూ... గిరిజనుల బతుకులు మారాలంటే ఆయా ప్రాంతాల అభివృద్ధి జరగాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, వెడ్మా బొజ్జు, కోవా లక్ష్మీ, డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ... అంగన్వాడీలు, స్కూల్ భవనాలు, ఇండ్లు కట్టుకోవడానికి కూడా ఫారెస్టు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పగా... ఆయా ప్రాంతాల్లోని డీఎఫ్ఓలకు ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు లోబడి ఉన్నవాటిని పరిష్కరించాలని... ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వన్యప్రాణి సంరక్షణ, అటవీ భూమి పరిరక్షణ అవసమేనని... కానీ, అటవీ ప్రాంత ప్రగతి కూడా అనివార్యమన్నారు. ఇక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... తమ ప్రాంతంలో రోడ్లకి పర్మిషన్ ఇవ్వడం లేదని దాంతో రాకపోకలు ఇబ్బంది అవుతున్నదని చెప్పారు. ఈ విషయంపై ఇచ్చిన ప్రతిపాదనలు, వర్క్ సాంక్షన్ వివరాలు తమ వెంటనే అందజేయాలని సంబంధిత డీఎఫ్ఓను మంత్రి సురేఖ ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో గిరిజనులు బోర్లు వేసుకుంటే ఎక్కడిక్కడ ఇబ్బందులు పెడుతున్నారని ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు మంత్రి సురేఖ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యేలు నివేదించిన పనుల మీద అధికారులు పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు మంత్రి కొండా సురేఖ. వాటిని మరొకసారి పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3 వారీగా పనులను పూర్తి చేయాలని మంత్రి సురేఖ చెప్పారు. స్టేజ్-1లో(వెంటనే అయ్యే పనుల) గురించి రెండు, మూడు రోజుల్లో ఒక ప్రత్యేక నివేదిక అందజేయాలని ఆదేశించారు. అటవీ శాఖ కఠిన నిబంధనల వల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో అటవీ సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి సురేఖ దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకువచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాలు చూపించాలనే ఉద్దేశంతో అటవీ శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, రోడ్లు భవనాల శాఖ, ఐటీడీఏ శాఖలతో శనివారం సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు మంత్రి చెప్పగా వారు తమ సమస్యలు వివరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను విస్తృతంగా చర్చించి, ఒక పరిష్కార మార్గాన్ని చూపించాలని అటవీ అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. గిరిజనుల అభివృద్ధికి అటవీ శాఖ ఉన్నతాధికారులు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌నకు బీసీ గురుకుల విద్యార్థులు

- శిక్షణ పూర్తి చేసుకున్న బేస్ క్యాంప్‌నకు వెళ్ళే విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కారం
- భువనగిరి లోని రాక్ క్లైమ్బింగ్ స్కూల్ లో 2 రోజుల పాటు 200 మంది విద్యార్థులకు శిక్షణ..
- శిక్షణ లో ప్రతిభ, శక్తి సామర్థ్యాలు కనబరిచిన వారి నుండి 20 మందిని ఎవరెస్ట్ బేస్ క్యాంప్ క ఎంపిక





**హైదరాబాద్ (జనంసాక్షి) :** మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ లోని అడ్వెంచర్ క్యాంప్ కు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన 20 విద్యార్థిని విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు ఈనెల 25 నుండి జూన్ 10 వరకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద ట్రెక్కింగ్ చేయనున్నారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ సెలక్షన్స్ కోసం కోరుకుల పాఠశాల నుండి 100 మంది బాలికలు 100 మంది బాలురు లను ఎంపిక చేసి రెండు రోజుల పాటు భువనగిరి లోనీ రాక్ క్లైమ్బింగ్ శిక్షణ తీసుకున్నారు. అందులో నుండి 20 మందికి ఎంపిక చేశారు. వారికి సెక్రటేరియట్ లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,గురుకుల సెక్రటరీ సైదులు మెడల్స్ తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వీరు చిన్న వయసులోనే ఎవరెస్ట్ అధిరోహించిన మాలవత్ పూర్ణ, రాకేష్ ల ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారు. ఈ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ ద్వారా విద్యార్థులు మనుగడ పద్ధతులను ,ఈ ప్రాంత సంస్కృతిని నేర్చుకుంటారు. ఈ శిబిరం శారీరక,దృఢత్వం మానసిక స్థితిస్థాపత ప్రోత్సహిస్తుంది. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కి వెళ్ళే విద్యార్థిని విద్యార్థులకు మంత్రి మెడల్స్ ,శాలువాలతో పొన్నం సత్కరించారు. రేపు ఉదయం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కివెళ్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించాలంటే జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాలకు ,తల్లిదండ్రులకు ,ప్రాంతానికి , రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించి రికార్డు క్రియేట్ చేయాలని తెలిపారు. కలలు కనడం తప్పు కాదు భవిషత్ లో మంచి తెచ్చుకోవడానికి కష్టపడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ట్రెక్కింగ్ చేస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సెక్రటరీ సైదులు , జాయింట్ సెక్రెటరీ తిరుపతి, శిక్షకులు మాలవత్ పూర్ణ, రాకేష్ లు పాల్గొన్నారు.

# ఎవరా దయ్యాలు..ఏమిటా రహస్యం

- బిఆర్ఎస్‌లో ఏం జరుగుతోందన్న చర్చ
- పార్టీలో సంచలనంగా మారిన కవిత వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే24 (జనంసాక్షి) :** కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ కొన్ని దయ్యాలు ఉన్నాయి. వాళ్ల వల్ల చాలా నష్టం జరుగుతోందని ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బిఆర్ఎస్ రాజకీయాల్లో సంచలనంగా మారాయి. కవిత తాను లేఖ రాసానని ఒప్పుకున్నారు. ఈ లేఖ బిఆర్ఎస్ అంతర్గత రాజకీయాలకే సంబంధించింది తప్ప మరోటి కాదు. తెలంగాణ రాజకీయాలతో దీనికి ఎలాంటి సంబంధంలేదు. బిఆర్ఎస్‌లో జరుగుతున్న నిరంకుశ విధానాలను ఎండగట్టే లక్ష్యంతో కవిత ఈ లేఖ రాసారని అర్థం అవుతోంది. ఇక దయ్యాలు అంటే ఎవరన్న చర్చ అప్పుడే మొదలయ్యింది. కుట్రలు చేస్తున్న ఆ దయ్యాలే.. తన తండ్రికి తాను రాసిన లేఖను లీక్ చేశాయని.. పార్టీలో తనపై అంతర్గతంగా కుట్రలు జరుగుతున్నాయని కవితఆరోపించారు. నిజంగానే కవిత అంటే పడని వారు ఎవరు. పార్టీని గుప్పిట పెట్టుకుని నడిపిస్తున్నది ఆమె సొంత అన్ననే. ఆమనే పెత్తనం చలాయిస్తున్నారు. తరవాత హరీష్ రావు ఉన్నారు. ఆ తరవాత ఒకరిద్దరు ఉన్నా..వారు పార్టీని ప్రభావితం చేసే స్థాయిలో లేరు. దయ్యాలంటే ఈ ఇద్దరేనా అన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు కూడా ఇదే కరెక్ట్ అని వ్యాఖ్యానిస్తున్నారు. అన్న కెటిఆర్‌తో కవికు పొసగడం లేదని అంటున్నారు. అమెరికా నుంచి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్న కవిత. ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. తాను తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు హాజరై తిరిగి వచ్చేసరికి.. లేఖ లీక్ అయ్యిందంటూ హంగామా జరుగుతోందని, ఆ లేఖ రెండు వారాల క్రితం కేసీఆర్‌కు తాను రాసిందేనని స్పష్టత ఇచ్చారు. గతంలో కూడా కేసీఆర్‌కు తన అభిప్రాయాలను ఇలా లేఖ ద్వారా చెప్పానని కూడా ఆమె పేర్కొన్నారు. ఆనటి లేఖ ఇప్పటి వరకు బహిర్గతంకాలేదు. ఇప్పుడే ఎందుకు బహిర్గతం అయ్యిందన్న వాదనా ఉంది. లేదా డవర్షన్ పాలిట్రిక్స్‌లో భాగామా అన్న చర్చ కూడా సాగుతోంది. ఇకపోతే వరంగల్ సభ తరువాత లేఖ ద్వారా తన అభిప్రాయాలను పార్టీ అధినేతకు వెల్లడించానని.. కేసీఆర్‌కు లేఖ రాయడంలో తనకు ఎలాంటి వ్యక్తిగతఎజెండా లేదని ఆమెస్పష్టం చేశారు. తండ్రితో చనువు ఉన్న కవిత వివరాలు నేరుగా చెప్పకుండా లేఖ రాయాల్సిన అసవర ఏముందన్నదే అసలు ప్రశ్న. ఇందులో ఏదో తిరకాసు లేకుంటే లేఖ రాయాల్సిన అవసరమేముంటుంది. పార్టీలో అన్ని స్థాయిల్లో ఉన్న వారూ అనుకునే విషయాలు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటున్న విషయాలను మాత్రమే తాను లేఖలో రాశానని చెప్పారు. నేను కేసీఆర్‌కు లేఖలు రాయడం కొత్తేమీ కాదు. ఆయనకు తరచుగా సమాచారం (ఇస్తాను. నేను లేఖ ద్వారా వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో ప్రత్యేకత ఏమీ లేదని ఆమె తేల్చిచెప్పారు. కానీ, ఈసారి తాను రాసిన లేఖ బయటికి రావడం బాధాకరమన్నారు. తనకు వ్యక్తిగతంగా ఎవరిపైనా ద్వేషంగానీ ప్రేమగానీ లేవని ఆమె పేర్కొన్నారు. అయితే, తన తండ్రికి తాను అంతర్గతంగా రాసిన లేఖ బహిర్గతమైందంటే.. దాని వెనుక ఎవరున్నారనే విషయాన్ని పార్టీనాయకులు, తెలంగాణ ప్రజలు అందరూ ఆలోచించాలని.. దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని కవిత అభిప్రాయ పడ్డారు.

# 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు

- వికసిత్ భారత్ సాకారంతో స్వర్ణాంధ్ర సాధించే లక్ష్యం
- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రజెంటేషన్‌తో వివరించిన సిఎం చంద్రబాబు



**న్యూఢిల్లీ, మే24 (జనంసాక్షి) :** ఎపిని అభివృద్ధి పథంలో ముందు నిలిపేలా...2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు ఎపి సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో వివరించారు. నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు వికసిత్ భారత్–2047, స్వర్ణాంధ్రపై నివేదిక ఇచ్చారు. పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తన ప్రజంటేషన్‌లో ప్రస్తావించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజంటేషన్‌లో చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను తీర్చిదిద్దనున్నట్లు సీఎం వెల్లడించారు. విశాఖకు గ్లోబల్ హంగులు అద్దేలా నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్,ఎఐ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్టు స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కొనసాగుతోంది. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన గవర్నర్‌లు, సీఎంతో ప్రధాని మాట్లాడారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో వికసిత్ భారత్–2047, స్వర్ణాంధ్రపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివేదిక ఇచ్చారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే వివిధ అంశాలను తన ప్రజెంటేషన్‌లో చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజెంటేషన్‌లో ఏపీ సీఎం ప్రస్తావించారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ఏపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు చంద్రబాబు వివరించారు. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్టు– ప్రజెంటేషన్‌లో వివరించారు. రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో తెలిపారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఒప్పందం.. కర్నూలులో డ్రోన్ సిటీ– ప్లాన్లను ప్రజెంటేషన్‌లో ప్రత్యేకంగా వివరించారు. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు బిడ్డల నిబంధన రద్దు చేసినట్టు ప్రజెంటేషన్‌లో సీఎం వివరించారు. మాతృత్వ సెలవులను 180 రోజులకు పెంచినట్టు– సీఎం వెల్లడించారు. ప్రతి జిల్లా, నియోజకవర్గంలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు, రాష్ట్ర పురోగతిని కొలిచేందుకు 523 కీలక సూచికలు సిద్ధం చేశామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370